ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

2-2-2026 సోమవారం సంపుటి: 31 సంచిక: 362 పేజీలు: 8+4 వెల: 6.50

మహిళా సంఘాల బలోపేతానికి 'షీమార్ట్'లు
ఐదు మెడికల్ హబ్‌లు, లక్ష ఎహెచ్‌పిలు 5లో






ఆదివారం పార్లమెంటుకు బడ్జెట్‌ను సమర్పిస్తున్న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

# 3 కర్తవ్యాల కొత్త పద్దు

## ధరలు తగ్గేవి..

విదేశీ పర్యాటక ప్యాకేజీలు, విదేశీ విద్య, సోలార్ ప్యానెల్స్, కేన్సర్ తదితర ప్రాణాధార 17 ఔషధాలు, అణు విద్యుత్ పరికరాలు, విద్యుత్ వాహనాల బ్యాటరీలు, భారత్‌లో తయారయ్యే స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లెట్లు

## పెరిగేవి..

విలాసవంతమైన వాచ్‌లు, ఆల్కహాల్, సిగరెట్లు, పాన్ మసాలా, కాఫీ రోస్టింగ్ యంత్రాలు, కొన్ని రకాల ఎరువులు, కెమెరాలు. ఆదాయం వివరాలు సరిగా చూపని వారికి విధించే జరిమానా 100% పెంపు

### 2026-27 కేంద్రబడ్జెట్‌లో 6 కీలకరంగాల్లో సంస్కరణలు

### మొత్తం బడ్జెట్: రూ.53.47లక్షల కోట్లు

### రెవెన్యూ వసూళ్లు: రూ.35.33లక్షల కోట్లు

### ద్రవ్యలోటు: 4.3%గా అంచనా

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 1:** కొత్త ఆర్థికసంవత్సరానికి గాను ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ రూ.53.47 లక్షలకోట్లతోకూడిన బడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పించారు. గత ఏడాది బడ్జెట్ అంచనాలతోపోలిస్తే స్వల్పంగా బడ్జెట్ స్వరూపం మారింది. ఆదాయ వనరులు రూ.35,33,150 కోట్లు కాగా మూలధన రాబడులే రూ.18,14,165 కోట్లుగా ఉన్నాయి. ఈ మొత్తం రాబడులు 53,47,315 కోట్లుగా పద్దుల్లో పేర్కొన్నారు.ఇక మొత్తంవ్యయం కూడా గత యేడాదితో పోలిస్తే సమాంతరంగాపెరుగుతూ వచ్చింది. గత ఏడాది బడ్జెట్ సవరణ అంచనాల్లో రూ. 49,64,842 కోట్లుగా ఉంటే ఈ ఏడాది బడ్జెట్ అంచనాలు రూ.53,47,315 >>2



## ఇది సంస్కరణల ఎక్స్‌ప్రెస్

### బడ్జెట్‌పై ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** "నేటి బడ్జెటు చరిత్రాత్మకమైందనీ, దేశ మహిళల సాధికార భావనకు ఇది అద్దం పడుతోందనీ ప్రధానమంత్రి నరేం ద్రమోడీ వర్ణించారు. భవిష్యత్తుకు రోడ్ మ్యాప్‌గా నిలుస్తుందని చెప్పారు. త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. చరిత్రాత్మక బడ్జెట్ ప్రవేశపెట్టామని చెప్పారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మహిళా ఆర్థిక మంత్రిగా వరుసగా తొమ్మిదో సారి దేశ బడ్జెటును ప్రవేశపెట్టి, రికార్డును నెలకొల్పారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ప్రధాని మోడీ తన స్పందనను >>2

# ఎపికి భారీ కేటాయింపులు

**విజయవాడ,ఫిబ్రవరి 1, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అభివృద్ధికి తాజా బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భారీగానే నిధులు కేటాయించారు. అమరావతి రాజధాని అభివృద్ధికి (ఏడీబీ నిధులు) రూ.1128.91 కోట్లు.అమరావతి సమీకృత పట్టణాభివృద్ధి కోసం (జపాన్ నిధులు) రూ.432.09 కోట్లు ఏపీ గ్రామీణ రహదారి ప్రాజెక్టులకు రూ.500.99 కోట్లు ఏపీ పట్టణ మంచి, మురుగు నీటిపారుదల నిర్వహణకు రూ.800 కోట్లు ప్రకృతి వ్యవసాయానికి రూ.155.32 కోట్లు రహదారులు, వంతెనల పునర్‌నిర్మాణం కోసం రూ.350 కోట్లు కేటాయించారు.కేంద్ర బడ్జెట్‌లో భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏపీకి సంబంధించి పలు కీలక ప్రకటనలను చేశారు. ఖనిజ వనరులున్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహం అందించేందుకు చర్యలు తీసుకుంటామని నిర్మలా సీతారామన్ తెలిపారు. రేర్ ఎర్త్ మినరల్స్ కోసం 4 రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ మేరకు బడ్జెట్ ప్రసంగంలో ఆమె పేర్కొన్నారు. ఏపీ, ఒడిశా, కేరళ, తమిళనాడు రాష్ట్రాలతో ప్రత్యేక మైనింగ్ మిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రపంచస్థాయి కంటెయినర్ ఉత్పత్తి కార్పొరేషన్ నెలకొల్పుతామని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. మైక్రోవేవ్ , సోలార్ ప్యానళ్లు, క్యాన్సర్ ఔషధాలపై పన్నులు తగ్గిస్తున్నామన్నారు. సెంట్రల్ ఎక్సైజ్ నుంచి బయో గ్యాస్ ద్వారా ఉత్పత్తి అయ్యే సీఎన్ జీకి >>2



## టిటిడి ఇఒ సింఘాల్‌పై బదలీ వేటు

### అదనపు ఇఒ వెంకయ్య చౌదరికి బాధ్యతలు

### ప్రభుత్వ ఆదేశాలు పాటించాల్సిందేనన్న సింఘాల్

**తిరుమల, ఫిబ్రవరి 1ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు కల్తీనెయ్యి సరఫరా చేసిన పాపంలో 2019లో టెండర్ నిబంధనలు సడలించి,ఇష్టానుసారం వ్యవహరించారనే సిబిఐ సిట్ అధికారుల నివేదికలు ప్రామాణికంగా అప్పటి, ప్రస్తుతం టిటిడి ఇఒగా కొనసాగుతున్న అనిల్‌కుమార్ సింఘాల్‌పై ప్రభుత్వం బదలీ వేటువేసింది. ఆదివారం మధ్యాహ్నం రాష్ట్రప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందగానే ఆగమేఘాలపై ఆయన ఇఒ పదవి నుండి తప్పుకుని ఇన్‌ఛార్జి ఇఒగా ప్రస్తుత టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి ఆయన అదనపు >>2



2లో


## టిటిడి కొత్త ఇఒగా ముద్దాడ రవిచంద్ర

## పిపిపి విధానంలో 12 రోడ్ల విస్తరణ



**విజయవాడ.ఫిబ్రవరి1. ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్ (పీపీపీ) విధానంలో నగరాల్లో రోడ్లను అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పలు కీలక ప్రాంతాల్లో, రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రహదారులు, ప్రధాన కూడళ్లలో పీపీపీ విధానంలో రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. సీఎం ఆదేశాలతో ఇప్పటికే కొన్నిచోట్ల డీపీఆర్ లు సైతం అధికారులు సిద్ధం చేశారు. ప్రస్తుతం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పీపీపీ రోడ్ల నిర్మాణంలో భాగస్వామం వహించే ప్రైవేటు నిర్మాణ సంస్థలు 15-30 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యతలు వారే చేపడతారు. ఆర్అండ్‌బీ రహదారుల్లో వాహన రద్దీ అత్యధికంగా ఉన్న 12 రాష్ట్ర రోడ్లను విస్తరించనున్నారు.పీపీపీ పద్ధతిలో నిర్మాణం చేపట్టే రహదారులకు రూ.5,233 కోట్లు నిర్మాణ అంచనాగా ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానం . హైబ్రీడ్ యాన్యుటీ మోడల్ (హాం)లలో ఈ రోడ్ల విస్తరణకు అధికారులు 2 ప్రతిపాదనలు ఇచ్చారు. పీపీపీ విధానంలో విస్తరణకు ప్రభుత్వం తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో 709 కిలో మీటర్ల పనులు చేపట్టనున్నారు. కొన్ని రోడ్లను 4 లైన్లు, మరికొన్నింటిని 10 మీటర్ల వెడల్పుతో 2 లైన్లుగా విస్తరించనున్నారు. తొలుత పీపీపీ విధానంలో 18 రోడ్లను విస్తరించాలని భావించారు. అదే విధంగా సలహా సంస్థ ద్వారా అధ్యయనం కూడా చేయించారు. వీటిలో 12 రహదారుల విస్తరణకు అవకాశం ఉందని తేలింది. మిగిలిన 6 రోడ్లను విస్తరిస్తే కాంట్రాక్టర్లకు గిట్టుబాటు కాదని, వయబిలిటీ గ్యాప్ ఫండ్‌గా ప్రభుత్వం >>2

# జోగి రమేష్ ఇంటికి నిప్పు



## ఇబ్రహీం పట్నంలో ఉద్రిక్తత

**విజయవాడ ఫిబ్రవరి 1 ప్రభాతవార్త ప్రతినిధి:** సీఎం చంద్రబాబు , మంత్రి లోకేశ్‌పై నిన్న అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి నేత జోగి రమేశ్‌కు వ్యాఖ్యాల పట్ల టీడీపీ శ్రేణులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసాయి. ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ ఇంటిని ముట్టడించిన టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు జోగి ఇంటికి నిప్పంటించారు. భారీగా మోహరించిన పోలీసులు ఆందోళనకారులను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మైలవరం, విజయవాడడ పశ్చిమ, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం ప్రాంతాల నుంచి తెదేపా కార్యకర్తల భారీగా తరలి రావడంతో ఇబ్రహీం పట్నంలో ఉద్రిక్తత నెలకొంది. తెదేపా శ్రేణులు ముట్టడికి వస్తున్నాయని తెలిసి జోగి రమేష్ ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. ఆయన తండ్రి జోగి మోహనరావు, సతీమణి శకుంతల దేవి, చిన్న కుమారుడు రోహిత్, దాడి సమయంలో ఇంట్లోనే ఉన్నారు. దాడి సమాచారం తెలుసుకుని వైకాపా శ్రేణులు కూడా అక్కడికి చేరుకున్నారు. పోలీసులు అప్రమత్తమై ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు. వైకాపా నేతలు, కార్యకర్తలు జోగి నివాసంలోకి వెళ్లగా తెదేపా కార్యకర్తలు ఇబ్రహీంపట్నం రింగ్ వద్దకు చేరుకుని >>2

# దిశను మార్చే బడ్జెట్



### భారతీయుల ఆశలకు అనుగుణంగా ఉంది

### ప్రధాని మోడీ, ఆర్థికమంత్రికి అభినందనలు

### రైల్వేకారిడార్‌లతో ముఖ్య నగరాల అభివృద్ధి

### కుప్పంలో మీడియాతో సిఎం చంద్రబాబు

**కుప్పం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం యొక్క నూతన బడ్జెట్ దేశం యొక్క దిశ, గతి మార్చేలా ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఆదివారం కుప్పంలో సిఎం చంద్రబాబునాయుడు మీడియా సమావేశంలో ప్రసంగించారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కొత్త బడ్జెట్ భారతీయుల ఆశలకు అనుగుణంగా ఉందని దూర దృష్టితో రూపొందించిన బడ్జెట్ అని సిఎం హర్షం వ్యక్తం చేశారు. అన్ని ప్రాంతాల అభివృది ్ధకి దోహ దపడుతుందన్నారు. బడ్జెట్‌లో రైతులు, మహిళలు, యువతకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోడీ,ఆర్థికమంత్రిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త బడ్జెట్‌తో దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.సంపద సృష్టితో జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పాలసీలకు నూతన బడ్జెట్ వెసులుబాటు కల్పించేలా ఉందన్నారు. రాష్ట్రానికి సంబంధించి మూడు హైస్పీడ్ రైల్ కారిడార్‌లు రావడం శుభపరిణామమన్నారు. హైదరాబాద్ - బెంగళూరు, హైదరాబాద్ -చెన్నై, బెంగళూరు - చెన్నై కారిడార్‌లతో రాజధాని అమరావతి, తిరుపతి నగరాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. హైస్పీడ్ రైల్ కారిడార్‌లో తిరుపతి కనెక్టివిటీకై కేంద్రాన్ని కోరుతామని సిఎం పేర్కొన్నారు. డెడికేటెడ్ రేర్ ఎర్త్ కారిడార్‌లో సైతం ఎపి ఉందన్నారు. దీంతో బీచ్‌శ్యాండ్, మిన రల్స్, డిఫెన్స్‌కు అవసరమైన సామగ్రి అందించే అవకాశం కలగడం శుభపరిణామమన్నారు. అలాగే ఐఎస్ఎన్ 2.0 సెమీకండక్టర్ యూనిట్‌కు40వేల కోట్లు కేటాయించడం జరిగిందన్నారు.బడ్జెట్‌లో టెక్స్‌టైల్ రంగం, టూరిజం, హాస్పిటాలిటీకి ప్రాధాన్యత ఇచ్చారన్నారు.ఉపాధి అవకాశాలకు టూరిజం రంగం దోహదపడుతుందన్నారు. టూరిజంలో ఎపి బెస్ట్‌గా ఉందని సిఎం పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో అరకు రీజియన్, పులికాట్ సరస్సులకు నిధులు కేటాయించారన్నారు. కాజూ,కోకోనట్, శాండల్ వుడ్‌లకు ప్రాధాన్యత కల్పించారన్నారు. పన్నుల రాయితీ డేటా సెంటర్లకు 2047 దాకా ఇవ్వడం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తద్వారా భారతదేశం డేటా సెంటర్ల హబ్‌గా మారుతుందన్నారు. ఈస్ట్‌కోస్ట్ కారిడార్‌తో లాజిస్టిక్స్ పరంగా గణనీయమైన వృద్ధి నమోదవుతుందన్నారు.1000కి.మీ.ల తీరప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు.డీప్ టెక్నాలజీకి పదివేల కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఎంఎస్ఎంఇలకు కేంద్రం 75శాతం క్రెడిట్ గ్యారెంటీ నిర్ణయించిందని రాష్ట్రం తరపున 20శాతంఇస్తున్నట్లు పేర్కొన్నారు.

**అభివృద్ధిలో మరో దిశగా అడుగులు :** కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ అభివృద్ధిలో మరో దిశగా అడుగులు వేసేలా ఉందని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.పట్టణాల అభివృద్ధి, గ్రోత్ సెంటర్లకు నిధులు బడ్జెట్‌లో కేటాయించారన్నారు. తద్వారా వైజాగ్ గ్రోత్ రీజియన్‌గా అమరావతి, తిరుపతి నగరాలు ఎకనమిక్ రీజియన్లుగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. రీజనల్ మెడికల్, ఆయుష్ హబ్‌లకు నిధులు కేటాయించారన్నారు. వీటితోపాటు అల్లోపతిని సమన్వయం చేసుకుంటే ఆరోగ్య విప్లవంవస్తుం దన్నారు.కార్పొరేట్ మిత్రను బడ్జెట్‌లో పెట్టారన్నారు.స్పీడ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు వెళ్లేలా మరిన్ని సంస్కరణలు రావాలన్నారు. ఇప్పటికే జీఎస్టీ, కార్మిక సంస కరణలు తెచ్చారన్నారు. ఇటీవల కేంద్రం యూరోపియన్ యూనియన్‌తో చేసుకున్న ఒప్పందం ఎంతో చారిత్రకమైందన్నారు.

**ఎఐ యూనివర్సిటీ ప్రారంభిస్తాం :** రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ (ఎఐ) యూనివర్సిటీని ప్రారంభిస్తామని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ వర్సిటీ హైదరాబాద్‌లోని ఐబిఎం తరహాలో స్వయంప్రతిపత్తి హోదాతో ఉంటుందన్నారు.ఎఐ లివింగ్ ల్యాబ్స్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో స్పేస్, డ్రోన్‌సిటీలతో పాటు కెమికల్ పార్క్‌ను ఏర్పాటుచేశామని సిఎం చెప్పారు. స్పీడ్ ఆఫ్ డెలివర్ ఇన్ గవర్నెన్స్ ఏరా ్పటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి గణనీయమైన మేలు: మంత్రి లోకేశ్



**విజయవాడ, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశ వేగవంతమైన అభివృద్ధి లక్ష్యాలకు, దీర్ఘకాలిక ఆకాంక్షలను అనుగుణంగా కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ బడ్జెట్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన మేలు జరగనుందని అభిప్రాయపడ్డారు. క్రిటికల్ మినరల్స్ కారిడార్, హైస్పీడ్ రైలు అనుసంధానం, డేటా సెంటర్లకు పన్ను ప్రోత్సాహకాలు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి మరింత బలమైన ప్రోత్సాహం ఇస్తుందన్నారు. పర్యాటక రంగంపై నూతన దృష్టి వంటి కీలక అంశాలు ఇందులో ఉన్నాయని సంతోషం వ్యక్తంచేశారు. ఈ బడ్జెట్‌ను సమర్థవంతంగా వినియోగించుకొని పెట్టుబడులను వేగవం తం చేయడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, ఆంధ్రప్రదేశ్ తదుపరి అభివృద్ధి దశకు శక్తినివ్వడం కోసం కృషి చేస్తామని వెల్లడించారు.

# 3 కర్తవ్యాల కొత్త పద్దు

>> కోట్లుగా ఉంటాయని ఆర్థికమంత్రి వివరించారు. ఇక మూలధన వ్యయం ఈ సారం గణనీయంగా పెరిగింది. గత ఏడాది సవరించిన అంచనాలకంటే ఈసారి బడ్జెట్ అంచనాలు రూ.17,14,523 కోట్లుగా ఉన్నాయి. ఇక రెవెన్యూలోటు రూ.5,92,344 కోట్లుగా ఉంటే ప్రభావిత రెవెన్యూ లోటు రూ.99,642 కోట్లుగా అంచనావేసారు. ఇక ఆర్థికలోటు ఈసారి రూ.16,95,768 కోట్లుగాచూపించారు. రుణేతర రాబడులు వ్యయం మొత్తం 53.5 లక్షలకోట్లుగా అంచనావేసారు. వీటిలో రుణేతర రాబడులు 36.5 లక్షలుకోట్లుగా అంచనావేసారు. కేంద్రం నికర పన్నురాబడులు రూ.28.7 లక్షలకోట్లు ఉంటాయని అంచనాగా ఉంది. మార్కెట్లనుంచి రుణసమీకరణలు రూ.11.7 లక్షలకోట్లవరకూ ఉంటాయని బడ్జెట్‌లోప్రస్తావించారు. సవరించిన మొత్తం వ్యయం రూ.49.6 లక్షలకోట్లుగా ఉంటుంది. వాటిలోమూలధన వ్యయం రూ.11 లక్షలకోట్లు దాటింది. అంటే ఈసారి మూలధన వ్యయాన్ని గణనీయంగా పెంచింది. ఆర్థికలోటును 2026-27 ఆర్థికసంవత్సరానికి స్థూల దేశీయోత్పత్తిలో 4.3శాతంగా ఉంటుందని పద్దుల్లో చూపించారు. 2025-26లో ఆర్థికలోటు బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా 4.4శాతంగానే చూపించారు. ఇక రుణం, జిడిపి నిష్పత్తినిచూస్తే కొత్త సంవత్సరంలో జిడిపిలో 55.6శాతంగా ఉంటుందని అంచనావేసారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్‌ప్రసంగంలో కొత్త పార్లమెంటుభవనం కర్తవ్యభవన్‌లో మొట్టమొదటి బడ్జెట్‌అని చెపుతూ మూడు కర్తవ్యాలదిశగా తమ బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు. సుస్థిర ఆర్థికవృద్ధి, ఉత్పాదకతను పెంచుకోవడం, పోటీతత్వానికి అనుగుణంగా సామర్థ్యం పెంపు, గ్లోబల్ అనిశ్చితిని మనకు అనుకూలంగా మార్చుకోవడం ప్రధానలక్ష్యంగా ఉంచుకున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ సామర్థ్యం పెంచుకోడానికి అనువైన వాతావరణం కల్పించడంతోపాటు భారత్ ఆర్థికవృద్ధి బాటలో ప్రజలను భాగస్వాములను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉందని ఆర్థిక మంత్రి వివరించారు. సబ్‌కాసాత్‌సబ్‌కా వికాస్ లక్ష్యంగాచేసుకుని వికసిత్‌భారత్ లక్ష్యసాధన దిశగా బడ్జెట్ రూపకల్పన జరిగిందని ఆర్థికమంత్రి వివరించారు. కేంద్రంనుంచి నికర పన్ను వసూళ్లు 28.7 లక్షలకోట్లుగా ఉన్నాయి. మార్కెట్లనుంచి రుణసమీకరణలు మొత్తం రూ.17.2

**శాఖల వారీగా కేటాయింపులు (రూ.కోట్లలో)**

| | |
|---|---|
| ఆర్థికశాఖ | రూ.19,72,509.48 |
| రక్షణశాఖ | రూ.7,84,678.28 |
| రోడ్డురవాణా హైవేలు.. | రూ.3,09,875.30 |
| రైల్వేలు | రూ.2,81,377.32 |
| హోం వ్యవహారాలు | రూ.2,55,233.53 |
| వినియోగరంగం | |
| ఆహార ప్రజాపంపిణీ | రూ.2,39,521.37 |
| రసాయనాలు | |
| ఎరువులు | రూ.17,70,061.47 |
| వ్యవసాయం | |
| రైతు సంక్షేమం | రూ.1,40,528.78 |
| విద్యశాఖ | రూ.1,39,289.48 |
| ఆరోగ్యం | |
| కుటుంబసంక్షేమం | రూ.1,06,530.42 |
| కమ్యూనికేషన్లు | రూ.1,02,267.02 |
| జల్‌శక్తి | రూ.94,807.84 |
| హౌసింగ్ | రూ.85,522,39 |
| సైన్స్ టెక్నాలజీ | రూ.38,260.94 |
| పునరుత్పత్తి విద్యుత్ | రూ.32,914.67 |
| కార్మిక, ఉపాధిరంగం | రూ.32,666.31 |
| పెట్రోలియం, గ్యాస్ | రూ.30,44.3.22 |
| విద్యుత్ | రూ.29,996,85 |
| మహిళా శిశుసంక్షేమం. | రూ.38,183.06 |
| ఎంఎస్‌ఎంఇ రంగం | రూ.24,566.27 |
| అణువిద్యుత్ | రూ.24,123.92 |
| విదేశాంగశాఖ | రూ.22,118.97 |
| ఎలక్ట్రానిక్స్ ఐటిశాఖ | రూ.21,632.96 |
| వాణిజ్యం పరిశ్రమలు | రూ.17,843.90 |
| గిరిజన వ్యవహారాలు | రూ.15,421.97 |
| సామాజిక న్యాయం | |
| సాధికారత | రూ.15,357.31 |
| ఖగోళ అంతరిక్షవిభాగం | రూ.13,705.63 |
| వృత్తినైపుణ్యం | రూ.9885.80 |
| మత్స్య,పశుసంవర్ధకశాఖ | రూ.8915.26 |
| భారీ పరిశ్రమలు | రూ.7839.90 |
| ఈశాన్యరాష్ట్రాలఅభివృద్ధి | రూ.6812.30 |
| కార్పొరేట్ వ్యవహారాలు | రూ.5561.86 |
| న్యాయశాఖ | రూ.5513.39 |
| అర్థగణాంకశాఖ | రూ.5502.89 |
| వస్త్రపరిశ్రమ | రూ.5279.01 |
| ఓడరేవులు,వాటర్‌వేస్ | రూ.5164.80 |
| యువజన, క్రీడలు | రూ.4479.88 |
| ఆయుష్ | రూ.4408.93 |
| ఆహారశుద్ధిపరిశ్రమలు | రూ.4064.16 |
| గనులశాఖ | రూ.3806.45 |
| ఎర్త్‌సైన్సెస్ | రూ.3789.23 |
| పర్యావరణం, అడవులు | |
| వాతావరణ మార్పులు | రూ.3759.46 |
| బొగ్గు | రూ.3635.32 |
| సాంస్కృతికం | రూ.3416.63 |
| మైనార్టీ వ్యవహారాలు | రూ.3,400 |
| ప్రజాఫిర్యాదులు | |
| పింఛన్లు | రూ.2662.01 |
| పర్యాటకరంగం | రూ.2438.40 |
| పౌరవిమానయానం | రూ.2102.87 |
| ప్రెసిడెంట్,పార్లమెంట్ | |
| యుపిఎస్‌సి | రూ.2083.83 |
| సహకారరంగం | రూ.1744.74 |
| ప్రణాళికా విభాగం | రూ.1232.16 |
| పంచాయితీరాజ్ | రూ.1190.16 |
| ఉక్కు పరిశ్రమలు | రూ.443.18 |
| పార్లమెంటరీ వ్యవహారాలు | రూ.68.45 |

లక్షలకోట్లవరకూ ఉండవచ్చని వీటిలో సెక్యూరిటీలపరంగా కూడా రూ.11.7 లక్షలకోట్లమొత్తం ఉందన్నారు. ఆపరేషన్‌సిందూర్ సామర్థ్యంతో రక్షణ వ్యయాన్ని మరింతగాపెంచారు. కొత్త బడ్జెట్‌లో రూ.7.85 లక్షలకోట్లు కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు రూ.6.81 లక్షలకోట్లకంటే ఎనిమిదిశాతం ఎక్కువగా ఉంది. ఇక ఏప్రిల్ ఒకటవ తేదీనుంచి కొత్త ఆదాయపు పన్నుచట్టం అమలులోకి వస్తుందని కేంద్ర మంత్రి ప్రకటించారు.



ఆదివారం శాంతిపురం మండలం తుమ్మిశి వద్ద సంజీవని ప్రాజెక్టు గురించి ప్రజలతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబునాయుడు

## శ్రీవారితో పెట్టుకుంటే ఈ జన్మలోనే శిక్ష: సిఎం చంద్రబాబు

**కుప్పం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామితో ఎవరైనా పెట్టుకుంటే ఈ జన్మలోనే శిక్ష ఉంటుందని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఆదివారం కుప్పంలో మీడియా సమావేశం సందర్భంగా సిఎం తిరుమలడ్డూ వివాదంపై పాత్రికేయులతో మాట్లాడారు. తిరుమల శ్రీవారు తమ కులదైవం అని తాను నమ్మే దేవుడని పేర్కొన్నారు. తిరుమలకు పూర్వవైభవం తేవాలని కృషి చేస్తున్నటు చెప్పారు కల్తీ నెయ్యి వ్యవహారంలో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డిడిబి)నివేదికఅందించిందని అందులో కల్తీ నెయ్యి అని నివేదికలో పేర్కొన్నారన్నారు. దీనిపై సిట్ దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వగా తాను క్షమాపణలు చెప్పాలని నానాయాగీ చేశారన్నారు. తాను సిఎంగా ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా శ్రీవారి దర్శనం కోసం మహాద్వారం గుండా వెళ్లే అవకాశం ఉన్నా తాను వెళ్లనన్నారు. సామాన్యభక్తుడిగానే స్వామివారి దర్శనానికి వెళ్తానని పేర్కొన్నారు. అపచారం, మహాపాపం చేసి కప్పిపుచ్చుకునేందుకు తిరిగి తనపైనే దాడి చేస్తున్నారన్నారు.

## కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నా: డి.సిఎం పవన్



**విజయవాడ.ఫిబ్రవరి 1, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్రమోదీ దార్శనిక నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం సమర్పించిన 2026- 2027 కేంద్ర బడ్జెట్‌ను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. భారతదేశ ఆర్థిక పునాదులను బలోపేతం చేసే భవిష్య త్తును దృష్టిలో ఉంచుకుని సంస్కరణల ఆధారిత, యువత ప్రేరేపిత బడ్జెట్‌ను సమర్పించినందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ని తాను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానుని తెలిపారు. ఈ బడ్జెట్ భారతదేశం ..వికసిత్ భారత్ వైపు ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. ఉపాధి కల్పన, ఆవిష్కరణ, నగర ఆర్థిక ప్రాంతాలు, హైస్పీడ్ రైలు కారిడార్లపై ప్రాధాన్యత ప్రాంతాలు, రంగాల్లో వృద్ధిని పునర్నిర్మిస్తుందని పేర్కొన్నారు. ప్రధాన కేంద్రాలను అనుసంధానించే హై స్పీడ్ రైలు లింక్‌ల అభివృద్ధి ద్వారా.. మౌలిక సదుపాయాల కల్పనతో లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గిస్తుందని చెప్పారు. అలాగే స్థిరమైన రవాణాను ప్రోత్సహిస్తుందని వివరించారు. ఏపీ కోసం సీఎం నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన నాయకత్వంలో అరుదైన భూమి కారిడార్లు, తూర్పు తీర పారిశ్రామిక కారిడార్, మెరుగైన ప్రజా మూలధన వ్యయం, మత్స్యకార అభివృద్ధి, తీరప్రాంత లాజిస్టిక్స్‌కు ప్రాధాన్యత ఇచ్చారని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఏపీ వ్యాప్తంగా పెట్టుబడి వృద్ధి, పెద్ద ఎత్తున ఉపాధి, సమగ్ర అభివృద్ధిని సాధిస్తాయని తెలిపారు. రాష్ట్రాలకు సాధికారత కల్పించడం, మధ్యతరగతిని బలోపేతం చేయడం ద్వారా స్వావలంబనతో కూడిన భారతదేశాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## నేటి నుంచి మంత్రి నారాయణ నాలుగురోజుల విదేశీ పర్యటన

**విజయవాడ.ఫిబ్రవరి 1,ప్రభాతవార్తప్రతినిధి:** అధికారిక పర్యటన కోసం మంత్రి నారాయణ యూకే, ఖతార్ లలో పర్యటించనున్నారు. ఈ నెల 2,3 తేదీల్లో లండన్, 4,5 తేదీల్లో దోహాలో మంత్రి పర్యటన చేయనున్నారు. మంత్రితో పాటు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, అమరావతి గ్రోత్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్ వెళ్లనున్నారు. అమరావతి నిర్మాణంలో పలు ప్రాజెక్టుల అభివృద్ధికి లండన్, దోహాలో అధ్యయనానికి మంత్రి బృందం వెళ్తున్నట్లు సమాచారం. అమరావతిలో టూరిజం ప్రాజెక్టులు, రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ నిర్మాణం కోసం పలు ప్రాంతాలను మంత్రి పరిశీలించనున్నారు. అనంతరం 5న అమరావతికి మంత్రి బృందం చేరుకోనున్నారు.

# ఎపికి భారీ కేటాయింపులు

>> మినహాయింపు ఇస్తామన్నారు. మైక్రో అవెన్స్ పై, పౌర విమానాల విడిభాగాలపై పన్ను తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. ఏపీలో గూగుల్ భారీ డేటా సెంటర్ ఏర్పాటుపై బడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ స్పష్టత గూగుల్ మాత్రమే కాదు, రైడెన్ ఇన్ఫో డేటా సెంటర్, మరిన్ని డేటా సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర ఈ నిర్ణయంతో రెడ్ కార్పెట్ పరిచింది. టాక్స్ హాలిడే ప్రకటించి కేంద్రం తీసుకున్న నిర్ణయం ద్వారా విదేశీ పెట్టుబడులు పెరగడమే కాకుండా, దేశంలో ఉపాధి అవకాశాలు కూడా విస్తృతంగా సృష్టించబడతాయన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఆయా ప్రాంతాలలో పెట్టుబడులు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. డేటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడే ప్రకటించడం ద్వారా భారత్‌ను గ్లోబల్ డిజిటల్ హబ్‌గా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ టాక్స్ హాలిడే నిర్ణయంతో క్లౌడ్ సేవలు సంస్థలకు భారీ ప్రయోజనం చేకూరనుంది.

# పిపిపి విధానంలో 12 రాష్ట్ర రోడ్ల విస్తరణ

>> ఎక్కువ నిధులు వెచ్చించాల్సి ఉంటుందని, భూ సేకరణకు కూడా బాగా ఖర్చు చేయాల్సి వస్తుందని గుర్తించారు. దీంతో ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం 51 కిలో మీటర్లు, గుంటూరుపర్చూరు 41కి.మీ., ఏలూరుమేడిశెట్టివారి పాలెం 70 కి.మీ., విజయనగరంపాలకొండ రోడ్ 70 కి.మీ., రాజంపేటగూడూరు 94 కి.మీ., కళింగపట్నంశ్రీకాకుళంపార్వతీపురం రోడ్ 108కి.మీ., విస్తరణను ప్రస్తుతం చేపట్టాలి అనుకోవడం లేదు. రహదారులను విస్తరించాక 15 నుంచి 30 ఏళ్ల పాటు కాంట్రాక్టర్లు నిర్వహణ బాధ్యతలు చూడనున్నారు.రోడ్ల విస్తరణకు రూ.5,233 కోట్లు నిర్మాణ వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. భూ సేకరణకు, రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ లైన్లను పక్కకు జరపనున్నారు. వీటి యుటిలిటీస్ షిఫ్టింగ్‌కు కలిపి సుమారుగా రూ.2,459 కోట్లు అవుతుంది. ఈ ఖర్చును అంతా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. 12 రోడ్ల విస్తరణ పనులు కాంట్రాక్టర్లు చేశారు. వీరు పలు చోట్ల టోల్ వసూలు చేస్తారు. అయినా సరే ఆ ఫీజులు ఏమాత్రం సరిపోవు. దీంతో కాంట్రాక్టర్లకు వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద రూ.1,691 కోట్ల మేర బీవోటీ కేటాయించారు. అసలు బీవోటీ అనగా నిర్మించు, నిర్వహించు, బదలాయించు అని అర్థం. గడువు ఉన్నంత కాలం మాత్రమే కలిపి చెల్లిస్తారు. ఇందులో రాష్ట్రం రూ.622 కోట్లు, కేంద్రం రూ.1,069 కోట్లు చెల్లించనున్నాయి. మంగళగిరితెనాలినారాకోడూరు, గుంటూరు బాపట్ల (రెండు రోడ్లూ కలిపి) 89 కిమీ 4 నాలు వరుసల్లోరూ.865 కోట్లతో నరసాపురం- తాడేపల్లిగూడెం51కిమీ4వరుసలో రూ. 419కోట్లుతో.కాకినాడ- రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డు 60కిలో మీటర్లు 4వరుసల్లో రూ.680 కోట్లుతో ఒంగోలు- పొదిలిబెస్తవారిపేట 109కి.మీ4/2 వరుసల్లో రూ.611కోట్లు చిలక పాలెం - రామభద్రపురంరాయగడ131కిలో మీటరు 4/2 వరుసల్లో రూ.1,172 కోట్లుతో సోమందేపలి- హిందూపురం- తూముకుంట రోడ్డు 39కిలో మీటర్లు4/2 వరుసల్లో రూ.270 కోట్లు నర్సీపట్నం -తాళ్లపాలెం31కిమీ రోడ్డు2వరుసల్లో రూ.101కోట్లుతో కాకినాడ- జొన్నాడ రోడ్డు43 కిలో మీటర్లు 2వరుసల్లో రూ.425కోట్లుతో దామాజీపలి- నాయనపల్లి రోడ్డు 60కిలో మీటర్లు 2 వరుసల్లో రూ.338కోట్లుతో,ప్యాపిలి- బనగానపల్లి54కిమీ రోడ్డు 2 వరుసల్లో రూ.171 కోట్లుజమ్మల మడుగ- కొలిమిగుండ్ల రోడ్డు 42కిలో మీటర్లు రూ.181 కోట్లు పీపీపీ పద్ధతిలో నిర్మిస్తారు.



ఆదివారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు హల్వా తినిపిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

## హైకోర్టులో అంబటి భార్య హౌస్ మోషన్ పిటిషన్

**విజయవాడ,ఫిబ్రవరి 1, ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి అంబటి రాంబాబు అర్ధాంగి విజయలక్ష్మి ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. తనతో పాటు సుమారు 60 మందిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారని ఆరోపిస్తూ ఆమె ఉన్నత న్యాయస్థానంలో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. వివరాల్లోకి వెళితే, తాడేపల్లిలో పోలీసులు తనను, తనతో ఉన్నవారిని అక్రమంగా నిర్బంధంలో ఉంచారని విజయలక్ష్మి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య ఉందని, తనకు భద్రత కల్పించడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో తనకు, తన కుటుంబానికి రక్షణగా 24 గంటల పాటు పోలీసు భద్రతను ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని ఆమె కోర్టును అభ్యర్థించారు. పోలీసులు తన ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్నారని, ఈ విషయంలో తక్షణం జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ హౌస్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరపాల్సి ఉంది.

# ఇది సంస్కరణల ఎక్స్‌ప్రెస్

>> తెలియజేస్తూ సోషల్ మీడియా వేదికగా ఓ వీడియో విడుదల చేశారు. "ఈ బడ్జెట్ అనేక అవకాశాలకు రాచబాటను వేసింది ఇది భారత వర్తమాన కలల్ని నెరవేర్చడంతో పాటు, ఉజ్వల భవితకు బలమైన పునాదిని కూడా వేస్తుంది" అని ప్రధానమంత్రి తెలిపారు. 2047 కల్లా అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు భారత్‌కు ఈ బడ్జెటు రెక్కలు తొడుగుతుందని ఆయన స్పష్టం చేశారు. భారత్‌లో ప్రస్తుతం సంస్కరణల ఎక్స్‌ప్రెస్ పరుగులు తీస్తోందనీ, ఈ బడ్జెటుతో ఈ ఎక్స్‌ప్రెస్ ఒక కొత్త శక్తినే కాకుండా ఓ కొత్త జోరును కూడా అందుకొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌లో వృద్ధిలోకి రావాలని తపించిపోతున్న, ధైర్యవంతులైన, ప్రతిభావంతులైన యువతకు వారు ఉవ్వెత్తున ఎగరడానికి విశాల గగనాన్ని బడ్జెటు వారి ఎదుట ఆవిష్కరించిందని ఆయన అన్నారు. ద్రవ్య లోటును తగ్గించడం, ధరల పెరుగుదలకు కళ్లెం వేయడం, అదే సమయంలో అధిక మూలధన వ్యయానికీ, అధిక అభివృద్ధికీ పూచీని ఇవ్వడం.. వీటిపై దృష్టిని కేంద్రీకరించిన అద్వితీయ బడ్జెటు ఇదని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. భారత్‌లోని 140 కోట్ల మంది పౌరులు సంతృప్తి చెందడం లేదనీ, త్వరలో ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలని దేశ ప్రజలు దృఢంగా తీర్మానించుకొన్నారనీ ఆయన స్పష్టం చేశారు. ఇది లక్షలాది భారతీయుల ఉమ్మడి సంకల్పమని ఆయన అన్నారు.

# జోగి రమేష్ ఇంటికి నిప్పు

>> నిరసన తెలుపుతున్నారు. కల్తీ మాటలతో తెదేపా కల్తీగా మారింది. మంత్రి లోకేశ్‌కు చిప్ దెబ్బతింది. బుద్ధి తక్కువ రాజకీయాలు మానుకోవాలి. ఏడాదిన్నరలోనే రాష్ట్రాన్ని నాశనం చేశారు. తిరుపతి లడ్డూలో కల్తీ అంటూ చేసిన ప్రచారాన్ని సిట్ నిగ్గు తేల్చింది. తెదేపా నాయకులకు మంచి బుద్ధిని ప్రసాదించాలని పూజా కార్యక్రమాలు నిర్వహించా అంటూ జోగి రమేష్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇంకా పత్రికలో రాయలేని భాషలో లోకేశ్‌ను దూషించారు. ఇబ్రహీంపట్నం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం జోగి రమేష్ మీడియాతో మాట్లాడారు. తెదేపా కల్తీ నాయకత్వంలో నడుస్తోంది. తిరుపతి లడ్డూ కల్తీ అన్నావు, పరకామణి కేసు అన్నావు. కల్తీ మద్యం అని కేసు పెట్టావు. కల్తీ మద్యం కేసుపై మాట్లాడుకోవడానికి చంద్రబాబు, లోకేశ్ రండి. సొంత సిట్ వేసుకొని నన్ను జైల్లో పెట్టి రాక్షసానందం పొందారు అంటూ ఆవేశంగా మాట్లాడారు. ఈ మాటలను టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా పరిగణించి ఆయన ఇంటిపై దాడి చేసారు.

# మాజీ మంత్రి జోగి రమేశ్‌కు మాజీ సిఎం జగన్ ఫోన్

**విజయవాడ.ఫిబ్రవరి 1,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి జోగి రమేశ్‌ను వైసిపి నేత వైయస్. జగన్ పరామర్శించారు. జోగి రమేశ్ ఇంటిపై దాడిని తీవ్రంగా ఖండించిన వైయస్.జగన్ ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదన్న జగన్ ప్రశ్నించేవారిని భయపెట్టడానికే చంద్ర బాబు హింసాజ్వాలను రాజేస్తున్నారన్న వైయస్.జగన్ అవే మంటలు చంద్రబాబు సర్కార్‌ను దహించి వేయక తప్పదన్న వైయస్.జగన్ పార్టీ మొత్తం అండగా ఉంటుందంటూ జోగి రమేశ్‌కు ధైర్యం వైయస్.జగన్ చెప్పారు.

## టిటిడి కొత్త ఇఒగా ముద్దాడ రవిచంద్ర

**తిరుమల, ఫిబ్రవరి 1ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలన వ్యవహారాలు చక్కబెట్టేందుకు ఇఒగా నియమితులైన సీనియర్ ఐఎఎస్ అధికారి, సిఎం కార్యాలయం ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర నిజాయితీ. సమర్థవంతమైన అధికారి అని అధికార వర్గాల్లో చర్చమొదలైంది. ఏశాఖలో ఏ బాధ్యతల్లో ఉన్నా తనకు అప్పగించిన విధులను చిత్తశుద్ధితో నిర్వహించే అధికారిగా రవిచంద్ర పేరుతెచ్చుకున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వ్యక్తిగత పేరు కంటే ప్రభుత్వానికి పేరురావాలని ఆయన కష్టపడి పనిచేసే తత్వం అలవరచుకున్నారనేది ఆయన అనుచరుల మాట. 1996 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన శ్రీకాకుళం జిల్లా వాసి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003లో రంగారెడ్డిజిల్లా సంయుక్తకలెక్టర్‌గా అప్పట్లో సంచలనం సృష్టించారు. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో మంచి అధికారిగా పేరుంది. 2008-2009లో ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా, అంతకుముందు డిఆర్‌డిఎ పిడిగా బాధ్యతలు నిర్వహించారు, చిత్తూరుజిల్లాతో మంచి అనుబంధం కలిగి ఉన్నారు. జిల్లా కలెక్టర్‌గా ఆయన జిల్లాప్రజలకు చేరువై అనేక సమస్యలు పరిష్కారంలో తనదైన శైలిలో పాలనసాగించారని అధికారవర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఆయన ఆర్థికశాఖ, సాంఘిక సంక్షేమం, వైద్యఆరోగ్యశాఖల్లో కీలక పదవుల్లో సమర్థవంతమైన పనితీరు సాగించారు. ప్రస్తుతం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేషీలో ముఖ్యకార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. రానున్న మార్చిలో ఆయన రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కూడా నియమితులయ్యేందుకు రంగం సిద్ధమైంది. అయితే అనూహ్యంగా టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ బదిలీతో ఆ స్థానంలో ఎంతో కీలకమైన, దేవుని చెంత విధులు నిర్వహించే అవకాశం,అదృష్టం కలిగింది. టిటిడి ఇఒగా నియమితులైన రవిచంద్ర త్వరలోనే తిరుమలకు చేరుకుని అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. అప్పటివరకు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఇన్‌ఛార్జి ఇఒగా కొనసాగుతారు.

# టిటిడి ఇఒ సింఘాల్‌పై బదలీ వేటు

>> బాధ్యతలు అప్పగించారు. చివరగా ఆదివారం ఉదయం ఇఒ హోదాలో అనిల్‌కుమార్ సింఘాల్ దంపతులు ఇష్టదైవం తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని భారమైన హృదయంతో ఆలయం వెలుపలకు వచ్చారు. ప్రభుత్వం తీసుకునే ఎలాంటి నిర్ణయాలు, ఆదేశాలను అమలుచేయాల్సిందేనని తనను కలసిన మీడియాప్రతినిధులతో తెలిపారు. దేవుని చెంత రెండవసారి పనిచేసే అవకాశం కలగడం, ఆ స్వామివారి ఆశీస్సులందరిపై ఉండాలని ఆకాంక్షించారు. సీనియర్ ఐఎఎస్ అధికారి అయిన అనిల్‌కుమార్‌సింఘాల్ టిటిడి పాలనలో అనుభవం ఉండటంతో గతంలో 2017 నుండి 2020అక్టోబర్ వరకు ఇఒగా ఆయన సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. పలు సంస్కరణలు, నూతన దర్శన విధానాల అమలులో కొంతవరకు సఫలీకృతులయ్యారు. 2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కూడా ఏడునెలలు ఇఒగా పనిచేశారు. ఆ సమయంలో అప్పటి వైసిపి నేతృత్వంలోని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి అధ్యక్షతన కొలువుదీరిన బోర్డు పెద్దలు నెయ్యి టెండర్లులో నిబంధనలు పూర్తిగా మార్పుచేసి తమకు అనుకూలంగా మార్చుకున్నా ఇఒ హోదాలో అధికారులతో కలసి దీన్ని అడ్డుకోలేదనే తాజాగా సిబిఐ సిట్ నివేదిక ఇచ్చింది. ఈ నివేదిక ఆధారంగా ఐదునెలలుగా ఇఒగా రెండవసారి వచ్చి కొనసాగుతున్న సింఘాల్ తప్పిదం ఉందని స్పష్టం కావడంతో బదిలీ చేసింది. సిఎం చంద్రబాబునాయుడు 2025లో జరిగిన కొన్ని తప్పిదాలతో ,బోర్డుతో సఖ్యంగా లేరనే ప్రభావంతో అప్పటి ఇఒ శ్యామలరావును బదిలీ చేసి ఆ స్థానంలో టిటిడిలో ప్రక్షాళనకు,గతంలో అదుపుతప్పిన అస్తవ్యస్థ పాలనను గాడిలో పెట్టడానికి సింఘాల్‌ను ఇఒగా నియమించడం ప్రత్యేకత .అయితే ఇప్పుడు ఆయనపై వచ్చిన ఆరోపణలు, సిట్ నివేదికలతో ఇఒ పదవినుండి తప్పించి సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు వెలువడ్డాయి.

**'కల్తీనెయ్యి'పాపంలో ఇంకెందరిపై వేటో?:** 2019-24 మధ్యకాలంలో వైసిపి నేతృత్వంలోని టిటిడి బోర్డు పెద్దలు చేసిన తప్పిదాలు, అక్రమాలకు లడ్డూలకు కల్తీనెయ్యి వాడారనే పాపంలో రానున్న రోజుల్లో ఇంకెందరిపై వేటు పడుతుందనేది టిటిడి వర్గాల్లో హాట్‌టాఫిక్‌గా మారింది. పాలనలో సమర్థవంతమైన అధికారిగా పేరుతెచ్చుకున్న సింఘాల్‌నే కల్తీనెయ్యిఘటనలో సిఎం ఉపేక్షించలేదు. ఈ నేపథ్యంలో టిటిడిలో ప్రస్తుతం ముఖ్య గణాంకాధికారి(ఎఫ్‌ఎసిఎఒ)గా కొనసాగుతున్న ఓ.బాలాజీపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇంకా గత టిటిడి బోర్డు పెద్దలు, కొందరు టిటిడి అధికారులు మాజీ జిఎం పేరూరు జగదీశ్వర్‌రెడ్డి, పి.వెంకటరామసుబ్రమణ్యం, పి.మురళీకృష్ణ తోబాటు ఇలా వరుసగా టిటిడి ఎస్వీ గోశాల మాజీ డైరెక్టర్ డాక్టర్ హరినాథరెడ్డి, డెయిరీ టెక్నాలజీ నిపుణులు డాక్టర్ ఎం.మహేందర్, డాక్టర్ వి.వెంకటసుబ్రమణియన్, ఎం.విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ బత్తులసురేంద్రనాథ్, డాక్టర్ కె.జయ రాజారావులను నిందితులుగా సిట్ పేర్కొని ఛార్జిషీట్ దాఖలు చేయడంతో అధికారుల ప్రమేయంపై ఏం జరగుతుందనేది అంతుచిక్కని విషయమే.

## అంబటి రాంబాబుకు 14 రోజులు రిమాండ్

గుంటూరు,ఫిబ్రవరి 1: ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలుచేసారన్న ఆరోపణలపై అరెస్టు అయిన వైఎస్సార్సీపీనేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశించారు. అంబటిని శాంతిభద్రతల దృష్ట్యా రాజమండ్రి జైలుకు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వైద్యపరీక్షలు పూర్తిచేసిన తర్వాత అంబటిని స్పెషల్‌మొబైల్‌కోర్టులో హాజరపరిచిన పోలీసులు అంబటి వివాదాస్పద ప్రకటనలతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్నదని ఆయనపై 16 కేసులు నమోదయి ఉన్నాయని పోలీసులు వాదనలు వినిపించారు. కుట్రపూరితంగానే కేసులునమోదుచేసారని వాదనలు చేసినా న్యాయమూర్తి మాత్రం 14 రోజులు రిమాండ్ విధించారు. మరో కేసులో స్టేషన్ బెయిల్ లభించింది.

### వారం - వర్జ్యం

02-02-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, శ్రవణ కార్తె
కృ.పాడ్యమి రా.1.55
ఆశ్లేష రా.10.51
వర్జ్యం : ఉ.10.33-12.06
దు.ము.12.45-1.31, 2)మ.3.02-3.48
శుభసమయం : ఉ.6.15-7.00, సా.6.15-7.00
రాహుకాలం - ఉ.7.30-9.00

### వార్తాఫలం

**మేషం :** ప్రజా సంబంధాలు అధికంగా కలిగినటువంటి వ్యాపారస్తులకు అనుకూలంగా వుంటుంది.వస్త్ర లాభం.

**వృషభం:** ముఖ్యమైన విషయాలలో ఆచితూచి ముందుకు సాగండి. వివాదాలకు దూరంగా వుండండి.కొత్త మిత్రులు పరిచయం.

**మిథునం:** సన్నిహితులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. ఆరోగ్యం, వాహనాల విషయంలో మెలుకువ అవసరం. ధన లాభం.

**కర్కాటకం:** భూ వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.శ్రమ అధికం.

**సింహం:** జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. సంఘ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**కన్య:** అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఋణాలు తీరుతాయి.

**తుల :** సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. ఆదాయ, వ్యయాలలో సమతుల్యత లభిస్తుంది.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**వృశ్చికం:** కారణం లేని చికాకులు చోటు చేసుకుంటాయి. పెద్దల సలహాలను పరిగణలోనికి తీసుకుంటారు. శ్రమ అధికం.

**ధనుస్సు:** ఒకే సమయంలో అనేకమైన పనులు సానుకూలపరుచుకోవలసి వస్తుంది. వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**మకరం:** కార్యాలయంలో స్వల్పమైన ఒడిదుడుకులను ఎదుర్కొంటారు. ఋణాలు తీరి ఊరట చెందుతారు.వాహన సౌలభ్యం.

**కుంభం:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన అభిప్రాయ భేదాలు సమసిపోయే విధంగా సూచిస్తోంది.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మీనం:** తొందరపాటుతనం వద్దు. దూరప్రాంతాల నుండి అందిన సమాచారం ఆనందం కలిగిస్తుంది.సోదరుల కలయిక.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



వివేకానంద మానవ వికాస కేంద్ర ప్రారంభోత్సవంలో వెంకయ్యనాయుడు, గౌతమానంద మహరాజ్, కొరటాల శివ, గోకరాజు గంగరాజు తదితరులు

# మానవత్వమే దైవత్వం

## అదే వివేకానందుని కీలక సందేశం

### మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

విజయవాడ, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త ప్రతినిధి: మానవత్వమే దైవత్వమని, అదే వివేకానందుని కీలక సందేశమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు రామకృష్ణ మిషన్ అంటే విలువలు నేర్పే విశ్వవిద్యాలయం... సమాజ నిర్మాణానికి శక్తి కేంద్రమని అభిప్రాయపడ్డారు. రామకృష్ణ మిషన్ నేతృత్వంలో నిర్మితమై ప్రారంభించుకున్న విహెచ్ఇసి కేవలం భవన నిర్మాణం కాదన్నారు. శీలసంపదకు నిలయం సాక్షాత్తు దేవాలయంగా ఆయన అభివర్ణించారు. యువత భవితకు విహెచ్ఇసి ఒక విజ్ఞాన దీపికగా వెలుగులు పంచుతుందని మాజీ ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. విజయవాడ గాంధీనగర్‌లో రూ.8.5 కోట్లతో నిర్మించిన వివేకానంద మానవ వికాస కేంద్ర ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వీహెచ్ఈసీ భవనంలోని రెండో అంతస్తులో వివేకానంద మానవ వికాస కేంద్ర ప్రారంభోత్సవంలో భక్తి, దేశభక్తి వంటి అంశాలపై చేసిన ఇచ్చిన ప్రవచన సందేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన పుస్తక విక్రయశాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించారు. బిజెపి శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజుతో కలిసి భవన నిర్మాణ ఫలకాన్ని గౌతమానంద మహరాజ్ సహా స్వామీజీల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, సినీ దర్శకులు కొరటాల శివ, విజయవాడ రామకృష్ణ మిషన్ కార్యదర్శి వినిశ్చలానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరి శ్రీ నరసింహస్వామి వార్లకు అపూర్వస్వాగతం

# పవిత్ర కృష్ణానదిలో మంగళగిరి శ్రీ నారసింహుని నౌకావిహారం

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: పవిత్ర కృష్ణానదిలో మంగళగిరి శ్రీ నారసింహుని నౌకావిహారం చేశారు చిద్విలాసంగా నౌకలపై అర్చకస్వాముల పూజాదికాలు అందుకుంటూ బెజవాడ భక్తజనాన్ని అనుగ్రహించారు. సీతా నగరంకు విచ్చేసిన శ్రీ మంగళగిరి శ్రీ నారసింహ స్వామి అమ్మవార్లకు ఇంద్ర కీలాద్రి నుండి అంగరంగవైభవంగా అపూర్వస్వాగతం లభించింది. వేదమం త్రాలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకు మ, ఫల పుష్పాలను ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలకమండలి, అధికారులు పాల్గొని సమర్పించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్లకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**పెద్దఎత్తున విరాళాలు:** దుర్గమ్మవారి ఆలయానికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు విరాళాలు అందించారు. హైదరాబాద్‌కు చెందిన మేరుగు గోపాల్ యాదవ్, వారి కుటుంబసభ్యులు రు.1లక్ష విరాళాన్ని డెవలప్‌మెంట్ ట్రస్టుకు గోల్డ్ స్కీంకు అందించారు. వీరు గత 20 ఏళ్లుగా ప్రతి మాఘపౌర్ణమికి విరాళాలు అందిస్తున్నారు. ఇంకా నిత్యాన్నదాన పథకానికి రు.1,11,111ల విరాళాన్ని విజయవాడకు చెందిన వీరమాచనేనిన విజయ్ శ్రీనివాస్, వారి కుటుంబసభ్యులతో కలిసి విరాళం అందించారు. మచిలీపట్నంకు చెందిన దిలీప్ శేషుకుమార్, నాగవెంకట రత్న తేజస్విని, రామ్‌చరణ్, యశస్వి రు.1,01,116ల విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు. విజయవాడకు చెందిన కొమ్మవరపు వెంకట నారాయణ కుటుంబసభ్యులు కొమ్మ వరపు వెంకట నారాయణ, కానూరు భాగ్యశ్రీ పేరిట రు.1లక్ష విరాళాన్ని వారి కుటుంబసభ్యులు అందించారు. విజయవాడకు చెందిన సింగంశెట్టి చంద్ర శేఖర్, స్వప్న, ఎస్‌వి మారుతి శంకర్, దుర్గా సత్యశ్రీ, మారుతి శివాని, సుజాత రు.1,00,016ల విరాళాన్ని నిత్య ఉచిత ప్రసాద వితరణ పథకానికి అందించారు. విజయవాడకు చెందిన మునగాల బాబు ప్రసాద్ దంపతులు రు.1,00,016ల ను విరాళంగా అన్న ప్రసాద వితరణకు అందించారు.




**దుర్గమ్మవారికి వీణ, నృత్య నీరాజనం:** శ్రీ కనకదుర్గమ్మ వారి ని ఆదివారం వీణ, నృత్య నీరాజనాలతో అర్చించారు. రాజగోపురం వద్ద విజయవాడ సంకీర్తనా సేవా బృందం 80 మంది వీణలతో లలితా సహస్ర నామ పారాయణ చేశారు. అలాగే నాట్యాచార్యులు వైఎస్‌విఎన్ అనురాధ నేతృత్వంలో సంప్రదాయ కూచిపూడి నృత్యంతో భక్తులను అలరించారు.

మాఘమాసం పౌర్ణమి పర్వదినాన స్వర్ణకవచధారిణిగా అనుగ్రహిస్తున్న దుర్గమ్మవారి సన్నిధిలో వినాయక కౌత్వం, జతిస్వరం, రామాయణ శబ్దం, శివతాండవ స్తోత్రం, తిల్లానలతో ఆసాంతం నృత్య సౌరభాలతో ముగ్ధులను చేశారు. ముఖ్యంగా శివుని రుద్ర తాండవం, శ్రీరామచంద్రుని జీవితఘట్టాలను వివరిస్తూ రావణసంహార అభినయం, జతులతో కూడిన తిల్లాన ప్రదర్శనలు భక్తులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం వారికి దుర్మమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదం, మెమొంటోలు అందించారు.

**వైభవంగా గిరి ప్రదక్షిణ:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (ఇంద్రకీలాద్రి) ఆధ్వర్యంలో ఆదివారం మాఘ పౌర్ణమి పురస్కరించుకుని గిరి ప్రదక్షిణ నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.



# సిఎం చంద్రబాబుపై అంబటి వాఖ్యలు జుగుప్సాకరం

### మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



నెల్లూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త -విద్య: ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు చేసిన వాఖ్యలు జుగుప్సాకరమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు నగరంలోని రంగనాయకుల పేటలో వెలసియున్న శ్రీ రంగనాథస్వామిని ఆయన తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దగుమాటి కృష్ణా రెడ్డి, కాకర్ల సురేష్‌ల కలిసి దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరుల తో మంత్రి ఆనం మాట్లాడుతూ తిరుమల పవిత్రతను కాపాడటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తుందన్నారు. కోర్టు ఉత్తర్వు లను కూడా సరిగ్గా చదవకుండా వైకాపా ప్రజ లను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. కల్తీ నెయ్యి కాదని, అసన్సు నెయ్యేకాని పదార్థంతో గత ప్రభుత్వం భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల లడ్డును తయారుచేసి విక్ర యాలు సాగించారన్నారు. దీనిని తయారు చేసేందుకు కల్తీ పామాయిల్, సింతటిక్, కెమికల్స్‌తో కూడిన రసాయనాలను వినియో గించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడాం న్నారు. తిరుమలలో భక్తుల మనోభావాలను గౌర విస్తూ వందల ఏళ్లనుండి ప్రసాదాలు తయారు అవుతున్నాయని, దీనిని వైకాపా తుంగలో తొక్కిందన్నారు. ప్రపంచంలోని వింతలు కాకుడా గత ముఖ్యమంత్రి జగన్ ఇంకో వింతను కనుగొన్నారని, పాలు, వెన్నలేకుండా నెయ్యి తయారుచేశారన్నారు. 20కోట్ల లడ్డూల తయారీలో ఈ కల్తీని వాడటం వలన 234 కోట్ల రూపాయలను హవాలా రూపంలో జగన్ డొల్ల కంపెనీలకు చేరిందని ఆరోపించారు. 2020లో తొలిసారిగా లడ్డు శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపితే అస్సలు నెయ్యి లేదని, జంతువుల కొవ్వు ఉందని తేలిందన్నారు. 2022లో నివేదికలు వస్తే అప్పటి ప్రభుత్వం ఎందుకు పట్టించు కోలేదో అర్థం కావటం లేదన్నారు. ఇంతటి అక్రమాలు చేసి నిలదీస్తే మాజీ సిఎం జగన్ నుండి కిందిస్థాయి నాయకుల వరకు ఎదురు దాడి చేస్తూ వికృత చేష్టలు చేస్తున్నారని, దీనిని చూస్తూంటే ఎందుకు రాజకీయాల్లోకి వచ్చామా అని అనిపిస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. తిరుమలలో జరిగిన అపచారాలపై ప్రజల్లో చర్చ జరుగకుండా డైవర్షన్ పాలిటిక్స్‌ను వైకాపా చేస్తున్నదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం, నిఘా వర్గాలు, కంపెనీలు అన్నీ నెయ్యిలో కల్తీ జరిగిందని వెల్లడించాయని గుర్తుచేశారు. వీటి అన్నింటికి జగన్ సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిపై అంబటి చేసిన వాఖ్యలు నీతి మాలిన రాజకీయాలకు పరాకాష్ట అని పేర్కొన్నారు. తమ పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ ఒకేసారి గోవిందా అంటే వైకాపా కొట్టుకుపోతుందని హెచ్చరించారు. వైకాపా హుందా రాజకీయాలు చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, తెలుగుదేశం నేతలు, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని విమర్శిస్తే సహించేది లేదు

### ● కోటి 20 లక్షల టిడిపి కార్యకర్తలు రోడ్లపైకి వస్తే తట్టుకోలేరు ● మంత్రి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరిక



మదనపల్లె, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదివారం మదనపల్లికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిని ఉద్దేశించి అవాకులు చవాకులు పేలితే తెలుగుదేశం పార్టీ శ్రేణుల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, మా కార్యకర్తలు ఓపికగా ఉన్నారంటే అది మా నాయకత్వం నేర్పిన సంస్కారం అన్నారు. కానీ, మా ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలకు దిగితే మాత్రం చూస్తూ ఊరుకోం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కోటి 20 లక్షల మంది టిడిపి కార్యకర్తలు ఒక్కసారిగా రోడ్లపైకి వస్తే మీరు తట్టుకోలేరన్నారు. వైసిపి నాయకులు ఇలాగే తమ నాయకుల పై అసభ్య పదజాలంతో దూషిస్తే జగన్ బ్యాచ్‌కు 11 సీట్లు కూడా రావన్నారు. అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం లేక వైఎస్ జగన్, ఆయన అనుచరులు బయట కూర్చొని అనవసరపు విమర్శలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని 11 సీట్లకే పరిమితం చేసినా మీలో మార్పు రాకపోవటం సిగ్గుచేటు అన్నారు. ఇదే పద్ధతి కొనసాగించి, ముఖ్యమంత్రిని పదే పదే విమర్శిస్తే రాబోయే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా దక్కవని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యవహారశైలిని మంత్రి తీవ్రంగా తప్పుపట్టారు. అంబటి రాంబాబు తన స్థాయిని మర్చిపోయి మాట్లాడుతున్నారని, అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలు చేసిన వ్యక్తులు ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే వైకాపా నేతలు ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా మాట్లాడితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఇప్పటికే అంబటి రాంబాబుపై వస్తున్న ఫిర్యాదులే అందుకు నిదర్శనమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చిన్నబాబు, పుంగనూరు టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి, మదనపల్లి జనసేన ఇన్‌చార్జి రాందాస్ చౌదరి, మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శిబిరం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 'ఆటవిక అరాచకం'

### - చంద్రబాబు, లోకేష్ పాలనలో రౌడీ రాజ్యం
### - వైసిపి నేతలే లక్ష్యంగా హింసా రాజకీయాలు
### - మాజీ మంత్రి జోగి రమేష్ ఆగ్రహం



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రజాస్వామానికి పునాదైన శాంతిభద్ర తలు పూర్తిగా కూలిపోయా యని మాజీ మంత్రి జోగి రమేష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో మంత్రి లోకేష్ నేతృత్వం లో రాష్ట్రం మొత్తం అరాచక విధ్వంసానికి అడ్డాగా మారిందని మండిపడ్డారు. ఆదివారం మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. మంత్రి లోకేష్ సారథ్యంలో విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌ను తన నివాసం పైకి ఉసికొల్పి, పెట్రో బాంబులతో దాడులు చేసి, ఇంటికి నిప్పు పెట్టడం అమానుషం, నర మేధమని పేర్కొన్నారు. 'నన్ను చంపాలను కున్నారా? నా కుటుంబాన్ని దహనం చేయాల నుకున్నారా? ఇంతటి పాశవిక దాడులు ఎందుకు?' అని తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. పచ్చ రౌడీమూకల దాడి సమయంలో తాను ఇంట్లో లేనని, ఇంట్లో వృద్ధ తండ్రి, తన సతీమణి ఉన్నారని తెలిపారు. పెద్దఎత్తున టిడిపి రౌడీ మూకలు తన ఇంటిపై దాడులు చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని జోగి రమేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి మరవకముందే తన ఇంటిపై దాడి జరగడం రాష్ట్రంలో చట్టపాలన శూన్యమైందని స్పష్టం చూపుతుందన్నారు.

#### లోకేష్...రాక్షస పాలన క్షణికానందమే

లోకేష్ పాలనను 'రాక్షస పాలన'గా అభివర్ణిం చారు మాజీ మంత్రి జోగి రమేష్, ఇది కేవలం క్షణికానందమేనని హెచ్చరించారు. రాబోయేది వైసిపి ప్రభుత్వమేనని ఆ విషయాన్ని గుర్తు పెట్టుకుని మసలుకోవాలని సూచించారు. ఇలాంటి దాడులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ చంద్రబాబుది కాదని చోరీ చేశారని విషయం అందరికి తెల్సిందేనని, లోకేష్ విషయం 'కొవ్వు తగ్గింది గానీ...బ్రెయిన్ దొబ్బిందని' వాక్యలు చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. ఇలాంటి హింసా రాజకీయాలకు వైసిపి భయపడదని, మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసే వరకు అహర్నిశలు శ్రమిస్తామని తెలిపారు.

#### దాడిని ఖండించిన చెవిరెడ్డి

మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై జరిగిన దాడిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. వైసిపి నేతల ఇళ్లకు నిప్పుపెట్టి అధికార పార్టీ ఏమి సాధిస్తుందని ప్రశ్నించారు. అధికార పార్టీకి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆరోఫించారు.

# ఇంకెన్ని పరిణామాలో!?

### ● కలవరపెడుతున్న సిట్ నివేదికలు ● ఇఓ బదిలీతో టిటిడిలో విస్తృత చర్చ



తిరుమల, ఫిబ్రవరి 1 ప్రభాతవార్తప్రతినిధి: వైసిపి ప్రభుత్వంలో గత వైసిపి టిటిడి బోర్డులో చోటుచేసుకున్న చవిచూడని ఘటనలతో ఇప్పుడు టిటిడి వర్గాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. 2020-24 మధ్యకాలంలో నెయ్యిసరఫరా టెండర్లు మార్పుచేసి. ఏకంగా తమకు అను కూలంగా మార్చుకుని కొందరికి లబ్ధిచేకూరేలా నెయ్యిసరఫరాలో అక్రమాలకు పాల్పడ్డారనేది ఇప్పుడు సిబిఐ సిట్ అధికారులు అందించిన నివేదిక. ఈ నివేదిక ఆధారంగా టిటిడిలో కీలక మైన ఇఓ హోదా అధికారిని ఆ పోస్టు నుండి తప్పించడం సంచలనంగా మారింది. ఇదే సమ యంలో మరీ సిట్ నివేదికల ఆధారంగా లడ్డూ లకు కల్తీనెయ్యి వ్యవహారంలో తిరుగుతున్న మలుపులు ఇప్పుడు టిటిడిలో అలజడి సృష్టిస్తోంది. 2024 సంవత్సరం జూన్ నుండి కూటమి ప్రభుత్వం కల్తీనెయ్యిపై తీవ్రంగానే పరి గణించి దర్యాప్తు మొదలుపెట్టించింది. ఏడాది న్నర కాలం అన్ని కోణాల్లో లోతైన దర్యాప్తు చేసిన సిబిఐ సిట్ అధికారులు సమగ్రంగా నింది తులును పేర్కొంటూ ఇచ్చిన జాబితా ఇప్పుడు పెద్ద దుమారంరేపుతోంది. కల్తీనెయ్యి కేసులో తాజాగా నెలకొన్న పరిస్థితులు ఇంకా ఎవరి పద వులకు గ్రహణం పడుతుందని టిటిడి వర్గాల్లో హాట్‌టాఫిక్‌గా మారింది. లడ్డూలకు కల్తీనెయ్యి వినియోగించారనే విషయంపై 2019-24 మధ్యకాలంలో టెండర్లు నిబంధనలు మార్చడం, అప్పటి ఇఓగా పనిచేసిన, ప్రస్తుతం ఇఓగా కొనసాగుతున్న అనిల్‌కుమార్ సింఘాల్ వ్యవహారాన్ని సిట్ తప్పుపట్టింది. అప్పట్లో టిటిడి బోర్డు పెద్దలు నిబంధనలు మార్చినా ఇఓ స్థాయి అధికారిగా ఎందుకు ప్రశ్నించలేదని, దానిపై అధికారుల బృందంతో ఎందుకు ఆమో దించారనేది ఇప్పుడు ప్రభుత్వం వద్ద ప్రధాన సమాచారం. టిటిడిలో కీలక పోస్టులో దీర్ఘ కాలంగా కొలువుదీరిన ముఖ్యగణాంకాధికారి (ఆర్థిక విభాగం) ఎఫ్ఎసిఎఓ బాలాజీ వ్యవ హారంపై కూడా సిట్ సమగ్ర నివేదిక ఇవ్వడం, మాజీ ఇఓ ఏవి ధర్మారెడ్డిపై మరింత లోతుగా నివేదికలు ఇచ్చి చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేయడంతో ఇప్పుడు ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఏంటనేది అటు టిటిడి వర్గాల్లో ఇటు రాజకీయంగానూ పెద్ద మలుపు తిరగనుంది.

కల్తీనెయ్యి వ్యవహారమే సంచలనంగా మారినా తాజా నిర్ణయాలు టిటిడిలో మరింతగా ఉత్కంఠ గా మారింది. మరీ సమర్థవంతమైన ఐఏఎస్ అధికారి. ఇక ఎఫ్ఎసిఎఓ బాలాజీ వ్యవహారం లో ఆయన పదవీకాలం మరో ఏడాదిన్నర మాత్రమే ఉంది. ఆయనన్ను తప్పిస్తారా లేక తగిన శాఖాపరమైన చర్యలు ఉంటాయా అనేది టిటిడిలో చర్చమొదలైంది. ఓ వర్గం ఆయన మంచి అధికారిగా, తన విధులను నిక్కచ్చిగా చేసుకెళతారనేది వాదన వినిపిస్తోంది. మరీమరో వర్గం గుడ్డిగా సంతకం చేసి నిధులు విడుదల చేయడం, దుబారావెనుక ఆయన ప్రధానమని చెబుతోంది. ఈ నేపథ్యంలో ఎంతో సంచలనం రేపిన కల్తీనెయ్యిలో ఆయన మరక అంటించు కుంటారా? వేటుకు గురవుతారా అనేది మరో కొన్నిగంటల్లో తేలిపోనుంది. మొత్తం మీద కల్తీనెయ్యి బాగోతంలో కర్త, కర్మ, క్రియ ఎవరనేది ఆధారాలతో తేల్చేసినా సూత్రధారులు ఎవరనేది వెల్లడించకపోవడం వెనుక పెద్ద ట్విస్ట్ ఉందని ప్రస్తుత టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, సభ్యులు పేర్కొన్నారు.

# తిరుమల సమాచారం

## వేడుకగా మాఘమాస గరుడసేవ



తిరుమల, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త ప్రతినిధి: పవిత్రమైన మాఘమాసం పౌర్ణమి విశేషమైన రోజున ఆదివారం సాయంత్రం తిరుమలలో గరుడసేవ వేడుకగా జరిగింది. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగి సిన తరువాత విశేషాభరణాల అలం కృతుడై మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించారు. ఆలయ అర్చకులు స్వామివారిని మాఢవీధు ల్లో ఊరేగించారు. భక్తులు గోవింద నామస్మరణలతో పులకించారు. పౌర్ణమి రోజు తిరుమల ఆలయ మాఢవీదుల్లో గరుడవాహనసేవ నిర్వహించడం పరిపాటి. ఈ వాహనసేవలో జీయర్‌స్వాములు, టిటిడి ఇన్‌ఛార్జి ఇఒ చిరు మామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, భక్తులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా రామకృష్ణతీర్థ ముక్కోటి



తిరుమల, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త ప్రతినిధి: వేలకోట్ల పుణ్యతీర్థాలు ఉన్న తిరుమలలో ఆదివారం జరిగిన రామ కృష్ణతీర్థ ముక్కోటి వేడుకలు ప్రశాం తంగా ముగిశాయి. ఉదయం 6 గం. నుండి మధ్యాహ్నం 12 గం. వరకు భక్తులను అనుమతించిన టిటిడి అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. పవిత్ర పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులకు మెడికల్ స్క్రీనింగ్ పరీక్షలు అనంతరం అనుమతించారు. టిటిడి విఎస్‌ఒ అల్లం సురేంద్ర ఆధ్వర్యంలో విజిలెన్స్ సిబ్బంది, పోలీసులు స్వయంగా భక్తులకు సేవ లందించారు. అనా రోగ్యంతో బాధపడుతున్న భక్తులను, 12ఏళ్లలోపు పిల్ల లను రామకృష్ణ తీర్థంకు అనుమతించలేదు. ముక్కోటి పర్వదినం విజయ వంతంతో అధికా రులు ఊపిరిపీల్చుకున్నారు. శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణ స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## జనవరిలో హుండీ ఆదాయం రూ.124.50 కోట్లు



తిరుమల, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త ప్రతినిధి: నూతన ఆంగ్లసంవత్సరం 2026 జనవరి నెలలోనూ ఏడు కొండల శ్రీవేంకటేశ్వరస్వామికి కాను కల రూపంలో హుండీ ఆదాయం వంద కోట్లకు తగ్గలేదు. పూర్తిగా జనవరిలో పదిరోజు లు తెరచివుంచిన వైకుంఠద్వార దర్శనాల్లో భక్తులు అశేషంగా తిరుమలకు చేరుకుని ఏడు కొండలస్వామిని దర్శించుకున్నారు. ఆ పది రోజుల హుండీ ఆదాయం కలుపుకుని నెల మొత్తం రూ.124.50 కోట్లకు చేకూరింది. జనవరి నెలకు సంబంధించి శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్యను గమనిస్తే గణాంకాలు మాత్రం భక్తుల సంఖ్యతోబాటు వెంకన్న హుండీ ఆదాయం కూడా భారీగా రెట్టింపైంది. జనవరిలో మొత్తం 23,50,217 మంది భక్తులు తమ ఇష్టదైవాన్ని దర్శించుకోగా మొక్కుబడుల రూపంలో కానుకలుగా హుండీలో సమర్పించిన ఆదాయం రూ.125 కోట్లకు చేకూరింది.

## శ్రీవారి సేవలో జడ్జి ఉదయ్ ఉమేష్ లలిత్



తిరుమల, జనవరి 1 ప్రభాతవార్తప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులందరిపై కలగాలని విశ్రాంత న్యాయమూర్తి ఉదయ్ ఉమేష్ లలిత్ తెలిపారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలసి ఆయన తిరుమలకు వచ్చారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో వేంక టేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమ ర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భగవంతుని ఆశీర్వాదం అందరిపై ఉండాలి



తిరుమల, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు బిసివై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ తెలిపారు. భగవంతుని ఆశీస్సులతో లోకం సుభి క్షంగా ఉండాలని అందరూ సుఖసంతోషాలతో వర్థిల్లాలని ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం నైవేద్య విరామ సమయంలో కుటుంబంతో కలసి ఆయన ఆలయంలోనికి చేరుకుని స్వామివారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ముగిసిన గోవిందరాజుని తెప్పోత్సవాలు



తిరుపతి, ఫిబ్రవరి1 ప్రభాతవార్త ప్రతినిధి: గోవిందరాజస్వామి ఆలయ వార్షిక తెప్పోత్సవాల్లో ఏడవరోజు ఆదివారం సాయంత్రం వైభవంగా ముగిశాయి. చివరగా శ్రీదేవిభూదేవి సమేత గోవిందరాజస్వామి తెప్పపై వేంచేపుచేసి భక్తులను కటాక్షించారు. సాయంత్రం 6.30గంటలకు తెప్పపై ఏడుచుట్లు విహరించి భక్తులకు అభయమిచ్చారు. పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ నారాయణచౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, అర్చకులు పాల్గొన్నారు.

# అమ్మకు మించిన దైవం లేదు

### దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ



అనంతపురం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త బ్యూరో: తల్లికి మించిన దైవం లేదని అమ్మను పూజిస్తే దైవానుగ్రహం లభి స్తుందని నిత్యం మనం జన్మనిచ్చిన తల్లిని తల్లితండ్రులను పూజిస్తూ ప్రేమిస్తూ ఉండాలని మైసూరు దత్త పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదా నంద స్వామీజీ అన్నారు. రాప్తాడు మండలం బొమ్మపర్తి జయలక్ష్మిపురం గ్రామం నందు స్వామీజీ మాతృమూర్తి జయలక్ష్మి మాత ఆరాధన ఉత్సవాలు ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామీజీ జయలక్ష్మి మాత దత్తాత్రేయుడు శివునికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవాటు చేసుకోవాలని, దైవ అనుగ్రహం పొందాలంటే నిత్యం సేవ చేస్తూ ఉండాలని, ఏదోవిధంగా దైవ కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, షిరిడి సాయిబాబా పాత్రధారి మచ్చ రామలింగారెడ్డి స్వామీజీని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మైసూర్ దత్తపీఠం ప్రతినిధులు శ్రీనాథ్, దత్త మందిరం ప్రతినిధులు నారాయణ శర్మ, తిరుపాల్ రెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వార్త

చాలా మంది తమ అంతరాత్మలోకి వచ్చే గొప్ప ఆలోచనల్ని నిర్లక్ష్యం చేస్తారు. కానీ అవే ఆలోచనలు ఎదుటి వారిలో చూసి అంతగొప్ప ఆలోచన వచ్చినందుకు ఆశ్చర్యపోతారు.

న-సోమర్‌సెట్‌మామ్

# 'సాధారణ' పద్దు!

ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ సాధారణ బడ్జెట్‌గానే కనిపించింది. వికసిత్‌భారత్ లక్ష్యసాధన దిశగా కేంద్ర బడ్జెట్‌ను రూపకల్పనచేసినట్లుగా ఆర్థికమంత్రి నిర్మలమ్మ తన ప్రసంగంలో వివరించినప్పటికీ పెద్దగా ఊరడింపులేవీ కనిపించలేదు. పన్నుశ్లాబుల్లో పెద్ద మార్పులు లేకపోయినా రక్షణరంగం, మౌలికవనరుల రంగానికి అత్యధికప్రాధాన్యం ఇచ్చారు. అదేవిధంగా వ్యవసాయ రంగానికి కూడా కొంతప్రాధాన్యం పెంచారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశ రక్షణ సామర్థ్యం ప్రపంచానికి తెలిసింది. శత్రుదేశాల రక్షణ వ్యవస్థకు ధీటుగా భారత్ వ్యవస్థను మరింత శక్తివంతంచేసేందుకు బడ్జెట్‌లో రూ.7.85 లక్షల కోట్లు కేటాయింపులు జరిపారు. సంస్కరణల భారత్‌కు కొత్తశక్తి ఇచ్చేదిగా ఉందని చెపుతున్న ఈ బడ్జెట్‌లో మౌలికవనరుల రంగానికి అంటే రవాణా రంగానికి కూడా ప్రాధాన్యతను పెంచారు. ఈ బడ్జెట్‌లో 5.84 లక్షల కోట్లు కేటాయింపులు జరిపితే వ్యవసాయ రంగానికి రూ.1.62 లక్షలకోట్లు కేటాయించడం గమనార్హం. కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే అమలులోకి తెస్తామని కేంద్రం ప్రకటించింది. ఆర్థిక వ్యవస్థలో సంతులనం పాటిస్తూ మొత్తం ఆర్థిక లోటును జిడిపిలో 4.3శాతంగా ఉంటుందని అంచనా వేసిన కేంద్రం రాష్ట్రాలకు ఆర్థికసంఘం గ్రాంట్లుకింద రూ.1.4 లక్షలకోట్లు కేటాయించడం రాష్ట్రాల ఆర్థిక పరిపుష్టికి కొంతమేర ఫోకస్‌పెంచినట్లు తెలు స్తోంది. గడచిన పదేళ్లలోనే 25 కోట్లమంది పేదరికం నుంచి విముక్తి కాగలిగారని చెపు తున్న కేంద్రం సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ కర్తవ్య పథాన్ని వీడలేదని చెపుతూనే కీలక రంగాలకు మాత్రమే కేటా యింపులు పెంచింది. సెమి కండక్టర్ పరిశ్రమలకు ముందునుంచే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన మోడీ సర్కారు కొత్త బడ్జెట్‌లో బేసిక్ సుంకాలన్నింటినీ మినహాయించింది. ప్రత్యేకించి ఫార్మా రంగంలో సుంకాల మినహాయింపులిచ్చి మందులను అందుబాటు ధరల్లోకి తీసుకువచ్చే ప్రయత్నం చేసింది. ప్రధానంగా 17 ఔషధాలపై కస్టమ్స్ సుంకాలు మొత్తం తొలగించింది. బయోలాజిక్స్, బయోసిమిలర్స్ దేశీయ ఉత్పత్తి వ్యవస్థలకోసం బయోఫార్మా శక్తి కింద రూ.10 వేల కోట్లు కేటాయించడం ఈ రంగానికున్న ప్రాధాన్య తను తెలియజెప్పింది. సన్నచిన్నతరహా పరి శ్రమలకోసం ఎస్ఎంఇ గ్రోత్‌ఫండ్‌కింద రూ.10వేల కోట్లతో నిధి ఏర్పాటుచేసారు. బడ్జెట్‌లో మూల ధన వ్యయాన్ని గత బడ్జెట్‌కంటే పెంచింది. 12.2 లక్షల కోట్లకు పెంచింది. దీనివల్ల మౌలికవనరుల రంగంపై ఎక్కువ వ్యయం చేసేందుకు వీలుకలుగుతుంది. రవాణరంగ పరంగా హైస్పీడ్ కారిడారు చేర్చింది. పర్యాటకరంగాన్ని కూడాప్రోత్సహించేదిశగా కేంద్రంచేపట్టిన చర్యల్లో ఈసారి ఈశాన్యరాష్ట్రాలకుసైతం ప్రాధాన్యత ను పెంచింది. క్రీడల్లో మరింత రాణించేందుకు వీలుగా వచ్చే దశాబ్ద కాలానికిగాను ఖేలో ఇండియా మిషన్ ఏర్పాటు చేస్తోంది. ప్రధానంగా కృత్రిమమేధ వినియోగం అన్ని రంగాలకు విస్తరింపచేసేందుకువీలుగా వ్యవసాయ రంగంలోకూడా ఎఐ వ్యవస్థను మరింతగా పెంచాలని చూస్తోంది. టెక్నాలజీ ఆధారిత రంగాలకు ఇతోధిక ప్రాధాన్యం కల్పించిన ఆర్థిక మంత్రి బడ్జెట్ ఐటి,ఐటి అనుసంధానిత రంగాలు కూడా ఉన్నాయి. మొత్తంగా చూస్తే 53.47 లక్షలకోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్టాక్ మార్కెట్లకు సైతం అంతగా రుచించలేదు. వ్యవసాయ, సహకార రంగాలకు ఇతోధిక ప్రాధాన్యం కల్పించారు. సన్న చిన్నకారు రైతులకు ప్రోత్సాహకరమైన వ్యవస్థలు తీసుకువస్తామని ప్రకటించిన ఆర్థికమంత్రి ప్రధానంగా పిఎం కిసాన్ పెంపుపై ప్రస్తావించలేదు. అదేవిధంగా వ్యక్తిగత పన్నుశ్లాబుల్లోను ఎలాంటి మార్పులను తీసుకు రాలేదు. అయితే ఈక్విటీ రంగాలపై పన్నుల భారం మాత్రం మోపారు. ఫ్యూచర్స్, ఆప్షన్స్‌పైనా పెంచిన కేంద్రం ఎల్టీసీజి, ఎస్టీసిజి, ఎస్‌టిటి వంటి వాటిపై చురకలువేసింది. గ్లోబల్ ట్యాలెంట్ వెలికి తీతకు భారత్ లో ఐదేళ్లవరకూ పనిచేసిన ప్రవాసులకు పన్నుమినహా యింపులుప్రకటించారు. ప్రవాసులందరికీ కూడా కనీస ప్రత్యామ్నాయ పన్నునుంచి మినహాయింపులు ఇస్తున్నట్లు ఆర్థికమంత్రి వివరిం చారు. దేశీయ ఉత్పత్తిరంగాన్ని మరింతగా ప్రోత్స హించేందుకుగాను ఎగుమతులను మరింత పెంచే దిశగా కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ వ్యవస్థల్లో మార్పులు ఉంటాయన్నారు. ఉత్పత్తి రంగంలోప్రధానంగా ఇంధన రంగంలో భారీ యంత్ర పరికరాల తయారీకి లిథియమ్ ఇయాన్ సెల్ బ్యాటరీల తయారీకి సుంకాల మినహా యింపులు కూడా ఇచ్చింది. సంక్లిష్ట ఖనిజవనరులపైనా బేసిక్ సుంకాలను మినహాయించడంవల్ల ఆరంగాలకు కొంతమేర కేటాయింపులు జరిపారు. సేవలరంగంలో కృత్రిమమేధ వినియో గం పెంచుకోవాలని కేంద్రం టెక్నాలజీ రంగంపై ఎక్కు ఫోకస్ పెట్టింది. యథాప్రకారం సెమికండక్టర్ రంగంపై వ్యయం చేస్తోంది. సెమి కండక్టర్‌మిషన్‌కు రూ.40వేల కోట్లు కేటాయింపుల ద్వారా దిగుమతులపై ఆధార పడటాన్ని తగ్గించుకునే లక్ష్యాన్ని వ్యక్తంచేసింది. టెక్నాలజీ రంగానికి ప్రాధాన్యం బడ్జెట్ లో 2047 వరకూ పన్ను విరామాన్ని ప్రకటించారు. ఇంధన రంగంలో అణువిద్యుత్ ప్రాజెక్టులకు సుంకం మినహాయింపుల కొనసాగింపు, విమానయానరంగానికి ఈ సుంకాల నుంచి మినహాయింపులను ప్రకటించారు.గత సంవత్సరంతో పోలిస్తే మినహాయింపులేమీ లేకపోయినా పారిశ్రామిక, టెక్నాలజీ రంగాలకు వెన్నుదన్నుగా నిలుస్తుందని చెప్పుకోవచ్చు.

ఇతరులు అనుసరించడానికి తమనే ఉదాహరణగా తీసుకోవాలని తమకు తామే ఎవరైతే అనుకుంటారో, వారు అభివృద్ధి చెందలేరు.



గోల్డ్‌స్మిత్

చదువు డబ్బు లాంటిది. ఎంత సంపాదించినా అంతకంటే ఎక్కువ సంపాదించడానికి మనస్సు ఉబలాటపడాలి.



జోసఫ్ బిల్లింగ్స్

# ప్రజావాక్కు



### ఆర్థిక సర్వే ఆశాజనకం!

ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థికసర్వే 2026 రానున్న ఏడాది దేశానికి శుభప్రదం అని చెప్తోంది. వృద్ధి రేటు 7శాతానికి అటూ ఇటుగా ఉంటుందని భావిస్తుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆటుపోట్లను చూస్తున్న వేళ ఈ దిశగా వృద్ధి సాధించడం మంచి పరిణామం. ఈ యేడు దేశానికి మూలస్థంబంగా ఉన్న వ్యవసాయం దిగుబడుల్లో వృద్ధి చూపించింది. అలాగే సేవల రంగం కూడా పటిష్టంగా ఉండి మెరుగైన స్థితిలో ఉంది. డిజిటల్,మౌలిక సదుపాయాలు,తయారీ రంగాలుస్థిరంగా ముందుకు వెళ్తున్నాయి.అందుకనేనిలకడగా వృద్ధిరేటు ప్రగతిపథంలోనే సాగగలదని ప్రభుత్వపు అంచనా.అయితే రూపాయి విలువ తగ్గుతూ రావడం,అమెరికా విధానాలతో వాణిజ్యం ఒడిదుడుకులకు లోనవుతుండడం ముందున్న సవాళ్లు.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### బియ్యంపై సుంకాల పెంపు

ఇటీవల భారత బియ్యంపై భారీసుంకాలు విధించే అవకాశాన్ని ప్రస్తావించడంతో,అంతర్జాతీయ వాణిజ్య వర్గాలలో కొత్త చర్చ మొదలైంది. అమెరికన్ రైతులు భారతదేశం తక్కువ ధరలకు బియ్యం డంపింగ్ చేస్తోందని ట్రంప్ వద్ద ఫిర్యాదుచేశారని వచ్చిన సమాచారం ఈ వివాదానికి మరింత ఊతమిచ్చింది.ఈపరిణామం భారతీయ బియ్యం ఎగుమతులపై మాత్రమే కాదు,రెండు దేశాల ఆర్థిక సంబంధాలపై కూడా స్పష్టమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఎగుమతి దేశం. నాణ్యత, ధరలో పోటీ సామర్థ్యం కారణంగా అనేక దేశాలు భారత బియ్యాన్ని కొనుగోలు చేస్తాయి.

- కె.నాగరాజు, నెల్లూరు

### సీనియారిటీ లిస్ట్

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న లెక్చరర్స్,టీచర్స్‌ను రాష్ట్రస్థాయిలో గురుకులాల సొసైటీల వారీగా సీనియారిటీ లిస్టు ప్రకటించాలి.ఎస్సీఎస్టీ బీసీమైనారిటీ వికలాంగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్స్ సౌకర్యంకల్పించాలి. అదనపు విద్య అర్హతలు,వివిధ యూనివర్సిటీల నుండి డాక్టరేట్ పట్టా పొందినవారికి ప్రమోషన్ లిస్టులలో ప్రాధాన్యత కల్పించాలి. ఈవిద్యాసంవత్సరం చివరి నాటికి ప్రిన్సిపాల్ సీనియారిటీ లిస్టు ప్రకటించాలి.

- రాపాక రవీందర్, జనగాం

### ప్రజల్లో అవగాహన అవసరం

భారతదేశంలో ఇటీవలి సంవత్సరాలలో బస్సు ప్రమాదాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రజల రవాణా అవసరాల కోసం బస్సుప్రయాణాలు పెరగడంవలన రహదారులపై వాహనాల సంఖ్య అధికమవుతోంది. అయితే, సరైన రహదారి ప్రమాణాలు లోపించడం, డ్రైవర్లలో అవగాహన కొరవడటం, బస్సు నిర్వహణ లోపాలు వంటి కారణాల వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అతివేగం,డ్రైవర్ల అలసట, మోతాదు మించిన ప్రయాణికుల రద్దీకూడా ఈప్రమాదాలకు దోహదపడుతున్నాయి. ప్రతిరోజూఎందరో ప్రయాణికులు బస్సుద్వారా గమ్యస్థానాలకు చేరుకుంటూ, తమ ప్రియమైన వారిని వదిలిపెట్టి ప్రాణాలను కోల్పోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాలలో, పొరపాట్లను పట్టించుకోకుండా డ్రైవర్లు బస్సులను వేగంగా నడపడం, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించడం ప్రమాద ఘటనలకు ప్రధాన కారణాలు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పద్మ అవార్డులు

కేంద్రప్రభుత్వం ఈసారి ప్రకటించిన పద్మఅవార్డ్స్ చాలా కింది స్థాయివ్యక్తులకు వారుచేసిన కృషిని గుర్తించినట్టుగా ఉన్నాయి. గత పది సంవత్సరాలుగా ఈ పని కొనసాగుతుంది. అందులో ముఖ్యంగా మొక్కలు పెంచడమే లక్ష్యంగా పని చేసిన వారికి అవార్డు ప్రకటించడం ద్వారా అవార్డులకు రాజకీయాలు దూరం అని చాటినట్టు అయింది. కేరళ రాష్ట్రంలో ఉన్న ఎన్నికల నేపథ్యంలో ఇచ్చారని అనుకున్నా టీ నారాయణన్ గురించి నేటి తరానికి తెలియజేప్పే అవకాశం కనీసం పత్రికల వాళ్లకు అయినా దొరికినందుకు సంతోషం.

- భారత అవినాష్, జనాగమ

### ఆర్థిక సహాయం కల్పించాలి

విజ్ఞాన శాస్త్రాన్ని కేవలం వారి చదువులో భాగంగా పరిశోధన చేస్తూ ఒక దృక్పథంతో చేపట్టిన ప్రయోగ ఫలితాలు మనిషి జీవనానికి, ప్రాణరక్షణకు, సౌలభ్యానికి తోడ్పడే మహానుభావుల త్యాగం అమూల్యం,చిరస్మరణీయం.వాటి ఫలితాలు అనుభవించడం చాలా తేలిక. కావున అటువంటి ఆశయాన్ని, కృషిని గుర్తిస్తూ ఉన్నత విద్యావంతులు ఉద్యోగంతో పాటు మరింత ముందుకు సాగేందుకు కృషి చేస్తే మరిన్ని రంగాల్లో కొన్ని సమస్యలు పరిష్కారం అవ్వొచ్చు. వీటికోసం దేశంలో పరిశోధన చేసే విద్యార్థులకు ఆర్థిక సహాయం, ప్రోత్సాహం విరివిగా కల్పించాలి. వారికి అన్ని వనరులు కల్పించాలి.

-బి.మేఘానాధం, విశాఖపట్నం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆకాశమార్గంలో ఆపదలు ఆపలేమా?

**ముఖ్యంగా దేశ జనాభా అవసరాలకు తగినన్ని ఎయిర్పోర్టు, విమానాలు, పైలెట్లు లేరన్నది వాస్తవం. అందువల్ల పైలెట్లపై పనిభారం పడుతున్నది. ఏ మనిషికైనా తగినంత విశ్రాంతి లేకపోతే, తీవ్ర ఆందోళనకు గురౌతాడు. ఇది కూడా ప్రమాదాలు జరగడానికి ఒక కారణమే. విమాన ప్రమాదం జరిగిన వెంటనే ప్రమాద స్థలాన్ని భద్రతా బలగాలు సీజ్ చేస్తారు. అక్కడ ఉన్న విమాన శకలాలను జాగ్రత్తగా సేకరిస్తారు. ముఖ్యంగా బ్లాక్ బాక్స్‌ను విశ్లేషణ చేస్తారు. ఇలా ఎంతో పగడ్బందీగా దర్యాప్తు చేస్తారు. ఐనప్పటికీ ప్రమాదానికి సరైన కారణాలను లిస్ట్ అవుట్ చేయలేక పోతున్నారు. ఇది మరిన్ని అనుమానాలకు దారితీస్తున్నది. చివరగా ఇంకో విషయం, ఏదైనా విమానం ప్రమాదంలో ఉందని తెలిసిన మరుక్షణంలో, ప్రయాణీకులు ముందస్తుగా ఎయిర్ బెలూన్లతో తప్పించుకునే అవకాశముందా? లేదా? అనే ప్రశ్నలకు నిపుణులు జవాబులు చెప్పాల్సిందే.**



పిల్లా తిరుపతిరావు

ప్రమాద సంఘటనలను నివారించడమే విమానయాన భద్రత ప్రాథమిక లక్ష్యం.కానీ ఇటీవలకాలంలో వరుస విమాన ప్రమాదాలను చూస్తున్నాం. ప్రయాణాల దూరగణాన్ని బట్టి చూస్తే విమానయానమే అత్యంత సురక్షితమైన రవాణా మార్గం. ఒక మైలుకుప్రాణాంతకమైన అన్ని ఇతర రవాణా విధానాలతో పోల్చినప్పుడు వాయు రవాణాయే సురక్షితం. కారులో ప్రయాణించడం కంటే ఆరురెట్లు, రైలులో ప్రయాణించడం కంటే రెండురెట్లు సురక్షితం విమానయానం. విమాన ప్రయాణాలు సురక్షితమని పలురకాల గణాంకాలు ఇలా చెబుతూనే ఉన్నాయి. అయినప్పటికీ ఎయిర్ క్రాఫ్ట్ కుప్పకూలుతూనే ఉన్నాయి. పొగమంచు, తక్కువ దృశ్యమాన్యత,ఉరుములు మెరుపులు వాతావరణం అల్లకల్లోలం లాంటి ప్రతికూల పరిస్థితులే విమాన ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా పేర్కొనవచ్చు. ఐతే ఎక్కువ గంటలు నిడివి గల విదేశీ విమానయానం కంటే తక్కువ గంటల దేశీయ విమానయానంలోనే ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఎందుకలా జరుగుతున్నాయో! అర్థం కావడం లేదు. మానవ తప్పిదాలా? లేక సాంకేతిక లోపాలా? లేక ప్రతికూల వాతావరణ పరిస్థితులా? అనేది పలుదర్యాప్తుల అనంతరం కూడా మీమాంసగానే మిగులుతున్నది. భారత్ లోనైతే గతేడాది జూన్ 12వ తేదీన అహ్మదాబాద్ నుండి లండన్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం టేక్ ఆఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే ఓ మెడికల్ కాలేజీ హాస్టల్ పై కుప్పకూలింది. ఆ విమాన ప్రమాదం ఆనాడు జనం గుండెల్లో గుబులు రేపింది. 243 మంది ప్రయాణీకులలో ఒక్కరు తప్ప అందరూ మరణించారు. ఈసంఘటన భారత్ సురక్షిత విమానయానానికి పెను సవాల్ విసిరింది. మొన్నజరిగిన ప్రత్యేక విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ చనిపోయారు. పైలెట్లు, సిబ్బంది కూడా మరణించారు. ప్రపంచ వ్యాప్తంగా 1970 నుంచి 2026 వరకు సుమారు11,200 విమాన ప్రమాద సంఘటనలు జరిగితే, దాదాపు 84 వేల మంది ప్రయాణీకులు మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఐతే విమాన ప్రమాద సంఘటనల్లో ప్రముఖులు చాలామంది చనిపోయారు. ఆజాద్ హింద్ ఫౌజ్ దళపతి నేతాజీ సుభాష్ చంద్రబోస్ 1945 ఆగస్టు 18న తైవాన్ మీదుగా టోక్యో వెళ్తూ టేక్ ఆఫ్ సమయంలో జరిగిన విమాన ప్రమాదంలో మరణించినట్లు విశ్వసనీయ సమాచారముంది. ఐతే నేతాజీ మరణం ఇంకా మిస్టరీగానే మిగిలిపోయింది. 1966లో అణుశక్తి పితామహుడు హోమీబాబా ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో తనువు చాలించారు. 1980లో ఇందిరాగాంధీ కుమారుడు సంజయ్ గాంధీ తాను నడుపుతున్న ఎయిర్ క్రాఫ్ట్‌కు బలయ్యాడు. 2001లో మాధవరావు సింధియా ఉత్తరప్రదేశ్‌లో గల మెయిన్ పురి దగ్గర విమాన ప్రమాదంలో చనిపోయారు. 2002లో లోక్‌సభ స్పీకర్ జి.ఎం.సి బాలయోగి కైకలూరు సమీపంలో తాను ప్రయాణిస్తున్న హెలికాప్టర్ చెట్టును ఢీ కొట్టగా చనిపోయారు. 2004లో సినీనటి సౌందర్యఎయిర్ క్రాఫ్ట్ ప్రమాదంలో మరణించారు.2009లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి నల్లమల అటవీ ప్రాంతం పావురాలగుట్టలో హెలికాప్టర్ ప్రమాదంలో పరమపదించారు.2011లో దోర్జీ ఖండూ అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి విమాన ప్రమాదంలో మరణించారు. 2021లో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ నీలగిరి జిల్లా



కూనూర్ సమీపంలో భారత వాయుసేన హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారు. గతేడాది జరిగిన అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రివిజయ్ రూపానీ ప్రాణాలొదిలారు. ఈ ఏడాది బారామతి ఎయిర్ క్రాఫ్ట్ ప్రమాదంలో అజిత్ పవార్ కన్నుమూశారు. ఇలా జరిగిన విమాన ప్రమాదాల్లో ప్రముఖ వ్యక్తులే కాకుండావారితో ప్రయాణిస్తున్న పైలెట్లు, సిబ్బంది చనిపోవడం గమనార్హం. భారత్‌లోనే కాక ప్రపంచమంతటా ఇలాంటి ఎయిర్ క్రాఫ్ట్ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయితే ఈ విమాన ప్రమాదాలకు కారణాలు ఏమిటి?అనే ప్రశ్నకు జవాబులు వెతుక్కోవాల్సిందే. రెండు దశాబ్దాల క్రితమే దేశపౌరులకు చౌక విమానయానాన్ని అందించడానికి కొన్ని కార్పొరేట్ సంస్థలు సిద్ధమయ్యాయి. ఆయా సంస్థలకు చెందిన విమానాల్లో దేశీయంగా ప్రయాణించాలంటే రెండు, మూడు నెలలు ముందుగా టిక్కెట్లు బుక్ చేసుకుంటే, తక్కువధరకు ప్రయాణం దొరికేది. ఈ విధానంవల్ల కేవలం ధనికులకే పరిమితమైన విమానయానం పేద, మధ్యతరగతి వర్గాలకు వరమయ్యింది.ఐతే ఈక్రమంలో ఆయా వైమానికసంస్థలు ప్రయాణీకుల భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు పాటించడం లేదు. తక్కువ ఛార్జీలతో భద్రతగల ప్రయాణం అందించడం ఎవరికైనా కష్టం. కానీ ఆ సంస్థలు తమ ప్రయాణీకులకు భద్రతగల ప్రయాణాన్ని అందిస్తామని చెప్పాయి.పాత విమానాలను సెకండ్ సేల్స్‌లో కొనుక్కొని, వాటికి మరమ్మత్తులు చేసుకొని, ఆకాశయానానికి ఉపయోగించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. విమానాల మెయింటెనెన్స్ సరిగ్గా చేయకపోవడం కూడా ప్రమాదాలకు ఒక కారణమే. అలాగని అన్నివేళలా ప్రమాదాలు సంభవించకపోవచ్చు. కానీ ఎప్పుడో ఒకప్పుడు ప్రమాదాలు జరగటం వల్ల తీవ్రమైన ప్రాణనష్టం ఎదుర్కొనక తప్పదు. రోడ్డు, రైలు మార్గాలలో జరిగే ప్రమాదాలలో వందశాతం ప్రాణనష్టం ఉండదు. కానీ ఎయిర్ ప్రమాదాల్లో ప్రాణనష్టం నూటికి నూరుశాతం ఉంటుంది.అందువల్ల విమానయానాన్ని నడిపే సంస్థలు విమానాల్లో గానీ, ఎయిర్పోర్టుల్లో గానీ సాంకేతికంగా నిర్వహణ పరంగా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. వీటి విషయంలో ఏమాత్రం ఏమరపాటు వహించినా భారీమూల్యం చెల్లించుకోక తప్పదు. కొన్ని ప్రైవేట్ ఏవియేషన్ సంస్థలు చార్టర్ ఫ్లైట్స్‌ను అద్దె కొనుగోలు పద్ధతిపై నడుపుతున్నాయి. వీటిని రాజకీయ నాయకులు, సినీనటులు, పారిశ్రామికవేత్తలుతమ వ్యక్తిగత ప్రయాణాలకు,ఎన్నికలప్రచారాలకు విరివిగా వాడుతున్నారు. ఐతే ఈ సంస్థలు తమ విమానాల నిర్వహణలో ఎటువంటి నాణ్యతలు పాటించడం లేదన్నది వాస్తవం. అందువల్లే చాలా ఎయిర్ ప్రమాదాలు జరుగుతున్నాయి. నేడు పేద, మధ్యతరగతి వర్గాలకు సాఫ్ట్వేర్ రంగం అందుబాటులోకి వచ్చింది. ఎక్కువమంది యువతీయువకులు సాఫ్ట్వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంకా కార్యనిర్వాహక రంగంలో ఆయా వర్గాల పిల్లలు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వీరంతా కాలపరిమితి దృష్ట్యా విమానయానంపైనే ఆధారపడుతున్నారు. గతంలో భారత ప్రభుత్వం డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఆధ్వర్యంలో విమాన ప్రమాదదర్యాప్తులు జరిపించేది. 2012 తర్వాత ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ఆధ్వర్యంలో దర్యాప్తులు నిర్వహిస్తున్నది. ఐతే ఈదర్యాప్తుల్లో ఎక్కువగా సాంకేతిక లోపాలవల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు తేలుతున్నది. అందువల్ల ఈ దర్యాప్తులు తూతూమంత్రంగా సాగుతున్నాయా? అనే అనుమానం లేకపోలేదు.ఇంకా ఆ దర్యాప్తుల్లో పైలట్ల నిద్రలేమి, పనిగంటల పెంపు, విధి నిర్వహణలో ఒత్తిడి, నిర్లక్ష్యం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు కూడా కారణమనే విషయాలు వెల్లడౌతున్నాయి. కానీ నష్ట నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ముఖ్యంగా దేశ జనాభా అవసరాలకు తగినన్ని ఎయిర్పోర్టు, విమానాలు, పైలెట్లు లేరన్నది వాస్తవం. అందువల్ల పైలెట్లపై పనిభారం పడుతున్నది. ఏ మనిషికైనా తగినంత విశ్రాంతి లేకపోతే, తీవ్ర ఆందోళనకు గురౌతాడు. ఇది కూడా ప్రమాదాలు జరగడానికి ఒక కారణమే. విమాన ప్రమాదం జరిగిన వెంటనే ప్రమాద స్థలాన్ని భద్రతా బలగాలు సీజ్ చేస్తారు. అక్కడ ఉన్న విమాన శకలాలను జాగ్రత్తగా సేకరిస్తారు. ముఖ్యంగా బ్లాక్ బాక్స్‌ను విశ్లేషణ చేస్తారు. ఇలా ఎంతో పగడ్బందీగా దర్యాప్తు చేస్తారు. ఐనప్పటికీ ప్రమాదానికి సరైన కారణాలను లిస్ట్ అవుట్ చేయలేక పోతున్నారు. ఇది మరిన్ని అనుమానాలకు దారితీస్తున్నది. చివరగా ఇంకో విషయం, ఏదైనా విమానం ప్రమాదంలో ఉందని తెలిసిన మరుక్షణంలో,ప్రయాణీకులు ముందస్తుగా ఎయిర్ బెలూన్లతో తప్పించుకునే అవకాశముందా?లేదా? అనే ప్రశ్నలకు నిపుణులు జవాబులు చెప్పాల్సిందే. ●

# నకిలీ ఔషధాలను ఆదిలోనే అరికట్టాలి

మహమ్మద్ ఆరిఫ్

ఫార్మా హబ్‌గా హైదరాబాద్‌ను పాలకులు కీర్తిస్తున్నారు. విశ్వ నగరంగా పేర్కొంటూ అనేక ఫార్మా కంపెనీలకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. అయితే ఇది ఒక వైపు మాత్రమే. ఇదే విశ్వనగరంలో నకిలీలు రాజ్యమేలుతున్నాయి. మెడికల్ మాఫియా ధన దాహానికి ప్రాణాలు సంకటంలో పడుతున్నాయి. ఏ మెడికల్‌లో నుంచి మందులు కొనుగోలు చేసుకోవాలో? అసలు ఏ మందు అసలుదో? ఏది నకిలీదో? తెలియక అమాయక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఇటీవల మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలో డ్రగ్ కంట్రోల్ అధికారులు జరిపిన దాడుల్లో వెలుగు చూసినా నకిలీ మందుల దందా ఈ ఆందోళనను మరింత పెంచుతున్నది. అయితే ఇది ఒక మెడికల్ దుకాణానికో, ప్రాంతానికో పరిమితమైనట్లు కనిపించడం లేదు. చాపకింద నీరులా దేశ వ్యాప్తంగా విస్తరించినట్లు అర్థమవుతున్నది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు నకిలీ మందులను తెప్పించి వాటిని బ్రాండెడ్ కంపెనీల పేర్లతో రాష్ట్రంలో చలామణి చేస్తున్నారు. షుగర్, బీపీ, గ్యాస్ట్రిక్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు వాడే మందులే ఎక్కువగా నకిలీ ఉంటుండడం గమనార్హం. రోజూ మందులు వాడకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లే రోగులను లక్ష్యంగా చేసుకుంటుండడం తీవ్రఆందోళన కలిగిస్తున్నది. చాక్‌పీస్ పౌడర్, మొక్కజొన్న పిండితో కూడా నకిలీ మెడిసిన్స్ తయారు చేస్తున్నట్లు ఔషధ నియంత్రణ శాఖాధికారులు గతంలో గుర్తించారు. డాక్టర్ రెడ్డీస్, అబోట్, సన్ ఫార్మా గ్లెన్ మార్క్, అరిస్టో, టోరెంట్ కంపెనీల బ్రాండ్లను అతికించి నకిలీ మందులను విక్రయిస్తున్నట్లు నిర్ధారించారు. అంతే కాకుండా మోతాదు కంటే అతి తక్కువ రసాయనాలతో మెడిసిన్స్ తయారు చేస్తున్నట్లు, ఒక ఫార్ములాకు బదులు



మరో ఫార్ములా వాడుతున్నట్లు అధికారుల దర్యాప్తులో తేలింది. మరోవైపు ప్రభుత్వ డిస్పెన్సరీలకు సైతం నకిలీ మందులు సరఫరా చేసిన ఘటనలు గతంలో వెలుగు చూశాయి. అయితే ఒకటికి రెండుసార్లు క్రాస్ చెక్ చేసుకొని మందులను కొనకపోతే ఉన్న రోగం పోవడమేమో కానీ.. కొత్త రోగాలు వచ్చే ప్రమాదమున్నది. చాలా నకిలీ మందుల్లో అసలు ఔషధమే (యాక్టివ్ ఇంగ్రిడియంట్) ఉండడం లేదు. కేవలం సుద్దపొడి, పిండి కలిపి మందు బిళ్లలుగా తయారు చేస్తున్నారు. దీనివల్ల రోగికి వ్యాధి నయం కాకపోగా సరైన సమయంలో చికిత్స అందక వ్యాధి ముదిరి ప్రాణాపాయ స్థితికి చేరుకునే ప్రమాదముంది. మరికొన్ని నకిలీ మందుల్లో ప్రమాదకరమైన రసాయనాలు వాడుతున్నారు. ఇవి నేరుగా కిడ్నీలు, కాలేయంపై ప్రభావం చూపి పూర్తిగా ఫెయిల్ అయ్యేలా చేస్తున్నాయి. కొన్నేళ్లుగా డీసీఏ అధికారులు వరుసదాడులు చేస్తున్నారు. మెడికల్ దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపడుతున్నారు. 2024-25లో 400కు పైగా దాడులు నిర్వహించి వందకుపైగా క్రిమినల్ కేసులు నమోదుచేశారు. రూ.పదికోట్లకు పైగా నకిలీ, నాణ్యతలేని మందులు సీజ్ చేశారు. 2025-26లోనూ అనేక కేసులు నమోదు చేశారు. అయినా ఇలాంటి ఘటనలు పునరావృతమవుతూనే ఉన్నాయి. అధిక లాభాల కోసం కొన్ని మెడికల్ ఏజెన్సీలు, దుకాణాల వారు ఈ నేరంలో భాగస్వాములవుతున్నారు. బ్రాండెడ్ మందులమీద వచ్చే 20 శాతం మార్జిన్ కంటే నకిలీమందుల మీద వచ్చే 200శాతం లాభం వారిని ఆకర్షిస్తున్నది. ప్రభుత్వాలు దాడులతో సరిపెట్టకుండా కఠిన చట్టాలను చేసి ఈ నకిలీ మందులను నియంత్రించాలి. అంతేకాకుండా ప్రతి మందు స్ట్రిప్ మీద క్యూఆర్ కోడ్ తప్పనిసరి చేసి వినియోగ దారుడు దాన్ని స్కాన్ చేసి అసలు, నకిలీని గుర్తించేలా సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలి. అన్నింటికీ మించి ప్రజల్లో అవగాహన పెరగాలి. బిల్లులు లేని మందులు కొనడం ఆపేయాలి. ●

# కిలో వెండి రూ.7లక్షల మార్క్ దాటేస్తుందా?

జి.సత్యనారాయణరాజు

బంగారం, వెండి అంటే భారతీయులకు ఎప్పుడూ అమితమైన ఇష్టమే. అయితే ప్రస్తుతం పెరుగుతున్న ధరలను చూసి ఇప్పటికే సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.4 లక్షలకు చేరుకుంది. దీంతో వెండి ధర నెక్స్ట్ టార్గెట్ ఏంటన్న చర్చ జరుగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా వెండి ధరలు ఆకాశాన్నంటాయి. శుక్రవారం దేశీయంగా తులం బంగారంపై సుమారు రూ.8,000 వరకు తగ్గగా, కిలో వెండిపై రూ. 15,000 మేర తగ్గుదల కనిపించింది. అయితే ఇది తాత్కాలికమే అంటున్నారు. రోజూ వెండిధరలు భారీగా పెరగడం ఆందోళన కలిగిస్తుంది. 25 ఏళ్ల క్రితం కిలో వెండి ధర రూ.7900 ఉండేది. ఆ తర్వాత వెండి ధర 2010 నాటికి 27,255 రూపాయలకి చేరింది. 2012 నాటికి అకస్మాత్తుగా అది 56వేల 900కి చేరింది. ఆతర్వాత హెచ్చుతగ్గులకు లోనైంది. 2020 నాటికి కిలో వెండి 63వేలు దాటింది. 2023 నాటికి కిలో వెండి 78వేల 600కి చేరుకుంది. రెండేళ్ళకే ఇంచుమించు రెండింతలకు చేరడం విశేషం. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కిలో వెండి 4 లక్షల మార్క్‌కి చేరింది. 2026 జనవరి చివరికి వెండి ధర పటిష్టంగా పెరుగుతూ 4 లక్షల మార్క్‌కి చేరింది.రాజకీయ ఒత్తిడులు, డిమాండ్‌సప్లైలో వ్యత్యాసం, ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం వెండి ధర పెరగడానికి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. గడచిన 28 రోజుల్లో రూ.1,44,000 పెరుగుదలని చూపిస్తుంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో మార్చి ఎక్స్‌పైరీ వెండి ఫ్యూచర్స్ ధర 5.62 శాతం పెరిగి 3,79,300 రూపాయలకి చేరింది. కామెక్స్‌లో వెండి ధర 115.42 డాలర్ల దిశగా పెరిగి, ఇప్పుడు 106.55 డాలర్ల నుంచి 113 డాలర్ల పరిధిలో స్థిరపడుతోంది. కొంత లాభం తీసుకునే అమ్మకాల కారణంగా ఈ పరిధిలో నిలిచింది. పెట్టుబడి మార్గంగా వెండిని మదుపరులు భావించడమే తాజా పరిస్థితికి కారణంగా చెబుతున్నారు. సోలార్, నిజు, ఇవి /డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్ డిమాండ్ చాలా బలంగా ఉంది. దీనితో పాటు భద్రతా పెట్టుబడిగా కూడా వెండి, ద్రవ్యోల్బణం నుంచి రక్షణగా కూడా వెండి ధరకు మద్దతు వస్తోంది. నిపుణుల ప్రకారం, వెండి ధర 118.50-120 డాలర్ల పరిధిని దాటి పోతే, తదుపరి దశలో 125-140+ డాలర్ల దిశగా త్వరగా చేరే అవకాశం ఉంది. పారిశ్రామిక యుగంలో ఇనుము ఎలా కీలకమైనదైతే, టెక్నాలజీ యుగంలో వెండి కూడా అలాగే ఉందని నిపుణులు చెబుతున్నారు.





రూపాయితో డాలర్ మారకంలో ఎలాంటి మార్పు లేకపోతే, ఔన్స్ 200 డాలర్లు అంటే సుమారు రూ. 7,20,000 సమానంగా ఉంటుంది. అంటే ఈ లెక్కన 2026లోనే కిలో వెండి ధర రూ.7లక్షలకు చేరడం గ్యారంటీ అంటున్నారు. రూపాయి బలహీనంగా ఉండటం వల్ల దేశీయ ధరలు అంతర్జాతీయ దశతో పోల్చితే ఎక్కువగా కనిపిస్తాయి. వెండి ఆభరణాల కోసమే కాదు. భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థలో కీలకమైన నిర్మాణ లోహంగా మారిపోతోంది. వెండి పెరుగుదలకు అంతర్జాతీయ ఆర్థిక రాజకీయ పరిణామాలే ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. చైనాతో ఒప్పందం కుదరకపోతే కెనడాపై భారీ సుంకాలు విధిస్తామని, అలాగే దక్షిణ కొరియా ఆటోలు, ఔషధాలు, కలపపై సుంకాలను 25శాతానికి పెంచినట్లు ప్రకటించడం పెట్టుబడిదారులను రిస్క్ ఆస్తుల నుంచి దూరం చేసింది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలపై చేసిన హెచ్చరికలు మార్కెట్లను కలవరపెట్టాయి. పెట్టుబడిదారులు ఆర్థిక ఒత్తిడికి తక్కువగా గురయ్యే ఆస్తుల వైపు మొగ్గు చూపడం సహజం. ఆసియా, యూరప్ మార్కెట్లలో కొత్త పెట్టుబడిదారులు పెద్దఎత్తున బంగారం, వెండిని కొనుగోలు చేస్తున్నారని, ఇది ధరలకు దీర్ఘకాలిక మద్దతుగా మారుతోంది. వాణిజ్య ఉద్రిక్తతలు, వడ్డీ రేట్లపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలు కలిసి వెండిని మరోసారి పెట్టుబడిదారుల ఫోకస్‌లోకి తెచ్చాయి. ఈ ట్రెండ్ కొనసాగితే, రాబోయే రోజుల్లో వెండి ధరలు మరిన్ని కొత్త రికార్డుల వైపు తీసుకు వెళతాయని అంటున్నారు. అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగింది. డాలర్ విలువ పడిపోయింది.దీనికితోడు పారిశ్రామిక అవసరాల కోసం వివిధ సంస్థలు వెండి నిల్వలు పెంచుకునేందుకు ఎగబడడంతో.. బంగారంవెండి ధరలు అమాంతం పెరిగాయి. ఈ ఏడాది బంగారం వెండి ధరల్లో పెరుగుదల కొనసాగుతూనే ఉంటుందని మోర్గాన్ స్టాన్లీ లాంటి నివేదికలు చెబుతున్నాయి.రాబోయే రెండేళ్లలో బంగారం, వెండి ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుకుంటాయని బులియన్ నిపుణులు చెబుతున్నారు. పెట్టుబడులు పెట్టాలనుకునేవారు వెండి, బంగారంపై పెట్టుకుంటే లాభసాటిగా ఉంటుందని చెబుతున్నారు. కాగితపు కరెన్సీపై ఇన్వెస్టర్లకు నమ్మకం తగ్గుతుండటంతో, సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం, వెండి వైపు అందరూ మొగ్గుచూపుతున్నారు. జపనీస్ యెన్ విలువలో ఒడిదుడుకులు, గ్లోబల్ రిస్క్ ఎన్విరాన్‌మెంట్ కూడా వెండి, బంగారానికి రెక్కలు వచ్చేలా చేస్తున్నాయి. 2020 నుంచి ఇప్పటివరకూ కరోనా సంక్షోభం వల్ల ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలం అయ్యాయి. ప్రభుత్వాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. వడ్డీ రేట్లు దాదాపు జీరో అయ్యాయి. ఆ సమయంలో వెండి ధర 11.69 డాలర్ల వరకు పడిపోయింది. కానీ ఇప్పుడు 800 శాతానికి పైగా పెరిగి 102 డాలర్లకు చేరింది. రాబోయే రోజుల్లో బంగారం కంటే వేగంగా పుంజుకుంటుందని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. ●



# బడ్జెట్ వేళ.. కంచిపట్టు చీరె

## తమిళ సంస్కృతిని ప్రతిబింబించిన నిర్మలమ్మ వస్త్రధారణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామ ఆదివారం పార్లమెంట్‌లో బడ్జెట్ సందర్భంగా ఈసారి ఆమె కంచిపట్టు చీర ధరించారు. తమిళనాడుకు చెందిన చేనేత వస్త్ర సంస్కృతికి కంచీపురం సిల్క్ ప్రతిబింబమైన విషయం తెలిసిందే. సంప్రదాయమైన కంచీ పట్టు చీరలో మంత్రి సీతారామన్ బడ్జెట్ ప్రసంగం చేసారు. పర్పుల్ కలర్‌లో ఆ పట్టు చీర ఉన్నది. లైట్ గోల్డెన్ బ్రౌన్ చెక్స్ ఆ చీరపై నేశారు. తమిళంలో ఆ చెక్స్‌ను కట్టం అని పిలుస్తారు. కాఫీ బ్రౌన్ బోర్డర్‌లో ఉన్న ఆ చీరకు త్రెడ్ వర్క్ చేశారు. ఈ నేపథ్యంలో తమిళ వస్త్రధారణలో మంత్రి నిర్మల ఆకర్షణీంగా తయారయ్యారు. 9వ సారి మంత్రి నిర్మల కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. అయితే ప్రతిసారి ఆమె ప్రత్యేక చీరకట్టులో పార్లమెంట్‌కు హాజరయ్యారు. బడ్జెట్ ప్రసంగం వేళ ఆమె వేషధారణ అందర్నీ ఆకట్టుకునేది. అయితే స్థానిక చేనేతను ప్రోత్సహించే రీతిలో అనేక ప్రాంతాలకు చెందిన చీరలను ఆమె పలు సందర్భాల్లో ధరించారు. 2025లో మంత్రి నిర్మలా సీతారామన్ బీహార్‌కు చెందిన మధుబని ఆర్ట్ శారీలో దర్శనం ఇచ్చారు. హ్యాండ్లూమ్ పట్టు చీరకు పేరుగాంచిన మధుబని డిజైన్‌లో ఆమె గత ఏడాది బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బీహారీ జానపదులకు నివాళిగా ఆ చీరను పద్మశ్రీ గ్రహీత దులారీ దేవి ఆ చీరను మంత్రి నిర్మలకు గిఫ్ట్‌గా ఇచ్చారు. కచ్ని లైన్ స్కెచింగ్, భర్ని కలర్ స్టైయిల్స్‌తో ఆ చీరను తయారు చేశారు. 2024లో మంగళగిరి హ్యాండ్లూమ్ చీరలో మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను చదివారు. తెలుపు రంగు చీరకు బ్రైట్ మెజెంటా బోర్డర్ ఉంది. ఫైన్ కాటన్, సింపుల్ జరీ బోర్డర్‌తో ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరికి చెందిన చేనేత కార్మికులు ఆ చీరను రూపొందించారు. ఇక ఏడాది మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలో మంత్రి నిర్మల బెంగాల్‌కు చెందిన తుషార్ పట్టు చీరను కట్టుకున్నారు. స్టోరీటెల్లింగ్ ప్యాటర్న్ ఆ పట్టుచీరలో ప్రత్యేకమైన అంశం. 2023లో టెంపుల్ బోర్డర్ సిల్క్ చీరతో ఆమె పార్లమెంట్‌కు వచ్చారు. ఒడిశాకు చెందిన బొమ్‌కాయి చీరకట్టుతో ఆమె 2022లో బడ్జెట్‌ను చదివారు. ఇక 2021లో తెలంగాణకు చెందిన పోచంపల్లి పట్టుచీరలో మంత్రి నిర్మల బడ్జెట్ ప్రసంగానికి హాజరయ్యారు. 2020లో బ్లూ బోర్డర్ ఉన్న పసుపు రంగు సిల్క్ చీరలో ఆమె బడ్జెట్‌కు వచ్చారు. 2019లో పింక్ కలర్ మంగళగిరి చేనేత చీరను ధరించారు.

# విదేశీ ఆస్తులు వెల్లడించని వారికి మరో అవకాశం!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** విదేశీ ఆస్తులు వెల్లడించని వారికి మరో అవకాశం కల్పించారు. భారత పౌరసత్వం ఉన్న పౌరులు తప్పనిసరిగా విదేశీ ఆస్తులు, ఆదాయాల వివరాలు ఇవ్వాలి. లేదంటే తర్వాత వాటిపై పన్నులతోపాటు భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తారు. తాజా బడ్జెట్ 2026లో ఇలాంటివారికి కాస్త ఊరట కలిగించే నిర్ణయం తీసుకున్నారు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్. విదేశీ ఆస్తులు వెల్లడించని వారిని రెండు కేటగిరీలుగా విభజించారు. మొదటిది కేటగిరి విదేశాల్లో ఒక కోటి వరకు ఆదాయం లేదా ఆస్తి కలిగి, ఆ విషయం వెల్లడించకపోతే ఇకపై సాధారణ పన్ను 30 శాతం చెల్లించాలి. అదనంగా పెనాల్టీ బదులు మరో 30 శాతం పన్ను చెల్లిస్తే చాలు. ఇక కేటగిరి బిలో విదేశాల్లో ఐదు కోట్ల విలువైన ఆస్తులు లేదా ఆదాయం ఉన్నవారిని పరిగణిస్తారు. వీరు ముందుగా ఆస్తి వివరాలు వెల్లడించకుంటే తర్వాత రూ.1 లక్ష చెల్లిస్తే చాలు. ఇదంతా తర్వాత ఆరు నెలల్లోనే చేయాలి. ఎన్‌ఆర్‌ఐకి సంబంధించిన ఆస్తి కొంటుంటే అమ్మే వాళ్లకు టీడీఎస్ కట్ చేసి డబ్బు చెల్లించాలి. ట్యాన్‌తో సంబంధం లేకుండా ప్యాన్ నెంబర్‌తో టీడీఎస్‌ను డిపాజిట్ చేయొచ్చు. బెట్టింగ్, ఇతర ఆన్‌లైన్ గేమ్స్ ద్వారా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నందున గేమింగ్ సంస్థలపై పన్నులు రెట్టింపు చేసింది. సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ)ని పెంచింది. సెక్యూరిటీ గార్డులు, డ్రైవర్లు వంటి మ్యాన్ పవర్ సంస్థలు అందించే సేవలపై పన్ను తగ్గించారు.




# వికసిత భారత్ లక్ష్య సాధన దిశగా..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** ప్రతి కుటుంబం, వర్గం, ప్రాంతం, రంగానికి వన రులు, సౌకర్యాలు, అవకాశాలను అందుబాటులో ఉండేలా చూడటం ద్వారా ప్రతి ఒక్కరూ అర్థవంతమైన తీరులో భాగస్వాములు కావాలన్న 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్'కు లక్ష్యానికి అనుగుణంగా ఉందని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ఆర్థిక మంత్రి ఒక సమగ్రమైన రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ఉత్పాదకత పెంపు, వ్యవస్థాపకత ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం. ఉపాధి అవకాశాలు, శిక్షణ, నాణ్యమైన సహాయక పరికరాల ద్వారా దివ్యాంగులను శక్తిమంతులను చేయటం. మానసిక ఆరోగ్యం, ట్రామా కేర్ పొందేలా బల హీనవర్గాలకు సాధికారత కల్పించడం. అభివృద్ధి, ఉపాధి అవకాశాలను వేగవంతం చేయడానికి పూర్వోదయ రాష్ట్రాలు, ఈశాన్య ప్రాంతంపై దృష్టి సారించడం' అని నిర్మలా సీతారామన్ వివరించారు.

### రైతుల ఆదాయం పెంచటం

రైతుల ఆదాయాన్ని పెంచే విస్తృత లక్ష్యంలో భాగంగా 500 జలాశయాలు, అమృత్ సరోవర్‌ల సమగ్ర అభివృద్ధి, తీర ప్రాంతాలలో మత్స్య రంగ విలువ వ్యవస్థను బలోపేతం చేయడం, చేపల రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో కలిసి అంకురాలు మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తూ మార్కెట్ అనుసంధానాలను కల్పించే నిబంధనలను బడ్జెట్‌లో పొందుపరిచారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కీలకమైన రంగాల్లో పశుసంవర్ధక రంగం ఒకటిగా ఉంటుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లో నాణ్యమైన ఉపాధి అవకాశాలను కల్పించడానికి ప్రభుత్వం ఈ విధానాల ద్వారా పశుసంవర్ధక రంగంలో వ్యవస్థాపకత అభివృద్ధికి మద్దతునిస్తుంది. రుణ ఆధారిత రాయితీ పథకం, పశుసంవర్ధక సంస్థల విస్తరణ, ఆధునికీకరణ. పశుసంపద, డైరీ, పౌల్ట్రీ ఆధారిత సమగ్ర విలువ ఆధారిత అనుసంధాన వ్యవస్థలను సృష్టిని పెంపొందించడం. పశుకాపరుల ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటును ప్రోత్సహించడం.

తీరప్రాంతాల్లో కొబ్బరి, చందనం, కోకో, జీడిపప్పు వంటి అధిక విలువ కలిగిన పంటలకు మద్దతు ఇవ్వడం ద్వారా "ఉన్నత విలువ కలిగిన వ్యవసాయం'8 గురించి కేంద్ర ఆర్థిక మంత్రి ప్రధానంగా దృష్టి సారించారు.'ఈశాన్య రాష్ట్రాల్లో అగర్ చెట్లు.. పర్వత ప్రాంతాల్లో బాదం, వాల్‌నట్స్, పైన్ నట్స్ వంటి డ్రై ఫ్రూట్స్ సాగుకు కూడా మద్దతు లభిస్తుంది' అని అన్నారు.

'ప్రపంచంలోనే కొబ్బరి ఉత్పత్తిలో భారత్ అగ్రస్థానంలో ఉంది. దాదాపు 10 మిలియన్ల రైతులు సహా 30 మిలియన్ల మంది ప్రజలు జీవనోపాధి కోసం కొబ్బరిపై ఆధారపడుతున్నారు. కొబ్బరి ఉత్పత్తిలో పోటీతత్వాన్ని మరింత పెంచడానికి, ప్రధాన కొబ్బరి సాగు రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉత్పాదకత లేని చెట్ల స్థానంలో కొత్త మొక్కల రకాలను నాటడం వంటి వివిధ చర్యల ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచేందుకు నేను ఒక కొబ్బరి అభివృద్ధి పథకాన్ని ప్రతిపాదిస్తున్నాం' అని కేంద్ర ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంలో భాగంగా పచ్చి జీడిపప్పు, కోకో ఉత్పత్తిలో భారత్‌ను స్వయం సమృద్ధిగా మార్చడానికి, ఎగుమతి పోటీ తత్వాన్ని పెంచేందుకు, 2030 నాటికి భారతీయ జీడిపప్పు- కోకోలను అంతర్జాతీయ ప్రీమియం బ్రాండ్‌లుగా మార్చేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని 2026-27 బడ్జెట్ ప్రతిపాదించింది. భారతీయ చందన వ్యవస్థకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు, సాగు పంట అనంతర ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వాలతో భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేయనుంది.

ఎక్కువ దిగుబడినిచ్చే పాత తోటలను పునరుద్ధరించడానికి.. వాల్‌నట్స్, బాదం, పైన్ నట్స్ వంటి వాటిని అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేయడాన్ని విస్తరించేందుకు, యువతను భాగస్వామ్యం చేస్తూ విలువ జోడింపు ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే ప్రత్యేక కార్యక్రమానికి బడ్జెట్ మద్దతునిస్తుంది.

### భారత్ విస్తార్

వ్యవసాయ వనరులను పొందేందుకు వర్చువల్ ఇంటిగ్రేటెడ్ వ్యవస్థ (భారత్ విస్తార్) ప్రారంభించనున్నట్లు ఆర్థికమంత్రి ప్రతి పాదించారు. 'విస్తార్'ను బహుభాషా ఏఐ సాధనంగా రూపొందించనున్నారు. ఇది అగ్రిస్టాక్ పోర్టల్‌లను, వ్యవసాయ పద్ధతులకు సంబంధించిన ఐకార్ ప్యాకేజీని ఏఐ వ్యవస్థలతో అనుసంధానిస్తుంది. ఇది వ్యక్తిగతీకరించిన సలహాల విషయంలో మద్దతునివ్వటం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచుతుంది. దీనితో పాటు రైతులు మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలు కల్పించటంతోపాటు నష్టభయాన్ని ఇది తగ్గిస్తుంది.

> రైతుల ఆదాయం హెచ్చింపు
> దివ్యాంగులు, బలహీన వర్గాలకు అండదండలు
> పూర్వోదయ రాష్ట్రాలు, ఈశాన్య ప్రాంతంపై ప్రత్యేక దృష్టి
> లక్షిత చర్యలను ప్రకటించిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల
> కొబ్బరి ప్రోత్సాహక పథకం, చందనం సాగుకు ప్రోత్సాహం
> జీడిపప్పు, కోకో, అక్రోటు, బాదం, పైన్‌నట్స్ కోసం ప్రత్యేక కార్యక్రమాలు

# మహిళా సంఘాల బలోపేతానికి 'షీమార్ట్'లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 :** మహిళల నేతృత్వంలో రిటైల్ ఔట్‌లెట్‌లను ప్రోత్సహించడానికి బడ్జెట్‌లో చర్యలు చేపట్టినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఆర్థిక మద్దతు కోసం 'షీ మార్ట్'లను బడ్జెట్‌లో ప్రతిపాదించారు. లక్‌పతి దీదీ కార్యక్రమం విజ యం ఆధారంగా సెల్ఫ్ హెల్ప్ ఎంట్రప్రెన్యూర్ (షీ) రిటైల్ ఔట్‌లెట్స్ ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందజేస్తాం. క్రెడిట్ లింక్డ్ జీవనోపాధి నుంచి స్వయం సహాయక సంస్థల యజమానులుగా మహిళలు మారడానికి ఇది సహాయపడుతుందని మంత్రి సీతారామన్ అన్నారు. మహిళా సమాఖ్య లు, కమ్యూనిటీల యాజమాన్యంలో ఏర్పాటు చేసే రిటైల్ అవుట్‌లెట్‌లను స్వయం సహాయక వ్యవస్థీకృత మార్టులు (షీ మార్ట్) అని అంటారు. గ్రామీణ మహిళలు నిర్వహించే వ్యాపార సంస్థలకు




బలమైన మార్కెట్ సృష్టించడం, స్థానిక ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ కల్పించడం దీని లక్ష్యం.

మహిళా స్వయం సహాయక బృందాలను బలోపేతం చేయడం, మహిళా యజమానులు వ్యాపార రంగంలో రాణించడం, మహిళలకు స్థిరమైన ఆదాయ వనరులను సృష్టించడానికి ఈ పథకం దోహదపడుతుంది.

# ఐదు మెడికల్ హబ్‌లు, లక్ష ఎహెచ్‌పిలు

## వైద్య అనుబంధ నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక పథకం

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రూ. 53.50 లక్షల కోట్ల బడ్జెట్‌లో వైద్య, కుటుంబ సంక్షేమ శాఖకు రూ. 1,05,530 కోట్లను కేటా యించారు. దేశాన్ని వైద్య పర్యాటక రంగానికి ప్రపంచ గమ్యస్థానంగా ప్రోత్సహించడానికి దేశవ్యాప్తంగా ఐదు ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేయడంలో రాష్ట్రాలకు మద్దతు ఇస్తామని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. వైద్య అనుబంధ నైపు ణ్యాల అభివృద్ధికి ప్రత్యేక పథకం తీసుకువస్తున్నట్లు తెలిపారు. సుమారు లక్ష ఎహెచ్‌పిల ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.



నాణ్యమైన ఆయుర్వేద ఔషధ ఉత్పత్తుల ఎగుమతులకు ప్రత్యేక పథకం తీసుకువస్తున్నట్లు చెప్పారు. మూడు కొత్త ఆయుర్వేద అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, జామ్‌నగర్‌లో ఆయుర్వేద ఔషధ అభివృద్ధి సంస్థ నెలకొల్పనున్నట్లు పేర్కొన్నారు. సుమారు లక్ష హెల్త్ ప్రొఫెషనల్స్‌ను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆయుర్వేద, యోగా, మానసిక ఆరోగ్య సేవలతోపాటు వైద్య విద్య విస్తరణపై దృష్టి సారించినట్లు చెప్పారు. యోగా, ఆయుర్వేద సేవల కోసం సుమారు 1.5 లక్షల సేవకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. భారత్ సహా విదేశాల్లో యోగా, ఆయుర్వేదానికి పెరుగుతున్న డిమాండ్‌ను ఇది సూచిస్తోందన్నారు. ఆయుష్ పార్మసీలు, డ్రగ్ టెస్టింగ్ ల్యాబోరెటరీలు, ఆయుర్వేద ఉత్పత్తుల ఎగమతులకు కృషి చేస్తామని ప్రతిపాదించారు. కొవిడ్19 తర్వాత ఆయుర్వేదం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందిందని తెలిపారు.

మానసిక ఆరోగ్య మౌలిక సదుపాయాల్లో అంతరాలను పరిష్కరించేందుకు ప్రముఖ మానసిక ఆరోగ్య సంస్థ అయిన ఎన్‌ఐఎం హెచ్‌ఏఎన్‌ఎస్ (నిమ్‌హాన్స్)2.0ని స్థాపించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. ఈ చర్య మానసిక ఆరోగ్య సంరక్షణ, ట్రామా సేవలకు కేంద్రం నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నట్లు చెప్పారు. మానసిక ఆరోగ్యం, ట్రామా కేర్‌కు నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నామని.. ఇప్పటి వరకు ఉత్తర భారతదేశంలో మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం ఎలాంటి జాతీయ సంస్థలు లేవన్నారు. అందువల్ల తాము తాజాగా నిమ్‌హాన్స్-2.0ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఇందుకోసం రాంచీ, తేజ్‌పూర్‌లలో జాతీయ మానసిక ఆరోగ్య సంస్థలను ప్రాంతీయ అత్యున్నత సంస్థలుగా అప్‌గ్రేడ్ చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దేశవ్యాప్తంగా అత్యవసర ట్రామా కేర్ సౌకర్యాలను బలోపేతం చేయడానికి చర్యలను తీసుకుంటున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వైద్య అత్యవసర పరిస్థితులు తరచుగా కుటుంబాలపై, ముఖ్యంగా పేదలపై ఊహించని ఆర్థిక భారాలను మోపుతాయని ఆమె అన్నారు.

ఇందుకోసం అత్యవసర, ట్రామా కేర్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా ఆసుపత్రులలో ఈ సామ ర్థ్యాలను 50 శాతం బలోపేతం చేస్తామని ప్రకటించారు. దేశంలో పశువైద్య వ్యాధి నిర్ధారణ కేంద్రాల ఏర్పాటుకు ప్రోత్సాహం ఇవ్వనున్నట్టు తెలిపారు. పశువైద్య కళాశాలలు, పారా పశువైద్య కళాశా లలు, బ్రీడింగ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రోత్సాహం ఇస్తామని చెప్పారు. పశు వైద్య వ్యాధి నిర్ధారణ కేంద్రాల ఏర్పాటుకు ప్రోత్సాహంతో పాటు ప్రత్యేక రుణాలు, ప్రోత్సాహాలు అందించేలా నూతన విధానం తీసుకువస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతరామన్ స్పష్టం చేశారు.

# ఆరు కీలక రంగాల్లో సంస్కరణలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** ఆర్థిక సుస్థిరత కోసం ఆరు కీలక రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఆదివారం పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆమె ప్రసంగించారు. చాంపియన్ ఎంఎస్‌ఎంఇల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని పేర్కొన్నారు. రూ. 10 వేల కోట్లతో వచ్చే ఐదేళ్లకు బయోఫార్మా శక్తి పథకం తీసుకొస్తున్నామని తెలిపారు. ఫార్మా, విద్య, పరిశోధనకు జాతీయ స్థాయిలో కొత్త విద్యా సంస్థలు ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. దేశీ సెమీ కండక్టరన రంగం వృద్ధి కోసం ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0 తీసుకొస్తున్నామని నిర్మాలా సీతారామన్ తెలిపారు. సెమీ కండక్టర్ మిషన్ 2.0 కోసం రూ. 40 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ఏపి సహా ఐదు రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించ నున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఒడిశా, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ కోసం ప్రత్యేక మైనింగ్ మిషన్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఖనిజ వనరులున్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహం అందించేలా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రపంచ స్థాయి కంటైనర్ ఉత్పత్తి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. హైటెక్ టూల్ రూమ్స్, జౌళిరంగం ఆధునీకరణ, పరిశ్రమలకు విద్యా సంస్థల అనుసంధానం వంటి అంశాలపై దృష్టి సారించినట్లుగా పేర్కొన్నారు.

మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామి నిర్మలాసీతారామన్ తెలిపారు. జౌళి ఉత్పత్తుల అంతర్జాతీయ బ్రాండింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. బయోఫార్మా, సెమీకండక్టర్, ఎంఎస్‌ఎంఇలకు చేయూత అందిస్తామని.. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. దీర్ఘకాలిక భద్రత, నగరాల అభివృద్ధికి ఆర్థిక జోన్లు ఏర్పాటు చేస్తున్నామని, క్రీడా ఉత్పత్తుల కోసం ప్రత్యేక కార్యాచరణ చేస్తామని అన్నారు.మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని నిర్మలా సీతారామన్ తెలిపారు.

# విద్యకు రూ. 1.39 లక్షల కోట్లు

## బడ్జెట్‌లో 2.6 శాతం నిధులు

## ఐదు వర్సిటీ టౌన్‌షిప్‌ల ఏర్పాటు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రూ. 53.50 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ. 1,39,289 కోట్లను కేటాయించింది. ఇది బడ్జెట్‌లో 2.6 శాతం. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో బాలికల వసతి గృహం ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ప్రధాన పారిశ్రామిక లాజిస్టిక్స్ కేంద్రాలకు సమీపంలో 5 యూనివర్సిటీ టౌన్‌షిప్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. టౌన్‌షిప్‌లలో నివాస సౌకర్యాలు, పరిశోధన మౌలిక సదు పాయాలతో పాటు యూనివర్సిటీలు, కాలేజీలు ఉంటాయి. దేశవ్యాప్తంగా 15,000 కంటే ఎక్కువ పాఠశాలల్లో కంటెంట్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడానికి ముంబయిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్‌కు మద్దతు అందిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు.

పశువైద్య కళాశాలలు, ఆసుపత్రులు, డయాగ్నస్టిక్స్ ప్రయోగశాలలకు రుణ సంబంధిత మూలధన సబ్సిడీ మద్దతు పథకాన్ని ప్రకటించారు. గుజరాత్ జామ్‌నగర్‌లోని ఆయుష్ ఫార్మసీలు, ఔషధ పరీక్ష ప్రయోగశాలలు, డబ్ల్యూహెచ్‌వో సంప్రదాయ వైద్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. వెయ్యి కంటే ఎక్కువ గుర్తింపు పొందిన భారతీయ క్లినికల్ ట్రయల్ సైట్‌ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల కోసం



సహాయక పరికరాల ఉత్పత్తిని పెంచడానికి ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు నిధులు కేటాయించనున్నట్లు ప్రతిపాదించారు. విద్య నుంచి ఉపాధి, వ్యవస్థాపకత వరకు అనే స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేయనున్నామని, వికసిత్ భారత్‌కు కీలకమైన సేవా రంగంపై దృష్టి సారించే చర్యలను సిఫార్సు చేయనుందని ఆర్థికమంత్రి తెలిపారు.

కృత్రిమమేధ(ఏఐ)తో పాటు ఆవిర్భవిస్తున్న కొత్త సాంకేతికతలకు మద్దతిచ్చేందుకు నిధులు కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతిపాదిత కమిటీ ఆర్థిక వృద్ధికి కీలకమైన చోదక శక్తిగా సేవల రంగంపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలను సిఫార్సు చేస్తుందని నిర్మల అన్నారు. యువ భారత్ ఆకాంక్షలను నెరవేర్చడానికి స్పష్టమైన మార్గాన్ని అందించడం ఆ చొరవ లక్ష్యమన్నారు.

యువ భారతదేశం ఆకాంక్షలను నెరవేర్చేందుకు చర్యలను అందించడానికి, ఆర్థిక వృద్ధికి కీలకమైన చోదకంగా సేవల రంగంపై దృష్టి సారించే చర్యలను సిఫార్సు చేయడానికి హై పవర్‌తో కూడిన సంస్థల స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ చెప్పారు.

కృత్రిమ మేధస్సుతో సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు. రైతులు, మహిళలు, యువత, దివ్యాంగులతో సహా ప్రజలందరికీ కొత్త అవకాశాలను పొందేందుకు వీలుగా సాంకేతికతను స్వీకరించడం కోసం ఏఐ మిషన్, నేషనల్ క్వాంటం మిషన్, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫండ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఫండ్‌ల ద్వారా కొత్త సాంకేతికతలకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని మంత్రి ప్రకటించారు.

## సంక్షేమం, అభివృద్ధే కేంద్ర బడ్జెట్

### కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆర్థిక క్రమశిక్షణతో దేశాన్ని అద్భుతంగా ముందుకు నడిపించే బడ్జెట్ ఉపాధి అవకాశాలను, మౌలిక వసతులకు పెద్దపీట వేసిన బడ్జెట్ అన్నారు. రక్షణ, రైల్వే, ఫార్మా, అగ్రికల్చర్, మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసి, గ్లోబల్ బయోఫార్మా మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా భారతదేశం ఎదగడంలో హైదరాబాద్ కీలక పాత్ర వికసిత్ భారత్ రూరల్ అజీవికా మిషన్ గ్రామీణ్‌కి నిధుల పెంపు ఉచితం కంటే ఉపాధి అవకాశాలు కల్పించడమే బడ్జెట్ లక్ష్యం అన్నారు. గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే బడ్జెట్‌ను రూపొందించారన్నారు.

## హైదరాబాద్-పుణే, బెంగళూరు-చెన్నై మధ్య

# ఏడు హైస్పీడ్ కారిడార్లు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 1:** హైదరాబాద్ సహా ఏడు నగరాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్లను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 బడ్జెట్ ప్రసంగంలో కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం ముంబాయి-అహ్మదాబాద్ మధ్య హైస్పీడ్ రైలు కారిడార్, అనేక రాష్ట్రాలు, జిల్లాలను కలిపే తూర్పు, పశ్చిమ రవాణా కారిడార్ల పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. మొత్తం 7 నగరాల మధ్య హైస్పీడ్ ట్రైన్ కారిడార్లు ప్రకటించగా.. అందులో మూడు హైదరాబాద్ నుంచే ఉన్నాయి. హైదరాబాద్ -పుణె, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్ -చెన్నై మధ్య హైస్పీడ్ మెట్రో ట్రైన్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. వీటితో పాటు ముంబై-పుణె, చెన్నై-బెంగళూరు, ఢిల్లీ-వారణాశి, వారణాశి -సిలిగుడి మధ్య కూడా హైస్పీడ్ ట్రైన్ కారిడార్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ హైస్పీడ్ ట్రైన్ కారిడార్ల ద్వారా గంటల కొద్దీ సాగే ట్రైన్ ప్రయాణం తగ్గనుంది. హైదరాబాద్ నుంచి ముంబై, చెన్నై, బెంగళూరు వెళ్లే ఐటీ నిపుణులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులకు ఎంతో మేలు చేకూరనుంది. నగరాల మధ్య దూరం తగ్గి, రవాణా అత్యంత వేగంగా మారుతుంది. ఈ ట్రైన్ కారిడార్లు కేవలం రవాణాకే పరిమితం కాకుండా రియల్ ఎస్టేట్, పారిశ్రామిక వృద్ధికి తోడ్పడనున్నాయి. ఈ ప్రాజెక్టులు హైదరాబాద్‌ను ఒక ప్రధాన ఆర్థిక హబ్‌గా మారనున్నాయి. దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు 12.2లక్షల కోట్లు కేటాయించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

గతేడాది 11.2లక్షల కోట్లు కేటాయింపులు చేయగా ఈసారి స్వల్పంగా పెంచారు. హైదరాబాద్‌సహా ఏడు నగరాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి వెల్లడించారు. అంతేకాక పశ్చిమ బెంగాల్‌లోని డాంకునీ, గుజరాత్‌లోని సూరత్ మధ్య కొత్త రవాణా కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పర్యావరణపరంగా సుస్థిర ప్రయాణికుల వ్యవస్థను ప్రోత్సహించేందుకు ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లను

### దేశంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.12.2 లక్షల కోట్లు

### వచ్చే ఐదేళ్లలో 20 కొత్త జాతీయ జల మార్గాలు

అభివృద్ధి చేయబోతున్నాం. అవి నగరాల మధ్య గ్రోత్ కనెక్టర్లుగా పనిచేస్తాయి. ముంబయి-పుణె, పుణె -హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్ -చెన్నై, చెన్నై-బెంగళూరు, ఢిల్లీ-వారణాసి, వారణాసి-సిలిగురి అని వివరించారు. నగరాలు దేశానికి వృద్ధి చోదకాలు, ఆవిష్కరణలు, అవకాశాలకు కేంద్రాలు. ఇప్పుడు టైర్2, టైర్3 నగరాలపై దృష్టి సారించాం అని పేర్కొన్నారు. టెంపుల్ టౌన్లపై కూడా. వాటికి ఆధునిక మౌలిక సదుపాయాలు, కనీస సదుపాయాల కల్పన, వాటి సామర్థ్యాన్ని పెంపునకు వచ్చే ఐదేళ్లలో రూ.5వేల కోట్లు వ్యయం చేసేందుకు ప్రతిపాదిస్తున్నాం. ఛాలెంజింగ్ పద్ధతిలో ఆ ప్రణాళికల అమలు కోసం సంస్కరణ, ఫలితాల ప్రాతిపదికన ఆర్థిక మెకనిజం ఏర్పాటు చేస్తున్నాం అని నిర్మలా సీతారామన్ చెప్పారు. వచ్చే ఐదేళ్లలో 20 కొత్త జాతీయ జల మార్గాలువచ్చే ఐదేళ్లలో 20 కొత్త జాతీయ జలమార్గాలను అందుబాటులోకి తేనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఒడిశాలో ఖనిజ సంపద కలిగిన తాల్చేర్, అంగుల్ ప్రాంతాలను, కళింగనగర్ పారిశ్రామిక కేంద్రాలను, పారాదీప్, ధమ్రా ఓడరేవులతో అనుసంధానించనున్నట్లు తెలిపారు. అందుకోసం అవసరమైన మానవ వనరుల అభివృద్ధి కోసం రీజినల్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ పేరుతో శిక్షణా సంస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ జలమార్గాల పరిధిలోని యువతకు శిక్షణ, నైపుణ్యాలను పొందేందుకు అవి ఎంతగానో ఉపయోగపడుతాయని ఆర్థికమంత్రి తెలిపారు.

జలమార్గాల అవసరాల కోసం వారణాసి, పట్నాలో నౌకల మరమ్మతు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రైలు, రోడ్డు మార్గాల నుంచి జలమార్గాలకు మారటాన్ని ప్రోత్సహించేందుకు కోస్టల్ కార్గో ప్రమోషన్ స్కీమ్‌ను ప్రారంభించనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. 2047 నాటికి దేశీయ జలమార్గాలు, తీర ప్రాంత షిప్పింగ్ వాటాను 6శాతం నుంచి 12శాతానికి పెంచటమే లక్ష్యమన్నారు




## క్లౌడ్ సేవలు, డేటా సెంటర్లకు

### 20 యేళ్లు పన్నుల ఊరట

### కేన్సర్ చికిత్స పరికరాలపై సుంకాల తగ్గింపు

### తగ్గనున్న 17 రకాల ఔషధాల ధరలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 :** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌లో బడ్జెట్ 2026 ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈసారి బడ్జెట్‌లో ఈసారి టాక్స్ పేయర్లకు పెద్దగా ఊరట లభించలేదు. ఏప్రిల్ 1 నుంచి అమలు కానున్న కొత్త పన్నుల్లో ఏవైనా పన్ను మినహాయింపులు, కోతలు ఉండొచ్చని భావించినా బడ్జెట్‌లో అలాంటివేమీ ప్రకటించలేదు. దేశంలో పెట్టుబడులు పెట్టి, క్లౌడ్ సర్వీసెస్ అందించే డాటా సెంటర్లకు మాత్రం సరళమైన పన్నులు విధించారు. ఈ ప్రకారం 2047 వరకు టాక్స్ హాలిడే ఉంటుంది. కేన్సర్ పేషెంట్లకు ఊరట కలిగించేలా కీలక నిర్ణయం తీసుకున్నారు సీతారామన్. కేన్సర్ చికిత్స కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే అత్యావశ్యక ఔషధాలపై దిగుమతి సుంకాన్ని మినహాయిస్తారు. దీనిలో భాగంగా 17 రకాల ఔషధాలు ధరలు తగ్గుతాయి. అరుదైన వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మరో 7 కీలక ఔషధాలపై కూడా దిగుమతి సుంకాలు తగ్గుతాయి. కేన్సర్ చికిత్సలో వాడే మందులు, ఇతర ఔషధాలు, ఆహార పదార్థాలు, పరికరాలపై కూడా సుంకాలు తగ్గుతాయి. కొత్తగా వచ్చే టెక్నాలజీలపై సమీక్ష జరిపేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తారు. సెమీ కండక్టర్ల తయారీ సహా, ఇతర సేవారంగాలకు ప్రోత్సాహకంగా ఐదేళ్లలో రూ.40,000 కోట్లు కేటాయిస్తారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికిగాను సైన్యానికి రూ.2.19 లక్షల కోట్లు కేటాయిస్తారు. ఇది గత ఏడాదికంటే 21.84 శాతం అదనం. మొత్తం రక్షణ రంగానికి రూ.7.85 లక్షల కోట్లు కేటాయించారు. ఇది మన జీడీపీలో 11 శాతం. వేగంగా, స్థిరమైన అభివృద్ధి సాధించేందుకు తయారీ రంగం, ఇతర చిన్న పరిశ్రమలు వంటి ఆరు కీలక రంగాకు ప్రోత్సాహం అందిస్తారు. ఇండియాను బయో గ్లోబల్ ఫార్మా హబ్‌గా మార్చేందుకు బయో ఫార్మ శక్తి మిషన్ పేరుతో ఐదేళ్లలో రూ.10,000 కోట్లు కేటాయిస్తారు. మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేసి వస్త్ర తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తారు. ఖాదీ, చేతి కళా ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించేందుకు మహాత్మా గాంధీ గ్రామ సమాజ్ పథకాన్ని అమలు చేస్తారు. బ్యాంకింగ్ రంగాన్ని సమీక్షించేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తారు. అలాగే విదేశీ మారక వ్యవస్థను ప్రోత్సహించేందుకు, భారతీయ ఈక్విటీలలో విదేశీయులు పెట్టుబడులు పెట్టేందుకు కూడా కమిటీలను ఏర్పాటు చేస్తారు. దేశవ్యాప్తంగా పలు ప్రధాన నగరాలకు ఏడు హై స్పీడ్ రైల్ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తారు. ఇందులో హైదరాబాద్‌కు సంబంధించి రెండు రైళ్లు నడుస్తాయి. ఒకటి చెన్నై, రెండోది పుణే. రేర్ ఎర్త్ మినరల్స్ (అరుదైన ఖనిజాలు) కోసం చైనా వంటి దేశాలపై ఆధారపడకుండా నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కారిడార్లు ఏర్పాటు చేస్తారు. తమిళనాడు, ఏపీ, కేరళ, ఒడిశాలో ఈ కారిడార్లు ఏర్పాటవుతాయి. మెడికల్ టూరిజంను ప్రోత్సహించేందుకు ప్రత్యేక హబ్స్ ఏర్పాటు చేస్తారు. దీనిలో భాగంగా ఆయుష్ కేంద్రాల పేరుతో ఐదు మెడికల్ హబ్స్ ఏర్పాటు చేస్తారు.

## మూడు ప్రధాన కర్తవ్యాలతో

## తొలి కర్తవ్యభవన్ కొత్త బడ్జెట్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** దేశ ఆర్థికవృద్ధి స్థిరంగా కొనసాగుతోందని, యుశక్తి కేంద్రంగా కొత్తబడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట ప్రసంగంలో తెలిపారు. ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తెస్తున్నామని, రైతులు, దళిత ఆదివాసీ సమూహాలకు అభివృద్ధి ఫలాలు చేరాలన్నారు. మూడు కర్తవ్యాలను స్ఫూర్తిగా తీసుకుని కర్తవ్యభవన్‌లో తొలిసారిగా రూపొందించిన కేంద్ర బడ్జెట్‌ను కొత్త పార్లమెంటు హాలు కర్తవ్యభవన్‌లో ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. ఉత్పాదకత పోటీ తత్వాన్ని పెంచి సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించడం, మొదటి కర్తవ్యంలోభాగంగా ఆరు రంగాల్లో సుస్థిర అభివృద్ధి కీలకమ న్నారు. ఏడు వ్యూహాత్మకరంగాల్లో ఉత్పాదకత వేగవంతం, పారిశ్రామికరంగం పునరుజ్జీవం, ఎంఎస్‌ఎంఇల కోసం కొత్త కార్యాచరణ, మౌలికసదుపాయాల కల్పనకు బలమైన ఊదం, దీర్ఘకాలిక ఇంధన భద్రత, స్థిరత్వం, నగర ప్రాంత ఆర్థిక కార్యకలాపాల అభివృద్ధి వంటివి ఉన్నాయన్నారు. రెండో కర్తవ్యంగా ప్రైవేటురంగ భాగస్వామ్యంతో టూరిజం సర్వీసులు, ఐదు రీజినల్‌మెడికల్ హబ్‌లు, ఆయుష్‌కేంద్రాల అప్‌గ్రేడేషన్, జామ్‌నగర్‌లో ప్రత్యేక పరిశోధన కేంద్రం, ప్రైవేటురంగంలో పశువైద్య, డయాగ్నస్టిక్స్ ఏర్పాటు వంటివి ఉన్నాయని తెలిపారు. ఇక మూడో కర్తవ్యంగా సబ్‌కాసాత్ సబ్‌కా వికాస్ లక్ష్యంతో దేశంలోని ప్రతి కుటుంబం, వర్గం మతం రంగానికి వనరులు, సదుపాయాలు అవకాశాలు కల్పిస్తూ అభివృద్ధిలో భాగస్వాములను చేయడమే లక్ష్యమని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

# రక్షణకు భారీ కేటాయింపు

### గత బడ్జెట్ కంటే పెరిగిన 8 శాతం

### రూ. 6.81 లక్షల కోట్ల నుంచి రూ.7.85 లక్షల కోట్లకు పెంపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 :** దేశ రక్షణ కోసం కేంద్ర బడ్జెట్‌లో అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్, ఉగ్రవాద బెదిరింపులు, రక్షణ వ్యయంలో పెరుగుదల నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ భారీ నిధులు కేటాయించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికిగాను రక్షణ మంత్రిత్వ శాఖకు రూ. 7.85 లక్షల కోట్ల బడ్జెట్ మంజూరు చేశారు. ఈ పెరిగిన మొత్తం జీడీపీలో 11 శాతానికి సమానం. గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూ. 6.81 లక్షల కోట్ల కంటే ఇది ఎనిమిది శాతం ఎక్కువ. రఫేల్ యుద్ధ విమానాలు, జలాంతర్గాములు, మానవరహిత వైమానిక వాహనాల కాంట్రాక్టుల వంటి అనేక ప్రధాన ప్రాజెక్టులు రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్నాయి. రక్షణ దళాల ఆధునీకరణ కోసం రూ. 2.19 లక్షల కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ కంటే ఇది 21.84 శాతం అధికం. గత ఏడాదిలో రక్షణ మంత్రిత్వ శాఖ మూలధన వ్యయం కోసం రూ.1.8 లక్షల కోట్లు. వ్యయంచేసింది. ఈ కోటాలో విమానాలు, ఏరో ఇంజిన్‌ల కోసం రూ. 63,733 కోట్లు కేటాయించారు. రక్షణ సేవల (రెవెన్యూ) కోసం బడ్జెట్ కేటాయింపును అదనంగా 17.24 శాతం పెంచారు. నిర్వహణ, మందుగుండు సామగ్రి, ఇంధనం, మరమ్మతులు మొదలైన ఖర్చులు, సహాయక సిబ్బంది జీతాలతో సహా రోజువారీ కార్యకలాపాల కోసం ఈ నిధులు వినియోగిస్తారు. పెన్షన్ల కేటాయింపును 6.53 శాతం పెంచి రూ. 1.71 లక్షల కోట్లకు చేర్చారు. రక్షణ రంగంలోని యూనిట్ల ద్వారా నిర్వహణ, మరమ్మత్తు లేదా సమగ్ర పునరుద్ధరణ అవసరాల కోసం ఉపయోగించే విమానాల భాగాల తయారీకి దిగుమతి చేసుకునే ముడి పదార్థాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మాఫీ చేస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రస్తావించారు. ఏరో ఇంజన్ల కోసం రూ. 63,733 కోట్లను కేటాయించారు. రక్షణ సేవల రెవెన్యూ ఖర్చులు అంటే రోజూవారీ నిర్వహణ, ఇంధనం, మందుగుండు సామాగ్రి, మరమ్మతులు, సహాయక సిబ్బంది జీతాలు మొదలైన వాటికి 17.24 శాతం నిధుల్ని పెంచారు. పెన్షన్ల కోసం గతేడాదితో నిధులతో పోలిస్తే 6.53 శాతం పెంచి, రూ. 1.71 లక్షల కోట్లు కేటా యించారు. బడ్జెట్‌కు ముందు రక్షణ మంత్రిత్వ శాఖ తమ నిధులను కనీసం 20 శాతం పెంపును కోరినట్లు సమాచారం. నివేదికల ప్రకారం, గత 26 ఏళ్లలో భారత రక్షణ వ్యయం ఏకంగా 40 శాతం కన్నా ఎక్కువ పెరిగింది. ఇందులో రక్షణ మూలధన వ్యయం ఎక్కువగా ఉంది.



## తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం

### ఎంపి మల్లు రవి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి1:** కేంద్ర బడ్జెట్ నిరాశజనక బడ్జెట్ అని కాంగ్రెస్ ఎంపి మల్లు రవి అభివర్ణించారు. దేశ ప్రజలతో పాటు తెలంగాణ ప్రజలను పూర్తి నిరాశకు గురి చేసిందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు చేసిన విజ్ఞప్తులను పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీ, జాతీయ ప్రాజెక్టులు, హైదరాబాద్ మౌలిక వసతులకు నిధులు ఇవ్వాలని కోరినా అవి ఏవీ ఇవ్వకపోగా, హైదరాబాద్ మెట్రో గురించి ప్రస్తావన లేనే లేదన్నారు. రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై బడ్జెట్‌లో మాట్లాడతారని, ప్రస్తుత భారతను గాలికి వదిలేసి 2047 ఫోకస్ చేస్తూ.. ఇప్పుడున్న సమస్యలను పక్కన పెట్టారని ఎద్దేవా చేశారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెద్ద ఎత్తున ఉందని, నిరుద్యోగ సమస్యను గుర్తించకపోవ డం అన్యాయం కాక మరేమిటి? అని ప్రశ్నించారు. 11 ఏళ్లుగా 22 కోట్ల మందికి ఉద్యోగాలు ఇవ్వాలి, 2014 నుంచి కార్పొరేట్ సంస్థలకు అనుకూల బడ్జెట్ ఇస్తున్నారని తెలిపారు. వృద్ధి రేటుకు అర్థం ఉండదని, సామాన్య ప్రజలకు ఉపయోగం లేకుండా ఉండే వృద్ధి రేటు ఉందని.. ఉన్నవారు లేని వారికి మధ్య అంతరం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సమానత్వాన్ని బిజెపి మర్చిపోయిందని విమర్శించారు.

# తయారీ రంగానికి మద్దతుగా పన్నుల సరళీకరణ

### ఇంధన మార్పు, భద్రతను ప్రోత్సహించేందుకు చర్యలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ 2026-27ను ప్రవేశపెడుతూ.. కస్టమ్స్, కేంద్ర ఎక్సైజ్ ప్రతిపాదనల ప్రధాన ఉద్దేశాలను కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వివరించారు. సుంకాల నిర్మాణాన్ని మరింత సరళీకృతం చేయడానికి, దేశీయ తయారీ రంగానికి మద్దతు ఇవ్వడానికి, ఎగుమతుల పోటీతత్వాన్ని పెంపొందించడానికి, పన్నుల నిర్మాణంలో ఉన్న లోపాలను సరిదిద్దడానికి ఈ ప్రతిపాదనలు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

చాలా కాలంగా కొనసాగుతున్న కస్టమ్స్ సుంకం మినహాయింపులను తొలగించే ప్రక్రియను ముందుకు తీసుకెళ్తూ.. దేశంలో తయారవుతున్న వస్తువులు లేదా దిగుమతులు చాలా స్వల్పంగా ఉన్న వస్తువులపై ఇస్తున్న కొన్ని మినహాయింపులను తొలగించాలని బడ్జెట్ ప్రతిపాదించింది. అదేవిధంగా ఏదైనా ఒక నిర్దిష్ట వస్తువుపై వర్తించే సుంకం రేటును తెలుసుకునే ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు వివిధ కస్టమ్స్ నోటిఫికేషన్లలో ఉన్న ప్రభావవంతమైన రేట్లను నేరుగా టారిఫ్ షెడ్యూల్‌లోనే చేర్చాలని బడ్జెట్ ప్రతిపాదించింది. ఎగుమతులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఎగుమతి చేసే సముద్ర ఆహార ఉత్పత్తుల తయారీలో ఉపయోగించే నిర్దిష్ట ముడి సరుకులపై సుంకం లేని దిగుమతుల పరిమితిని పెంచాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. గత ఏడాది ఎగుమతి టర్నోవర్ ఎఫ్‌ఓబి విలువలో ప్రస్తుతం ఉన్న 1 నుంచి 3 శాతానికి ఈ పరిమితిని పెంచాలని సిఫార్సు చేశారు. ప్రస్తుతం తోలు లేదా సింథటిక్ పాదరక్షల ఎగుమతులకు అందుబాటులో ఉన్న నిర్దిష్ట ముడి సరుకులపై సుంకం లేని దిగుమతులను ఇకపై షూ అప్పర్స్(షూ పైన ఉండే భాగం) ఎగుమతులకు కూడా వర్తింపజేయాలని బడ్జెట్ ప్రతిపాదించింది. తోలు లేదా వస్త్ర దుస్తులు, తోలు లేదా సింథటిక్ పాదరక్షలు, ఇతర తోలు ఉత్పత్తుల ఎగుమతిదారుల కోసం తుది ఉత్పత్తిని ఎగుమతి చేయడానికి ఇచ్చే కాలవ్యవధి పరిమితిని ప్రస్తుతమున్న 6 నెలల నుంచి 1 సంవత్సరానికి పెంచాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు.


శక్తి మార్పు, ఇంధన భద్రతను పటిష్టం చేసే లక్ష్యంతో బడ్జెట్‌లో పలు కీలక ప్రతిపాదనలు చేశారు. 'లిథియం-అయాన్ బ్యాటరీల తయారీకి ఉపయోగించే ముడి సరుకులకు ఉన్న ప్రాథమిక కస్టమ్స్ సుంకం మినహాయింపును.. ఇకపై బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల కోసం వాడే లిథియం- అయాన్ బ్యాటరీల తయారీకి కూడా విస్తరించాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. సౌరశక్తి రంగానికి సంబంధించి సోలార్ గ్లాసు తయారీలో ఉపయోగించే సోడియం యాంటిమోనేట్ దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని మినహాయించాలని కేంద్రమంత్రి ప్రతిపాదించారు.

అణుశక్తి రంగాన్ని మరింత ప్రోత్సాహిస్తూ.. అణు విద్యుత్ ప్రాజెక్టులకు అవసరమైన వస్తువుల దిగుమతిపై ప్రస్తుతం ఉన్న ప్రాథమిక కస్టమ్స్ సుంకం మినహాయింపును 2035 సంవత్సరం వరకు పొడిగించాలని శ్రీమతి నిర్మలా సీతారామన్ సిఫార్సు చేశారు. అంతేకాకుండా ఈ మినహాయింపును వాటి ఉత్పత్తి సామర్థ్యంతో సంబంధం లేకుండా అన్ని అణు ప్లాంట్లకు వర్తింపజేయాలని ఆమె ప్రతిపాదించారు. దేశంలో కీలక ఖనిజాల శుద్ధికి అవసరమైన ముడి వస్తువుల దిగుమతికి కూడా ప్రాథమిక కస్టమ్స్ సుంకం నుంచి మినహాయింపు ఇవ్వాలని బడ్జెట్ ప్రతిపాదించింది. సిఎన్ జీలో బయోగ్యాస్ మిశ్రమాన్ని ప్రోత్సహించేందుకు బయోగ్యాస్ మిశ్రమ సిఎన్ జీపై పై చెల్లించాల్సిన కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని లెక్కించేటప్పుడు అందులోని బయోగ్యాస్ విలువను పూర్తిగా మినహాయించాలని బడ్జెట్ ప్రతిపాదించింది.

విమానయాన రంగానికి సంబంధించి.. పౌర, శిక్షణ, ఇతర విమానాల తయారీకి అవసరమైన విడిభాగాలు, పరికరాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మినహాయించాలని ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. రక్షణ రంగంలోని యూనిట్లు నిర్వహించే నిర్వహణ, మరమ్మత్తు, సమగ్ర పునరుద్ధరణ అవసరాల కోసం వాడే విమాన విడిభాగాల తయారీకి దిగుమతి చేసుకునే ముడి సరుకులపై కూడా ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మినహాయించాలని బడ్జెట్ ప్రతిపాదించింది.

వినియోగదారు ఎలక్ట్రానిక్స్ రంగంలో విలువను మరింత పెంచే లక్ష్యంతో.. మైక్రోవేవ్ ఓవెన్ల తయారీలో ఉపయోగించే కొన్ని నిర్దిష్ట విడిభాగాలపై ప్రాథమిక కస్టమ్స్ సంకాన్ని మినహాయించాలని బడ్జెట్ ప్రతిపాదించింది.

ప్రపంచ వాణిజ్య అంతరాయాల కారణంగా ప్రత్యేక ఆర్థిక మండళ్లలోని (సెజ్) తయారీ యూనిట్లు తమ పూర్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని వినియోగించుకోవడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను బడ్జెట్ పరిగణనలోకి తీసుకుంది. దీని పరిష్కారం కోసం సెజ్‌లలో అర్హత పొందిన తయారీ యూనిట్లు ఒకేసారి వర్తించే వెసులుబాటుతో తమ ఉత్పత్తులను దేశీయ మార్కెట్లకు రాయితీ పన్ను రేట్లపై విక్రయించేలా ఆర్థిక మంత్రి ఒక ప్రత్యేక ప్రతిపాదన చేశారు. ఇలా దేశీయ మార్కెట్లో నిర్వహించే విక్రయాల పరిమాణం, ఆయా యూనిట్లు చేసే ఎగుమతులు ఒక నిర్ణీత శాతానికి మాత్రమే పరిమితం అవుతాయి. స్థానిక మార్కెట్లోని ఇతర యూనిట్లకు సమానమైన పోటీ వాతావరణాన్ని కల్పిస్తూనే ఈ చర్యలను అమలులోకి తీసుకురావడానికి అవసరమైన నియంత్రణ మార్పులు చేపట్టను న్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు.



# 'ఆరెంజ్ ఎకానమీ'కి ప్రాధాన్యం

## దేశవ్యాప్తంగా కంటెంట్ క్రియేషన్ ల్యాబ్‌లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** దేశంలో యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగం అభివృద్ధిచెందుతున్న తరుణంలో మీడియా, వినోదం, మేథోసంపత్తి వంటిక్రియేటింగ్ రంగాలను మరింతగా వృద్ధిలోనికి తీసుకువస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌పేర్కొన్నారు. ఈ మూడు రంగాలనే 'ఆరెంజ్' ఎకానమిగా వర్ణిస్తారు. వీఎఫ్ఎక్స్, గేమింగ్; కామిక్స్, డిజైన్, టూరిజం వినోదం వంటివి అన్నింటినీ ఆరెంజ్ ఎకానమీగా పరిగణిస్తారు. 2030 నాటికి 20 లక్షలమంది నిపుణులు అవసరమని కేంద్రం అంచనావేసింది. ఈ డిమాండ్‌కు అనుగుణంగానే ముంబయిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌క్రియేటివ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో దేశంలో మొత్తం 15 వేల పాఠశాలలు, 500 కళాశాలల్లో ఎవిజిసి కంటెంట్‌క్రియేటర్ ల్యాబ్‌లు ఏర్పాటుచేయాలని బడ్జెట్‌లోప్రతిపాదించారు. స్టార్టప్‌లను ప్రోత్సహించి డిజిటల్, సృజనాత్మకరంగాల్లో ఉపాధి అవకాశాలు విస్తరించడం, కొత్తతరం సృష్టికర్తలను పెంపొందించేలక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యాచరణను రపారంభించింది. తూర్పు భారతావనిలోనేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ ఏర్పాటుచేస్తామన్నారు. శిక్షణపొందిన డిజైనర్లకొరత ఎక్కువ ఉందని, అందుకే ఈ సంస్థను ఏర్పాటుచేస్తామని మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. దీర్ఘకాలికసుస్థిర ఆర్థికవృద్ధికి సృజనాత్మక ఆధారిత రంగాలే చోదకశక్తులని ఆర్థికసర్వేలో ఇప్పటికే పొందుపరిచారు. ఉపాధికల్పన, పట్టణసేవలు పర్యాటక రంగాలకు ఈ క్రియేటివిటీ అత్యవసరమని ఆమె అన్నారు. అయితే కొన్ని చట్టపరమైన అడ్డంకులు ఉన్నట్లు గుర్తించడంతోకేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లోనే తాజా ప్రతిపాదనలుచేసింది.




# విద్యుత్‌కు రూ.1,09,029 కోట్లు

### పునరుత్పాదక ఇంధనానికి పెద్దపీట

### రూ.32,917.70 కోట్లు కేటాయింపు

### సూర్యఘర్‌కు రూ.22 వేల కోట్లు

### బడ్జెట్‌లో ఇంధన పరివర్తనకు ప్రాధాన్యత



**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** కేంద్రం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక అంచనా బడ్జెట్‌లో విద్యుత్‌కు ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన రంగానికి పెద్దపీట వేసింది. మొత్తంగా విద్యుత్ రంగానికి ఈ బడ్జెట్‌లో రూ.1.09.029 కోట్లు కేటాయింపులు చేసింది. ఇటీవల కాలంలో దేశంలోని సౌర విద్యుత్ రంగం వేగవంతమైన వృద్ధిని సాధించింది. ఇది స్థిరమైన అభివృద్ధి, ఇంధన భద్రత కోసం కేంద్ర ప్రభుత్వ ఎజెండాకు అనుగుణంగా ఉంది. ఇంధన పరివర్తనలో భాగంగా సౌర శక్తి మరియు ఇతర పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు నిధులు పెంచింది. దీనికి సంబంధించిన నిధులను రూ.32,914.7 కోట్లకు పెంచింది. ఈ కేటాయింపులు వికసిత్ భారత్ (డెవలప్డ్ ఇండియా) లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన ఇంధన భద్రత మరియు స్థిరమైన అభివృద్ధికి దోహదపడతాయి. ముఖ్యంగా రూఫ్‌టాప్ సోలార్ కోసం ప్రధానమంత్రి సూర్య ఘర్ (పిఎంఎస్‌జి) పథకానికి రూ.22 వేల కోట్లు కేటాయింపులు చేసింది. ఇది గృహాలకు విద్యుత్ సదుపాయాన్ని మెరుగుపరుస్తుంది. అలాగే సౌర విద్యుత్ గ్రిడ్‌ల ఆధునికీకరణకు రూ.1,775 కోట్లు కేటాయించడం ద్వారా ఇంధన పరివర్తనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. ప్రస్తుత 2025-26 వార్షిక అంచనా బడ్జెట్‌లో ఈ విభాగానికి రూ.1,500 కోట్లు కేటాయించగా, ఈ కొత్త బడ్జెట్‌లో మరో రూ.225 కోట్లు అదనంగా కేటాయింపులు పెంచింది. పునరుత్పాదక సామర్థ్యం వేగంగా పెరుగుతున్న కొద్దీ, అధికవోల్టేజ్ నెట్‌వర్క్‌లను బలోపేతం చేయడం మరియు నిల్వ నేతృత్వంలోని గ్రిడ్ వశ్యత వ్యవస్థ విశ్వసనీయత మరియు సామర్థ్యాన్ని పెంచనున్నాయి. గ్రామీణ ఇంధన పరివర్తనలో భాగంగా పిఎం కుసుమ్ వంటి పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో సౌరశక్తి వినియోగాన్ని పెంపొందించడం లక్ష్యంగా చర్యలు చేపట్టనుంది. అలాగే ప్రధానంగా రైతులకు నాణ్యమైన విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు, వారికి అదనపు ఆదాయం వచ్చేలా వ్యవసాయ పంపుసెట్లను సౌరశక్తితో అనుసంధానించడంపై పూర్తి స్థాయిలో కేంద్రీకృతం కానుంది. అలాగే సౌర పార్కులు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన నిధుల సమకూర్పుపై ఈ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. 2030 నాటికి భారతదేశం 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన లక్ష్యాన్ని సాధించే దిశగా పయనిస్తున్నందున, మౌలిక సదుపాయాల సంసిద్ధత, గ్రిడ్ స్థిరత్వం మరియు నైపుణ్యం కలిగిన మానవశక్తి లభ్యతతో సహా ప్రధాన పెట్టుబడి నిబద్ధతల నుండి క్షేత్రస్థాయిలో అమలు వైపు దృష్టి క్రమంగా మారుతోంది. ఈ కేంద్ర బడ్జెట్ భారతదేశం యొక్క స్వచ్ఛమైన ఇంధన ఆశయాలు కాగితపు ప్రణాళికలకు మించి నమ్మకమైన, స్కేలబుల్ విద్యుత్ ఉత్పత్తిగా అనువదించబడిందని నిర్ధారించుకోవడానికి కీలకమైన క్షణంగా పరిగణించబడుతోంది. గ్రీన్ ఎనర్జీ కారిడార్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు ప్రోత్సాహకాలు, గ్రిడ్ స్థిరత్వాన్ని నిర్ధారించడానికి ఎఫ్‌డిఆర్ఇ, హైబ్రిడ్ ప్రాజెక్టులకు మద్దతుతో సహా ప్రసార మౌలిక సదుపాయాలకు నిరంతర విధాన మద్దతు అవసరాన్ని హైలైట్ చేస్తుంది. క్రమబద్ధీకరించబడిన ఆమోదాలు మరియు వేగవంతమైన అమలు సమయ పాలనలతో పాటు దీర్ఘకాలిక నిల్వ మార్కెట్ విధానాలపై ఎక్కువ స్పష్టత ప్రాజెక్ట్ బ్యాంకింగ్ మరియు డెలివరీ ఖచ్చితత్వాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుందని కేంద్రం పేర్కొంది.

# సాగు, అనుబంధ రంగాలకు రూ. 1,62,671 కోట్లు

### ఎఐ టూల్‌తో అగ్రిస్టాక్ పోర్టల్ ఏర్పాటు

### భారత్ విస్తార్ పేరిట సాంకేతికతకు ప్రాధాన్యత

### కిసాన్ క్రెడిట్‌కార్డు రూ. 5 లక్షలకు పెంపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** రైతులకు అధిక ఆదాయాలు, యువత సాధికారత, సమగ్ర మత్స్యకార అభివృద్ధికి ప్రాధాన్యతా లక్ష్యంగా చేసుకుని కేంద్ర 2026-27 బడ్జెట్‌లో వ్యవసాయ కార్యక్రమాలను ప్రకటించింది. ఈ బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు మొత్తంగా రూ.1,62,671 కోట్ల మేర కేటాయింపులు జరిపింది. ముఖ్యంగా సాంకేతికతతో నడిచే వ్యవసాయానికి పెద్ద ప్రోత్సాహకంగా 2026-27 కేంద్ర బడ్జెట్‌లో భారత్ విస్తార్‌ను ప్రారంభించనుంది. దేశంలో వ్యవసాయంపై ఆధారపడిన 46.1 శాతం మంది రైతులు, శ్రామిక శక్తిని లక్ష్యంగా చేసుకుని చిన్న విస్తీర్ణం కలిగిన వారికి మద్దతు ఇవ్వడానిక, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఖచ్చితమైన వ్యవసాయంలో ముందడుగు వేసేందుకు దోహదపడుతుందని వెల్లడించింది. అగ్రిస్టాక్ పోర్టల్‌లు, భారత వ్యవసాయ పరిశోధన మండలి యొక్క వ్యవసాయ పద్ధతులను అధునాతన ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వ్యవస్థలతో అగ్రిస్టాక్ పోర్టల్ ఏర్పాటు చేయడం ద్వారా రైతులు వనరులను ఎలా యాక్సెస్ చేయాలో మరియు నిర్ణయాలు తీసుకునే విధానాన్ని మార్చడానికి ఒక బహుళ సాధనంగా బడ్జెట్‌లో పేర్కొంది.

తద్వారా రైతులకు విత్తనాల నుండి మార్కెట్ ధరల వరకూ అన్ని వివరాలు డిజిటల్‌గా అందుబాటులోకి వస్తాయి. భారత్ విస్తార్ టూల్‌తో కేంద్ర ప్రభుత్వ అగ్రి స్టాక్ వెబ్‌సైట్లను, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) వ్యవసాయ మార్గదర్శకాలను, అధునాతన ఏఐ సిస్టమ్‌లను అనుసంధానిస్తారు. దేశ రైతుల వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి ఖిభారత్ విస్తార్‌లోని ఏఐ సమాచారం దోహదపడుతుల్పు. పంటసాగు చేపట్టే క్రమంలో ముప్పును తగ్గించే విలువైన సలహాలను అందించడం ద్వారా దేశంలోని కోట్లాది మంది రైతులను ఏఐతో ఏకీకృతం చేయాలనే భారత సర్కారు విజన్ కూడా సాకారం అవుతుందని వెల్లడించింది. రైతులు తమతమ ప్రాంతీయ భాషల్లోనే ఈ టూల్ ద్వారా వ్యవసాయ సూచనలను పొందే వీలుంటుంది. ఈ వేదిక ప్రధానంగా వ్యవసాయ ఉత్పాతదకతను పెంచడం, నష్టాలను తగ్గించేందుకు అవసరమైన మద్దతును అందిస్తుంది. ఇక గ్రామీణ ఉద్యోగాలను ప్రోత్సహించేందుకు పశు పోషణకు బలమైన మద్దతును బడ్జెట్‌లో కల్పించింది. క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ కార్యక్రమం, పశు సంస్థల విస్తరణ, ఆధునీకరణ, పాడి, పశువులు, కోళ్ల కేంద్రీకృత ఇంటిగ్రేటెడ్ సృష్టితో పాటు, పశువుల రైతు ఉత్పత్తి సంస్థలకు ప్రోత్సాహం కల్పించనుంది. కొబ్బరి, జీడిపప్పు, గంధం, కోకో, అగర్ చెట్లు, బాదం, వాల్‌నట్లు, పైన్ గింజలు వంటి తీరప్రాంత, అనుకూలమైన ప్రదేశాల్లో ప్రోత్సహించనుంది. ప్రపంచంలోనే అతి పెద్ద కొబ్బరి ఉత్పత్తిదారు అయిన భారత్ 10 మిలియన్ల మంది రైతులతో సహా 30 మిలియన్ల మందికి జీవనోపాధిని కొనసాగిస్తోంది. కీలక రాష్ట్రాల్లో ఉత్పాదకత లేని చెట్ల స్థానంలో అధిక దిగుబడి ఇచ్చే మొక్కలతో భర్తీ చేయడం వంటి వాటి ద్వారా ఉత్పత్తిని పెంచడానికి ప్రోత్సాహక పథకం అమలు చేయనుంది. మత్స్య రంగంలో 500 జలాశయాలు, ఇతర నీటి వనరుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను ప్రారంభించనుంది.

తీర ప్రాంతాలలో మత్స్య సంపద గొలుసును బలోపేతం చేయడం, స్టార్టప్‌లు, మహిళా నేతృత్వంలోని సమూహాలు, చేపల రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా మార్కెట్ సంబంధాలను పెంపొందిస్తుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించే లక్ష్యంతో పశుసంవర్ధకానికి, సీతారామన్ క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ కార్యక్రమం, పశువుల పాడి మౌలిక సదుపాయలను మెరుగుదల ద్వారా వివరణాత్మక మద్దతును అందించనుంది. పశువైద్య నిపుణుల లభ్యతను పెంచడానికి, ప్రైవేట్ రంగంలో పశువైద్య మరియు పారా వెట్ కళాశాలలు, పశువైద్య ఆసుపత్రులు, రోగనిర్ధారణ ప్రయోగశాలలు మరియు సంతానోత్పత్తి సౌకర్యాల స్థాపనకు మద్దతు ఇచ్చే పథకానికి మద్దతుగా రుణలింక్డ్ మూలధన సబ్సిడీని ప్రతిపాదించింది. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధిని, వ్యవసాయ ఉత్పాతదకతను పెంచడానికి, వ్యవసాయ గృహాల కొనుగోలు శక్తిని బలోపేతం చేసేందుకు, వ్యవసాయ వర్గాలకు సార్వత్రిక సేవలను అందించేందుకు సంస్కరణలను అమలు చేయడం, ప్రతీ వ్యవసాయ కార్యక్రమాల నుండి రైతులు, గ్రామీణ ప్రజలు నేరుగా ప్రయోజనం పొందేలా చర్యలు చేపట్టనుంది.

రాబోయే రెండేళ్లలో కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా ప్రోత్సాహకాలను అమలు చేయనుంది. పప్పుధానాలు, నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయనుంది. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా తీసుకునే రుణాల పరిమితి 3 నుండి రూ.5 లక్షలకు పెంచింది. కూరగాలు, పండ్లు, చిరుధాన్యాల ఉత్పత్తి, ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించేందుకు సమగ్ర కార్యక్రమం చేపట్టనుంది. తదుపరి 6 ఏళ్ల పాటు మిషన్ ఫర్ ఆత్మనిర్భరత ఇన్ పల్సెస్ ప్రారంభించి ముఖ్యంగా కందులు, మినుములు, మసూర్ పప్పులపై దృష్టిసారించనుంది.



## ఖేలో ఇండియాకు ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ఢిల్లీలో ప్రవేశ పెట్టిన 2026-27 బడ్జెట్‌లో క్రీడారంగానికి పెద్దపీట వేశారు. క్రీడా బడ్జెట్ కేటాయింపులను పెంచడం, దేశీయంగా క్రీడా పరికరాల తయారీని ప్రోత్సహించడం, ఖేలో ఇండియా మిషన్‌ను మరో పదేళ్లపాటు పొడిగించడం వంటి కీలక నిర్ణయాలు ప్రకటించారు. క్రీడా రంగానికి 4480 కోట్ల రూపాయలు కేటాయించడం గమనార్హం. 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ నిర్వహణకు భారత్ బిడ్ దాఖలు చేసిన క్రమంలో ఈ నిర్ణయాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, 'నాణ్యమైన, తక్కువ ధరకే క్రీడా పరికరాలను అందించే గ్లోబల్ హబ్‌గా ఎదిగే సత్తా భారత్‌కు ఉంది'అని అన్నారు.

# ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం

### ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుస్థిర ప్రగతి

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే విధంగా, దేశంలో మౌలికవసతులకు పెద్దపీట వేస్తూ రక్షణ రంగాన్ని మరింత శక్తివంతం చేసుకుంటూ, రైల్వే, ఫార్మా, అగ్రికల్చర్, మహిళా సంక్షేమం వంటి అనే అంశాలకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రతి వారం జరిగే కేబినెట్ సమావేశాల్లో ఏదైనా ఒక సంస్కరణ తీసుకొస్తుందని, బడ్జెట్‌లోనూ, విదేశీ పెట్టుబడులు, ఐటి, క్రిటికల్ మినరల్ సెక్టార్‌లో, టాక్స్ విషయంలోనూ చాలా సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. 2, 3 లక్షలనున్న వ్యక్తిగత ఆదాయపు పన్ను మినహాయింపును రూ.12.50 లక్షలకు పెంచారని, సామాన్యులు వాడే వస్తువులపై టాక్స్ తగ్గించారన్నారు.

ఇది రిఫామ్స్ ఎక్స్ ప్రెస్ బడ్జెట్ అని, తాత్కాలికంగా లబ్ధి చేకూర్చడం కంటే దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన బడ్జెట్ ఇది అన్నారు. అనేక రాష్ట్రాలు, ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయని, దేశం అన్ని రాష్ట్రాలను కలుపుకుంటూ వికసిత భారతనిర్మాణం దిశగా దూసుకెళ్తుందని, ఈ బడ్జెట్ దేశాభివృద్ధికి బాటలు వేసే బడ్జెట్, సుస్థిరమైన ఆర్థిక ప్రగతి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భవిష్యత్తు తరాల్లో నమ్మకాన్ని కలిగించే బడ్జెట్ అన్నారు. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన దేశంగా వేస్తున్న తొలి అడుగు ఈ బడ్జెట్. తెలంగాణ రాష్ట్రానికి ఈ బడ్జెట్ అనేక రకాలుగా మేలుచేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ పన్నుల వాటాగా, గతేడాదితో పోలిస్తే 13.5శాతం వృద్ధిరేటుతో పన్నుల వాటా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి 2025-26 ఆర్థిక సంవత్సరంలో, పన్నుల వాటాగా రూ.29,280 కోట్లు రాగా, అది 2026-27 సంవత్సరానికి 13.5శాతం పెరుగుదలతో రూ.33,180 కోట్లు కేటాయించారని అన్నారు. దేశంలో 7 హైస్పీడ్ రైల్ కారిడార్స్ ప్రకటిస్తే.. అందులో మూడు (హైదరాబాద్-పూణే, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై) హైదరాబాద్ నగరం నుంచే ప్రారంభం అవుతున్నాయని, ఇది మనమంతా గర్వించాల్సిన విషయం అన్నారు. రింగ్ రోడ్డు, ఐటి, బయోఫార్మా, రియల్ ఎస్టేట్ రంగాల అభివృద్ధిలో దూసుకుపోతున్న హైదరాబాద్ నగరానికి మూడు హై స్పీడ్లు రావడం మరింత లాభం చేయనుందని, ఈ బడ్జెట్‌లో ప్రకటించిన బయోఫార్మా శక్తి (స్ట్రాటజీ ఫర్ హెల్త్ కేర్ అడ్వాన్స్‌మెంట్ త్రూ నాలెడ్జ్, టెక్నాలజీ అండ్ ఇన్నొవేషన్) కార్యక్రమం ద్వారా ఫార్మా కేపిటల్‌గా, వ్యాక్సిన్ క్యాపిటల్‌గా ఉన్న మన హైదరాబాద్ నగరానికి చాలా మేలు జరగనుందన్నారు. గ్లోబల్ బయోఫార్మా మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా భారతదేశం ఎదగడంలో హైదరాబాద్ కీలకపాత్ర పోషించేందుకు వీలుకలుగుతుందన్నారు. ఎరువుల సబ్సిడీకి నిధులు గతంతో పోలిస్తే సుమారు రూ.7 వేల కోట్లు అదనంగా కేటాయించిందన్నారు. మొత్తం రూ.1.26 వేల కోట్లు ఎరువుల సబ్సిడీ కోసం కేటాయించిందని,. ఇందులో సింహ భాగం తెలంగాణకే కేటాయించినట్లు తెలిపారు. యువతులకు.. ల్యాబ్, క్లాసెస్ కారణంగా.. ఇళ్లకు దూరంగా ఉండి చదివే వారికి ఇబ్బంది అవుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి జిల్లాకు ఒక గర్ల్స్ హాస్టల్ నిర్మించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులు ఖర్చు పెట్టుకునే నిధులపైన పన్నును 5 లక్షల నుంచి 2లక్షలకు తగ్గించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉపాధి కల్పనను ప్రోత్సహించే బడ్జెట్. వ్యవసాయంతో కమర్షియల్ క్రాప్స్‌ను ప్రోత్సహించడం, మహిళలను ప్రోత్సహించడం ఇవన్నీ ఉపాధి అవకాశాలను పెంచడమే అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు అవినీతికి కొమ్ముకాస్తున్నాయి. రెండు పార్టీలపై ప్రజల్లో విశ్వాసం పోయింది. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీలకు బుద్ధి చెబుతారని, కెసిఆర్ కుటుంబం డబ్బుల వాటాకోసం కొట్టుకుంటుంటే రేవంత్ సర్కారులో మంత్రులు డబ్బుల వాటాకోసం కొట్లాడుకుంటున్నారని అన్నారు. క్రిటికల్ మినరల్స్ విషయంలోనూ.. ఎనర్జీ, మినరల్ సెక్యూరిటీ కోసం చాలా నిర్ణయాలు తీసుకున్నారు... ఒడిశా, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుకుంటూ.. రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్ ఏర్పాటుచేస్తున్నామని,. రేర్ ఎర్త్, క్రిటికల్ మినరల్స్ ఎక్స్ ప్లొరేషన్, ప్రాసెసింగ్ కోసం ఈ కారిడార్ ఎంతో ఉపయుక్తం కానుందని, క్రిటికల్ మినరల్స్‌పై మనం 98శాతం దిగుమతులపై ఆధారపడుతున్నాం. దీన్ని తగ్గించుకుని ఆత్మనిర్భరత సాధించేందుకు ఈ నిర్ణయం ఎంతో ఉపయుక్తం కానుందని కేంద్రమంత్రి వెల్లడించారు.

# వికసిత భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన సందర్భంగా, భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్క్రీన్‌లలో బడ్జెట్ ప్రత్యక్ష ప్రసారాన్ని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ వికసిత్ భారత్ నిర్మాణ సంకల్పం ఇక ఆశయంగా మాత్రమే కాకుండా, వాస్తవంగా మారే దిశగా దేశాన్ని దృఢంగా ముందుకు నడిపిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఈ బడ్జెట్ గర్వకారణమని తెలిపారు. హైదరాబాద్‌కు హైస్పీడ్ రైల్ కారిడార్ల ప్రకటనతో రాష్ట్రం జాతీయ వృద్ధి యంత్రంగా మరింత బలపడనుందని అన్నారు. ఇది మార్పును తీసుకొచ్చే బడ్జెట్ అని పేర్కొంటూ, ఆర్థిక బలమునుంచి జాతీయ సామర్థ్యానికి, అంత్యోదయం నుంచి అభ్యుదయానికి దేశాన్ని నడిపించే స్వర్ణయాత్రకు ఈ బడ్జెట్ పునాది వేస్తుందన్నారు. పచ్చని పొలాలు, బలమైన ధాన్యాగారాలు, ప్రతి కుటుంబంలో చిరునవ్వులు ఇవన్నీ ఈ బడ్జెట్ లక్ష్యాలని వివరించారు.



ఆత్మనిర్భర్ భారత్ దృష్టితో రూపొందిన ఈ బడ్జెట్ దేశీయ తయారీ రంగానికి ఊతమివ్వడంతో పాటు, ఇంధన భద్రతను బలోపేతం చేస్తోందని, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించే దిశగా కీలక సంస్కరణలను తీసుకొస్తుందని అన్నారు. ఉపాధి సృష్టి, వ్యవసాయ ఉత్పాదకత పెంపు, కొనుగోలు శక్తి వృద్ధి, నాణ్యమైన విద్యా-వైద్య సేవల విస్తరణకు ఈ బడ్జెట్ బలమైన పునాదిని వేస్తోందన్నారు. ఈ నిరంతర విధానాల ఫలితంగా భారతదేశం సుమారు 7 శాతం వృద్ధి రేటుతో ముందుకు సాగుతోందని, పేదరికం తగ్గింపులో చారిత్రాత్మక పురోగతి సాధించిందని తెలిపారు.

# పర్యాటకానికి మెరుగులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** పర్యాటకరంగం అభివృద్ధికోసం కేంద్ర బడ్జెట్‌లో ఈసారి నిధులు కేటాయింపులు పెంచారు. ఆతిథ్యరంగంపై మరింతగా అవగాహన పెంచేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ సంస్థను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్‌కేటరింగ్ టెక్నాలజీ జాతీయ మండలిని మరింతగా అప్‌గ్రేడ్‌చేస్తామని ప్రకటించారు. బోధన, పరిశ్రమరంగం, ప్రభుత్వానికిమధ్య ఈ సంస్థలు వారధిగా నిలుస్తాయని కేంద్ర మంత్రి సీతారామన్ అన్నారు. పర్యాటకరంగం వృద్ధికోసం బడ్జెట్‌లో 2480 కోట్ల రూపాయలు కేటాయించారు. ప్రత్యేకించి ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి 6832 కోట్లు కేటాయించడం సింహభాగం పర్యాటకానికి కేటాయింపులు జరపడం కీలకంగా మారింది. పర్యాటక రాష్ట్రాలుగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ము కాశ్మీర్‌లతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని అరుకలోయ, తూర్పు ఘాట్లు, పశ్చిమ ప్రాంత ఘాట్‌లు పోథిగై మలై వంటి వాటిని మరింతగా వృద్ధిచేయాలని నిర్ణయించారు. ఒడిశా, కర్ణాటక, కేరళల్లో తాబేళ్ల పెంపం సైట్లను కూడా తీర్చిదిద్దేందుకు నిర్ణయించారు. 15 పురావస్తు కేంద్రాలను మరింతగా అభివృద్ధిచేస్తామని ప్రకటించారు. గుహలు, సొరంగాలను ప్రత్యేక వాక్‌వేలసాయంతో మరింతగా వినియోగంలోకి తెస్తామన్నారు. అంతర్జాతీయ ప్రయాణాలను మరింతగా అందుబాటులోకి తెస్తున్నట్లు నిర్మలా సీతారామన్ చెప్పారు. అంతర్జాతీయ టూర్‌ప్రోగ్రామ్‌లలో టిసిఎస్‌నుప్రస్తుతం ఐదుశాతం, 20శాతం రేట్లను ఒకే శ్లాబ్‌గా రెండుశాతానికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. పూర్వోదయ రాష్ట్రాలయిన బీహార్; జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లలో పర్యాటకరంగం అభివృద్ధికోసం నాలుగువేల ఈబస్‌లను కూడా కేటాయస్తామని తెలిపారు. అలాగే వైద్యటూరిజం అభివృద్ధికోసం ఐదు ప్రాంతీయ మెడకిల్ హబ్‌లను ఏర్పాటుచేస్తోంది. ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యంలో ఇవి ఏర్పాటవుతాయి. సమీకృత ఆరోగ్య కాంప్లెక్స్‌లను ఏర్పాటుచేసి సేవలందిస్తాయి. సమిష్టిగా వైద్యసేవలు, విద్యాబోధన, రీసెర్చి వనరులు కూడా ఈ కేంద్రాల్లో ఉంటాయి. ఈసారి ఈశాన్యరాష్ట్రాలను కూడా పర్యాటక రంగం అభివృద్ధికి కీలకం చేసింది. ఏడు ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలను వృద్ధిలోనికి తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి తన బడ్జెట్‌ప్రసంగంలో ప్రస్తావించారు.

**15 పురావస్తు కేంద్రాల అభివృద్ధికి చర్యలు**



### మహిళల ఛాంపియన్‌షిప్‌లో

# భారత్ విజయం



**న్యూఢిల్లీ:** ఆతిథ్య నేపాల్‌పై 1-0 తేడాతో విజయంతో భారత్ తమ శాఫ్ అండర్ 19 మహిళల ఛాంపియన్‌షిప్ 2026 ప్రచారాన్ని ప్రారంభించింది. రెండవ అర్ధభాగంలో ఆట పునఃప్రారంభమైన వెంటనే పెర్ల్ ఫెర్నాండెజ్ (49వ నిముషం) ఆటలో ఏకైక గోల్ చేసింది. భారత్ ప్రారంభంలోనే ఆధిక్యాన్ని పొందాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించినా బంతిని తన నియంత్రణలోకి తీసుకురావడంలో విఫలమైంది. 10వ నిమిషంలో నేపాల్‌కు సొంతంగా ఒక అవకాశం లభించినా భారత గోల్ కీపర్ మున్నీ అడ్డుకుంది. మొదటి అర్ధభాగంలో ఎక్కువ భాగం రెండు జట్లు మిడ్‌ఫీల్డ్ లో పోరాటం చేసినా గోల్ చేసే అవకాశం లభించలేదు. రెండవ అర్ధభాగం ఇరు జట్లు హోరాహోరీగా పోరాడినా, భారత్ దాడిలో ముందుకు దూసుకెళ్లి కేవలం నాలుగు నిమిషాల్లోనే ఆధిక్యాన్ని సంపాదించింది. సబ్‌స్టిట్యూట్ ప్రీతికా నేపాల్‌కు చెందిన మాయా మాస్కేను దాటేసి, బాక్స్‌లోకి దూసుకెళ్లి, కట్‌బ్యాక్ ఇచ్చింది. నేపాల్ గోల్ కీపర్ భారత బ్యాక్‌లైన్‌ను దాటడానికి చేసిన ప్రయత్నాలను యంగ్ టైగ్రెస్‌లు పదే పదే అడ్డుకుంది. ఆతిథ్య జట్టుకు గోల్డెన్ ఛాన్స్ వచ్చినా కెప్టెన్ సుశీల కెసి భారత పెనాల్టీ ప్రాంతంలోకి రాకుండా అడ్డుకుంది. చివరి దశలో భారత్ తిరిగి వేగం పుంజుకుంది, నేపాల్ సమం చేయడానికి అవకాశాలను సృష్టించకుండా నిరోధించింది. 89వ నిమిషంలో ఎలిజబెద్ చేసిన సుదీర్ఘ క్లియరెన్స్ తర్వాత ప్రీతికా ఛేజ్ చేసి విజయం వైపు దూసుకెళ్లింది.

### థాయిలాండ్ మాస్టర్స్‌లో

# ఛాంపియన్‌గా దేవిక



**న్యూఢిల్లీ:** థాయిలాండ్ మాస్టర్స్ 2026, మహిళల సింగిల్స్‌లో దేవిక సిహాగ్ ఛాంపియన్‌గా నిలిచింది. ఆదివారం బ్యాంకాక్‌లోని నిమిబుటర్ స్టేడియంలో జరిగిన 2026 థాయిలాండ్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నమెంట్‌లో దేవిక సిహాగ్ తన జోరును కొనసాగించింది, మహిళల టైటిల్‌ను కైవసం చేసుకునే వరకు తీసుకెళ్లింది. మలేషియాకు చెందిన గో జిన్ వీ 8-21, 3-6 స్కోరు చేసిన తదుపరి గాయం కారణంగా రెండవ గేమ్‌కు దూరం కావడంతో ఫైనల్‌లో చాలా సులభమైన విజయాన్ని సాధించింది. ఇది దేవికకు తొలి వరల్డ్ టూర్ టైటిల్ మరియు 2024లో సింధు సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ టైటిల్ తర్వాత మహిళల సింగిల్స్ విభాగంలో భారత్‌కు తొలి సూపర్ 300+ టైటిల్‌గా నిలిచింది. సైనా నెహ్వాల్, పివి సింధు తర్వాత బిడబ్ల్యూఎఫ్ సూపర్ 300+ ఈవెంట్లలో మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకున్న మూడవ భారతీయురాలు కూడా దేవిక చరిత్ర సృష్టించింది. ఈ టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్‌లో మాజీ టాప్10 క్రీడాకారిణి, హోమ్ ఫేవరెట్ సుపానిడా కటేథాంగ్‌పై భారీ విజయం సాధించిన తర్వాత భారత్ యువ క్రీడాకారిణి దేవిక టోర్నమెంట్ అంతటా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది, వరుస ఐదు మ్యాచ్‌ల్లో గెలిచింది. వాటిలో మూడు సీడెడ్ ఆటగాళ్లపై విజయాలు ఉన్నాయి. ఫైనల్లో ఆమె దూకుడుగా ఆడటం ద్వారా తన ప్రత్యర్థిని మొదటి, రెండో గేమ్‌లో రెండంకెలకు కూడా చేరుకోనివ్వకుండా 21-8 తేడాతో గెలిచింది.

## ప్రో రెజ్లింగ్ లీగ్‌లో.. ఫైనల్‌కు ఢిల్లీ వారియర్స్



**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్ 2026లో ఉత్కంఠభరితమైన సెమీ ఫైనల్ 2లో మహారాష్ట్ర కేసరిని ఓడించి ఢిల్లీ దంగల్ వారియర్స్ ఫైనల్‌కు చేరుకుంది. ఒక బౌట్ నుండి మరొక బౌట్ కు నాటకీయంగా మారిన ఈ పోటీలో ఢిల్లీ జట్టు 5-4 తేడాతో విజయం సాధించింది. 62 కిలోల మహిళల పోటీలో ఢిల్లీ అంజ్లి ద్వారా మొదటి స్థానంలో నిలిచింది. ఆమె దుడోవా బిల్యానా జివ్కోవాపై అద్భుతమైన ప్రదర్శన చేసింది. పవర్ మినిట్‌లో టేక్‌డౌన్‌లు, పుష్‌అవుట్‌లు మరియు నిర్ణయాత్మక నాలుగు పాయింట్ల మూవ్‌ను మిళితం చేసి, అంజ్లీ 12-4 తేడాతో ఢిల్లీకి తొలి ఆధిక్యాన్ని అందించింది. మహిళల టైలో (57 కిలోలు) మనీషా భన్వాలా కార్లా గొడినెజ్‌పై ఆధిపత్యం చెలాయించడంతో మహారాష్ట్ర 15-0 టెక్నికల్ సుపీరియారిటీ విజయాన్ని సాధించి టైను సమం చేసింది. హెవీవెయిట్ పోరులో కెప్టెన్ రాబర్ట్ బరాన్ రెండవ పీరియడ్‌లో ప్రత్యర్థిపై పూర్తి నియంత్రణ సాధించింది రోనక్‌ను 11-1తో ఓడించి మహారాష్ట్రను ఆధిక్యంలో ఉంచాడు. మహిళల పోటీలో (53) నిషు భన్వాలా సారికపై ఆధిక్యం పెంచింది. రెండవ పీరియడ్‌లో మహారాష్ట్ర 7-6 తేడాతో విజయం సాధించి 3-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఓటమి ఒత్తిడిని ఎదుర్కొంటూ, పురుషుల విభాగంలో (57) శుభం కౌశిక్ పవర్ మినిట్‌లో ఢిల్లీకి అద్భుతమైన నాలుగు పాయింట్లతో లోటును తగ్గించాడు. ఆ తర్వాత నాలుగు పాయింట్ల టేక్‌డౌన్‌తో 11-10 విజయాన్ని సాధించి ఢిల్లీని పోటీలో నిలిపాడు. యూరోపియన్ ఛాంపియన్ అనస్తాసియా అల్పీవా హర్షిత మోర్‌తో తన అనుభవాన్ని ప్రదర్శించడంతో (76) మహిళల 7-5 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌ను తీసుకువచ్చింది. ప్రారంభ పోటీ తర్వాత ఢిల్లీ తొలిసారిగా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

## ఆస్ట్రేలియా ఓపెన్ ఛాంపియన్‌గా అల్కరాజ్



**న్యూఢిల్లీ:** టెన్నిస్ యువ సంచలనం కర్లోస్ అల్కరాజ్ చరిత్ర సృష్టించాడు. హోరాహోరీగా సాగిన ఈ టోర్నమెంట్‌లో ఆస్ట్రేలియా ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో సెర్బియా దిగ్గజం నొవాక్ జకోవిచ్‌ను ఓడించి మరో గ్రాండ్ స్లామ్ టైటిల్ సాధించి ఛాంపియన్‌గా నిలిచాడు. మెల్‌బోర్న్ పార్క్‌లో ఆదివారం దాదాపు మూడు గంటలపాటు సాగిన ఈ ఫైనల్‌లో మ్యాచ్‌లో జకోవిచ్ పై అల్కరాజ్ 2-6, 6-2, 6-3, 7-5 తేడాతో నెగ్గాడు. మెల్‌బోర్న్ పార్క్‌లో 11వ టైటిల్‌ను గెలుచుకోవాలనే లక్ష ్యంతో జోకోవిచ్ ఈ ఫైనల్‌ను ఘనంగానే ప్రారంభించాడు. మొదట్లో జకోవిచ్ ప్రత్యర్థి అల్కరాస్‌పై పైచేయి సాధించాడు. తొలి సెట్‌ను 6-2తో గెలుచుకున్నాడు. కానీ రెండో నుంచి సీన్ రివర్స్ అయ్యింది. అల్కరాజ్ ఊహించని రీతిలో కమ్‌బ్యాక్ ఇచ్చాడు. దీంతో 6-2తో ఈ సెట్‌ను దక్కించుకున్నాడు. ఆ తర్వాత మూడో సెట్ ప్రారంభానికి ముందు జకోవిచ్ మెడికల్ బ్రేక్ తీసుకున్నాడు. బ్రేక్ తర్వాత కూడా సెర్బియన్ స్టార్ ఫిట్‌నెస్ లోపం స్పష్టంగా కనిపించింది. కోర్టులో చురుగ్గా కదులుతూ అల్కరాజ్ ఆధిపత్యం ప్రదర్శిస్తుండగా, కమ్‌బ్యాక్ ఇచ్చేందుకు జకోవిచ్ తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది. అయినప్పటికీ మూడో (6-3) సెట్‌నూ అల్కరాజ్ నెగ్గాడు. ఇక నాలుగో సెట్ లో ఒక దశలో 5-5తో ఉత్కంఠ నెలకొన్నా చివరికి అల్కరాజ్ 7-5తో నెగ్గాడు.

# వరల్డ్ కప్‌కు కౌంట్‌డౌన్

### ఐదు రోజుల్లో టి20 ప్రారంభం.. 15న భారత్, పాక్ మధ్య హైవోల్టేజ్ మ్యాచ్

**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్ 2026 కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. మరో ఏడు రోజుల్లో భారత్, శ్రీలంకలలో ఈ క్రికెట్ పండుగ మొదలుకానుంది. ఈ మెగా టోర్నీలో మొత్తం 20 జట్లు తలపడుతున్నాయి. ఈ జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. యుఎస్ఏ నమీబియా, నెదర్లాండ్స్ మరియు పాకిస్తాన్‌లతో కూడిన గ్రూప్ ఎ లో భారత్ ఉంది. ఇక ప్రస్తుత ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న టీమ్ ఇండియా మళ్లీ టైటిల్ గెలవాలని పట్టుదలతో ఉంది. ఈ నెల 7వ తేదీన అమెరికాతో జరిగే మ్యాచ్‌తో భారత్ తన ప్రపంచకప్ ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. అనంతరం 12న ఢిల్లీలో నమీబియాతో తలపడుతుంది. ఇక క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూసే భారత్-పాకిస్థాన్ హైవోల్టేజ్ పోరు 15న కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరగనుంది. గ్రూప్ దశలో చివరి మ్యాచ్‌ను 18న అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌తో భారత్ ఆడుతుంది. ఇక భారత జట్టులో అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ వంటి విధ్వంసకర బ్యాటర్లు ఉన్నారు. బౌలింగ్‌లో బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ భరోసా ఇస్తున్నారు. కానీ, ఒక స్టార్ ఆటగాడికి మాత్రం టీ20 వరల్డ్ కప్ ఆడే అదృష్టం ఇంకా కలగలేదు. అతనే స్టార్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్. టీ20 క్రికెట్‌లో భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ చాహల్ కావడం విశేషం. చాహల్ ఇప్పటివరకు 329 టీ20 మ్యాచ్‌లు ఆడి 23.60 సగటుతో ఏకంగా 384 వికెట్లు పడగొట్టాడు. అంతర్జాతీయ టీ20ల్లోనూ 80 మ్యాచ్‌ల్లో 96 వికెట్లు తీశాడు. ఇంతటి అద్భుత రికార్డు



ఉన్నా, 35 ఏళ్ల చాహల్‌కు ఇప్పటివరకు ఒక్క వరల్డ్ కప్ మ్యాచ్ ఆడే అవకాశం రాకపోవడం గమనార్హం. చాహల్ మాత్రమేకాదు, టీమ్‌ఇండియా స్టార్‌బ్యాటర్ శుభ్‌మన్ గిల్ కూడా ఈ విషయంలో దురదృష్టవం తుడిగా నిలిచాడు. రెండు ఫార్మాట్లలో భారత్‌కు కెప్టెన్‌గా ఉన్నగిల్, ఇప్పటివరకు ఒక్క టీ20 ప్రపంచకప్ కూడా ఆడలేదు. ఈసారి కూడా సెలక్టర్లు గిల్ కంటే సంజూ శాంసన్‌కే మొగ్గుచూపారు. ఇక చాహల్ విషయానికి వస్తే, అతను 2023 ఆగస్టులో వెస్టిండీస్‌తో తన చివరి అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత జట్టులో చోటు కోల్పోయిన అతను, ప్రస్తుతం భారత్‌న్యూజిలాండ్ సిరీస్‌లో హిందీ కామెంటేటర్‌గా కొత్త అవతారంలో కనిపిస్తున్నాడు. మైదానంలో ఉండాల్సిన ఆటగాడు మైక్ పట్టుకుని విశ్లేషణలు ఇస్తున్నాడు. సూర్యకుమార్ యాదవ్ లేదా అభిషేక్ శర్మ వంటి బ్యాటర్లను కాదని, బౌలర్‌ను ఎంచుకోవడం చర్చనీయాంశమైంది.




## న్యూ మెక్సికో ఓపెన్‌లో కృష్ణకు షాట్‌పుట్ టైటిల్

**న్యూఢిల్లీ:** న్యూ మెక్సికో ఓపెన్-2026లో షాట్‌పుట్‌లో భారత్ షట్లర్ కృష్ణ జయశంకర్ ఇండోర్ మహిళల షాట్ పుట్ జాతీయ రికార్డును తిరిగి రాసింది. ఆమె 16.63 మీటర్ల కొత్త వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శనతో మహిళల షాట్‌పుట్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. న్యూ మెక్సికోలోని అల్బుకెర్కీలో ఆదివారం జరిగిన ఇండోర్ మహిళల షాట్‌పుట్ ఈవెంట్‌లో కృష్ణ తన జాతీయ రికార్డును మెరుగుపరుచుకుంది. కృష్ణ తన రెండవ ప్రయత్నంలో 16.63 మీటర్ల బెస్ట్ విసిరి తన మునుపటి భారతీయ రికార్డును (16.03 మీ) అర మీటర్ కంటే ఎక్కువ మెరుగుపరుచుకుని ఈ సంవత్సరంలో తన రెండవ టైటిల్‌ను గెలుచుకుంది. ఆమె 15 మీటర్ల కంటే ఎక్కువ దూరం ఒకే ఒక్క త్రో మాత్రమే చేయగలిగినప్పటికీ, రజత పతక విజేత హన్నా రిచర్డ్‌సన్ 15.94 మీటర్లను అధిగమించగలిగింది. 23 ఏళ్ల కృష్ణ యుఎస్ఏ యొక్క ఎన్‌సిఎఎ లోని నెవాడా విశ్వవిద్యాలయం తరపున పోటీ పడుతోంది. షాట్ పుట్ మరియు డిస్కస్ త్రో రెండింటిలోనూ ప్రాతినిధ్యం వహిస్తోంది.



### ఈక్విటీ మార్కెట్లకు బడ్జెట్ షాక్

# రూ.10 లక్షలకోట్ల టర్నోవర్ లాస్ నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి,ఫిబ్రవరి 1:** కేంద్ర బడ్జెట్ 2026 ప్రకటన స్టాక్ మార్కెట్లకు భారీ షాక్ ఇచ్చింది. ఫ్యూచర్స్, ఆప్షన్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్‌లావాదేవీలపన్ను పెంచాలన్న ప్రభుత్వ నిర్ణయంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెగబడ్డారు. ఫలితంగా, గత ఆరేళ్లలో బడ్జెట్ రోజున సూచీలు ఇంత భారీగా పతనం కావడం ఇదే తొలిసారి. బడ్జెట్ రోజు ట్రేడింగ్‌లో సుమారు 10 లక్షలకోట్లు టర్నోవర్ ఆవిరి అయిపోయిందని ట్రేడర్లు అంచనావేసారు. ఆదివారం జరిగిన ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు దాదాపు 2 శాతం మేర నష్టపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 80,723 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 495 పాయింట్లు కోల్పోయి 24,825 వద్ద ముగిసింది. రోజు మధ్యలో అమ్మకాల ఒత్తిడి తారాస్థాయికి చేరడంతో సెన్సెక్స్ ఏకంగా 3,000 పాయింట్ల వరకు పతనమై 79,899.42 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. నిఫ్టీ కూడా 24,572 స్థాయికి పడిపోయింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ఎస్టీటీ పెంపును ప్రకటించడమే ఈ అమ్మకాలకు ప్రధాన కారణమైంది. ఫ్యూచర్స్ ట్రేడ్స్‌పై పన్నును 0.02 శాతం నుంచి 0.05 శాతానికి, ఆప్షన్స్ ప్రీమియంపై పన్నును 0.1 శాతం నుంచి 0.15 శాతానికి పెంచారు. ఈ నిర్ణయంతో ట్రేడింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. మార్కెట్‌లోని భయాలకు అద్దం పట్టే ఇండియా విక్స్ సూచీ దాదాపు 12 శాతం ఎగబాకింది. ఈ నష్టాలు కేవలం పెద్ద కంపెనీలకే పరిమితం కాలేదు. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 2 శాతం పైగా నష్టపోయాయి. ఐటీ రంగం మినహా అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లు అత్యధికంగా 6 పతనమవగా, మెటల్ షేర్లు 4 శాతం నష్టపోయాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, హిందాల్కో, ఓఎన్‌జీసీ వంటి షేర్లు 6 శాతం వరకు నష్టపోగా, ప్రతికూల మార్కెట్‌లోనూ విప్రో, టీసీఎస్ వంటి ఐటీ స్టాక్స్ 2 లాభపడి కాస్త ఊరటనిచ్చాయి. బిఎస్ఇలో మొత్తం 1759 కంపెనీలషేర్లు పెరిగితే 2375 కంపెనీల షేర్లు క్షీణించాయి. కేవలం 182 కంపెనీలషేర్లు యధావిధిగా కొనసాగాయి.

## క్రిప్టో లావాదేవీలు జాప్యంచేస్తే జరిమానా

### ఏప్రిల్ 1వ తేదీ నుంచే అమలులోకి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 1:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో క్రిప్టో లావాదేవీలు సకాలంలో తెలియజేయకపోతే జరిమానాలు విధించాలనినిర్ణఇంచారు. కొత్త ప్రతిపాదనలు వచ్చే ఏప్రిల్ 1వ తేదీనుంచి అమలులోకి వస్తాయి. ఆదాయపుపన్ను చట్టం 2025 ప్రకారం సెక్షన్ 509నిర్దేశించిన విధంగా క్రిప్టో లావాదేవీలు వివరాలు సకాలంలో వెల్లడించకపోతే భారీ జరిమానా కూడా ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. క్రిప్టో ఆస్తులు ఎప్పటికప్పుడు చట్టసంస్థలకు నివేదించాలని



కోరారు. రోజుకు రూ.200 చొప్పున జరిమానా ఉండాలనిసూచించారు. సరైన వివరాలు నిర్దిష్టమైన వ్యవధిలో ఇవ్వకపోతే రూ.50వేలు జరిమానా కూడా ప్రతిపాదించారు. నివేదికలు ఇవ్వకపోతే రోజుకు రూ.200, వివరాలు లేకుండా రూ.50వేలు జరిమానాలు ఈ బడ్జెట్ నుంచే అమలవుతాయి. క్రిప్టో ఎక్స్ఛేంజిలు, ఇతర సంస్థలు ఎప్పటికప్పుడు నిర్దేశిత నియంత్రణ సంస్థలకు నివేదికలు ఇవ్వాల్సి ఉంటుంది. క్రిప్టో కస్టమర్ల రోజువారి లావాదేవీలు ఆదాయపు పన్నుశాఖకు కూడా అందచేయాలి. జాప్యంతో రిటర్నులు దాఖలుచేసినవారికి ఎలాం టి చర్యలు జరిమానా అన్నది మాత్రం స్పష్టంచేయలేదు. అసంపూర్తి వివరాలపైనా స్పష్టత ఇవ్వలేదు.




# ఎంఎస్‌ఎంఇ రంగానికి రూ.10 వేల కోట్లతో ప్రత్యేక నిధి

**ముంబయి,ఫిబ్రవరి 1:** చిన్నమధ్యతరహాసూక్ష్మ పరిశ్రమలరంగం ఎంఎస్ఎంఇ భారత్ ఆర్థిక వృద్ధికి గ్రోత్ ఇంజిన్ వంటిదని అందుకోసమే ప్రత్యేకంగా రూ.10వేల కోట్లతో గ్రోత్‌ఫండ్ ఏర్పాటుచేసినట్లు కేంద్రంప్రకటించింది. తొమ్మిదవ బడ్జెట్‌లో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కొన్ని ఉపశమనాలు కల్పించింది. ఈ రంగంలో వృత్తి నైపుణ్యం ఉన్న కార్మిక కొరత ఎక్కువ ఉందని ఏకీభవించారు. ట్రేడ్ రిసీవబుల్స్ వ్యవస్థ (ట్రెడ్స్)ద్వారా ప్రభుత్వం రూ.7 లక్షలకోట్ల నిధులను అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. ఎంఎస్ఎంఇలనుంచి అన్ని కొను గోళ్లను ఈ ప్లాట్‌ఫామ్‌పైనుంచే నిర్వహిస్తారు. ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోళ్లు ఎంఎస్ ఎంఇలనుంచి మాత్రమే కొనుగోలుచేయాలని నిర్దేశించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా క్రెడిట్ గ్యారంటీ ఫండ్‌ట్రస్ట్ ఏర్పాటుచేసింది. ట్రెడ్స్ ఫ్లాట్‌ఫామ్‌పై ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ కోసం ఉపకరిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వ ఈమార్కెట్‌ప్లేస్ ట్రెడ్స్‌తో మొత్తం సమాచారం పంచుకోవాలి. ఎంఎస్ఎంఇ రంగంలో ఛాంపియన్లుగా పారిశ్రామిక వేత్తలను తీరినచదిద్దే లక్ష్యం ఉందని ఆర్థికమంత్రి వెల్లడించారు. మొదటిసారి వ్యాపారంచేసేవారికి ఈ ఫండ్ తోడ్పాటునిస్తుంది. స్వయం సమృద్ధినిదులు 2021లో ఏర్పాటుచేసారు. ఆనాడు ఎంఎస్ఎంఇలకు రూ.2వేల కోట్లుకేటాయించారు. ఎంజినరేగా తరహాలోనే ఎంఎస్ ఎంఇ రంగం కూడా ఉపాధిరంగం రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకూ చెల్లించే విధంగా మార్పులుచేసింది. అలాగే ప్రభుత్వం రూ.1200 కోట్లతో ఫండ్‌ఆఫ్ ఫండ్స్, రూ.9 వేల కోట్లతో గ్యారంటీ ఎమర్జన్సీ క్రెడిట్‌లైన్, రూ.1500 కోట్లు ఎంఎస్ఎంఇ పనితీరు వృద్ధికోసం, రూ.3860 కోట్లు పిఎం విశ్వకర్మ కింద కేటాయింపులు జరిపింది. ఇవన్నీ కూడా ఎంఎస్ఎంఇ రంగానికి ఊతం ఇచ్చేవేనని ఆర్థిక మంత్రి ప్రకటించారు.



## సెక్యూరిటీ లావాదేవీ పన్నుతో బ్రోకరేజి సంస్థల షేర్లు ఢమాల్..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** సెక్యూరిటీ లావాదేవీలపై పన్ను విధిస్తున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో పొందుపరచడంతో స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అలాగే బ్రోకరేజి ఆధారిత ఎక్స్ఛేంజి సంబంధిత కంపెనీల షేర్లు భారీగాఅంటే 12శాతం పతనం అయ్యాయి. సెక్యూరిటీ లావాదేవీల పన్నును డెరివేటివ్స్‌పై పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌వెల్లడించారు. దీనితో ఎస్టీట ఫ్యూచర్ కాంట్రాక్టులుపై 0.02 నుంచి 0.05శాతం పెరుగుతున్నట్లు వెల్లడి అయింది. ఫ్యూచర్స్ ఆప్షన్ల విభాగంలో ఈపెంపుతో బ్రోకరేజి స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఎంసిఎక్స్ 11.60శాతం క్షీణించి రూ.2232.15 వద్దట్రేడ్ అయితే ఏంజెల్‌వన్ 8.61శాతం క్షీణించి రూ.2320వద్ద స్థిరపడింది. ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసులు సంస్థ కూడా 8.06శాం క్షీణించి రూ.303.80 వద్ద ఇనలిచింది. బిలియన్‌బ్రెయిన్స్ గారేజి వెంచర్స్ గ్రో కంపెనీ 5.11శాతం, ఆనంద్‌రాఠి షేర్ బ్రోకర్లు 2.03శాతం చొప్పున క్షీణించాయి. ఫ్యూచర్స్ ఆప్షన్స్ ట్రేడింగ్‌కు కేంద్రం వ్యతిరేకం కాదని, చిన్న ఇన్వెస్టర్లు నష్టాల పాలవుతున్నారని, అందువల్లనే ఎస్టీటి కేవలం ఎఫ్అండ్‌వో రంగంపైనే పెంచామని అన్నారు. 90శాతం మంది రిటైల్ ఇన్వెస్టర్లు ఎఫ్అండ్‌వో విభాగంలో నష్టాలపాలవుతున్నారు. లక్షరూపాయల ఫ్యూచర్స్ విక్రయిస్తే ట్రేడర్లు రూ.20 చెల్లించాలి. అంతకుముందురూ.12.50 మాత్రమే ఉండేది. పదివేల ఆప్షన్ కాంట్రాక్టుసేల్‌కు ఎస్‌టిటి రూ.6.25 ఉంచి రూ.10 వరకూ పెంచిందని బ్రోకింగ్ సంస్థలు చెపుతున్నాయి.




## షేర్ల బైబ్యాక్, డివిడెండ్‌లు కూడా ఎల్టీసిజియే

### ఆర్థికశాఖ ప్రతిపాదనలు ఏప్రిల్ నుంచి అమలులోకి..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1:** ప్రభుత్వం ఇకపై షేర్ల బైబాక్ ను కూడా పన్నుల వ్యవస్థపరిధిలోకి తెస్తోంది. బైబాక్ లావాదేవీలనుంచి వచ్చే రాబడులు, డివిడెండ్ ఆదాయాలను కూడా మూలధన లబ్దికిందనే పరిగణించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న వ్యవస్థీకృత లోపాలను అరికట్టి మధ్యవర్తిత్వ ఛాన్స్‌లు కూడా తగ్గించాలని నిర్ణయించింది. ఇప్పటివరకూ వ్యక్తిగత ఆదాయ పన్ను శ్లాబ్‌లపరిధిలోనే పరిగణించేంది. ప్రత్యేకించి డివిడెండ్ ఆదాయవనరులను ఈకోవలోనే చూసేది. ఇకషేర్ల కొనుగోళ్ల బైబాక్ వంటివి మూలధన లబ్దికిందకే వస్తాయని, అందువల్ల మూలధన లబ్దిపైనా పన్నులు ఉంటాయని సూచించింది. దీర్ఘకాలిక మూలదన లబ్ది పై 12.5శాతం ఉంటుందని నిర్ణయించారు. ప్రమోటర్లు,నాన్‌ప్రమోటర్లు ఈ అధిక పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి ఈ పన్నురేట్లు అమలవుతాయి. కార్పొ రేట్‌ప్రమోటర్లు 22శాతం, నాన్ కార్పొరేట్ ప్రమో టర్లు యధావిధిగా 30శాతం పన్ను శ్లాబులోనే చెల్లించాల్సి ఉంటుంది. షేర్లబైబాక్‌పై పన్ను విదింపు ఇన్వెస్టర్లకు ఉపశమనం కలిగిస్తుందని ఆర్తికశాఖ కార్యదర్శి చెపుతున్నారు. ఇప్పటివరకూ భారీ కంపెనీలన్నీ కూడా వేలకోట్ల విలువైన షేర్లను బైబాక్‌చేసిన సంగతి తెలిసిందే. నిఫ్టీ ఐటి సూచీ 0.6శాతం ఆదివారంపెరిగితే విప్రో,టిసిఎస్‌లు రెండు, 1.7శాతం చొప్పున పెరిగాయి.

# బిఎస్ఎన్ఎల్‌కు రూ.28,473కోట్లు




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 1:** ప్రభుత్వరంగంలోని బిఎస్ఎన్ఎల్‌కు కేంద్రం బడ్జెట్‌లో రూ.28,473 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌కంటే 33శాతం తక్కువగానే కేటాయింపులు జరిపింది. వయబులిటీ గ్యాప్‌ఫండింగ్ ద్వారా 476 కోట్లు, ఉద్యోగుల పదవీవిరమణకింద కొంత కేటాయింపులు మొత్తం రూ.30,188 కోట్లు కేటాయించింది. అదనంగా 24 వేల 4జి సైట్‌లు ఏర్పాటుచేస్తోంది. ప్రస్తుతం ఉన్న లక్ష 4జి సైట్లకుతోడు అదనంగా వీటిని ఏర్పాటుచేస్తుంది. 2024లో కేంద్రం 56,785కోట్లు కేటాయించింది. 2025లో 82,054కోట్లు కేటాయిస్తే మూలధన వ్యయం కింద బిఎస్ఎన్ఎల్‌కు విడతలవారీగా 2019 నుంచి ఇప్పటివరకూ రూ.3.22 లక్షలకోట్లు విడుదచలేసింది. ఈ మొత్తంలోనే 2022లో 1.64 లక్షలకోట్లు, 4జి, 5జి స్పెక్ట్రమ్‌కోసం 203లో రూ.89వేల కోట్లు కేటాయింపులు జరిపింది. మంబైల్‌సర్వీసులను వచ్చేఏడాదిచివరికి 50 శాతం పెరగాలన్న లక్ష్యం విధించింది. ఫిక్స్‌డ్ లైన్ బిజినెస్ 15నుంచి 20శాం పెంచాలని నిర్ణయిం మచారు. సగటు రాబడి సర్కిళ్లవారీగా రూ.175వరకూ ఉన్నట్లు తేలింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 5-69, 7Pratipadu, Pentapadu (M), West Godavari Dist., Tadepalligudem-534101. Telefax: 08818-220791, 225046, RNI?No. ARTEL 2004/13724 Editer: "Damerla Saibaba responsible for selection of new under the PRB Act. Read: No H/SD/337/12-14. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# బాలత్రిపుర సుందరి అమ్మవారికి పుష్పాలంకరణ



భీమవరం ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :పౌర్ణమి సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన ధనరాజ్ చే అమ్మవారికి అభిషేకాలు, కూనపరెడ్డి రుషికేశ్, పూర్ణ కళ దంపతులచే ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కుంకుమార్చన, నవ్వర్ణార్చన, పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం 108 కేజీల వివిధ రకాల పుష్పాలతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు బాలత్రిపుర సుందరి మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# రేపు క్యాన్సర్ నిర్ధారణ శిబిరం సద్వినియోగం చేసుకోవాలిలి

## వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు, ఫిబ్రవరి 1 ( ప్రభాత వార్త) :ప్రపంచ క్యాన్సర్‌డే పురస్కరించుకుని ఈనెల 3న తణుకులో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, పరీక్షశిబిరం ఏర్పాటు చేసినట్లు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సభ్యురాలు జి.ఆశాజ్యోతి తెలిపారు. ఆదరణ సేవ ఫౌండేషన్, ఝాఖాణ మహిళా కాళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహిళా కళాశాల ఆవరణలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో మామోగ్రఫీ, పాప్ స్మియర్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. శిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను తణుకు ఎమ్మెల్యే ఆరమిల్లి రాధాకృష్ణ ఆదివారం కూటమి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో 30 ఏళ్లు దాటిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలందరి ఆరోగ్యం ముఖ్యమని, ప్రతి మహిళ తన వ్యక్తిగత ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ప్రాణాంతక వ్యాధుల్లో మహిళలు ఎక్కువ శాతం రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించేందుకు మామోగ్రఫీ టెస్ట్,పాప్ స్మియర్ టెస్ట్ చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభంగా చేయవచ్చని చెప్పారు.



# మార్టేరులో ఘనంగా హనుమాన్ శుభప్రతిష్ఠ



పెనుమంట్ర, ఫిబ్రవరి-01, ప్రభాతవార్త: మండలంలోని మార్టేరు గ్రామంలో జెడ్ వంతెన సమీపంలో వేంచేసియున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారికి వెండి కవచధారణ, శ్రీ గణపతి స్వామి వారికి వెండి కిరీట ధారణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన హారతులు, భజనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అభయ ఆంజనేయ స్వామిని వెండి కవచంతో, గణపతి స్వామిని వెండి కిరీటంతో ప్రత్యేకంగా అలంకరించారు. మార్టేరు జెడ్ వంతెన సమీపంలోని ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఈ కార్యక్రమాలు ఆదివారం ఉదయం ప్రారంభమై విజయవంతంగా ముగిశాయి. శ్రీ అభయ ఆంజనేయ స్వామికి వెండి కవచధారణకు, శ్రీ గణపతి స్వామికి వెండి కిరీట ధారణకు వెండి రూపంలోనూ, డబ్బు రూపంలోనూ సహకరించిన ప్రతి భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో గ్రామస్తులు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబటి నీచ వ్యాఖ్యలుపై అగ్రహించన జనసేన



చాట్రాయి,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :వైసీపీ నీచ వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలి చాట్రాయి మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తుమ్మల జగన్ అన్నారు.ముఖ్యమంత్రి గౌరవ మర్యాదలకు భంగం కలిగించే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబుపై చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. వైసీపీ నేత అంబటి రాంబాబు ప్రజా జీవితంలో ఉండే అర్హత కోల్పోయారని అతని వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు కూడా దిగజారి, కనీస మర్యాద, సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని అందువల్ల ఆ పార్టీ నేతలు ఆ విధంగా మాట్లాడుతున్నారని దుయ్యపట్టారు. ఆ పార్టీ ప్రజాస్వామ్య విలువలనీ, రాజకీయాల్లో హుందాతనాన్నీ పాటించడం లేదు. రాజకీయాల్లో హుందాతనానికి తిలోదకాలు ఇచ్చి నీచమైన వ్యాఖ్యలకి, చర్యలకి పాల్పడుతున్న వైసీపీకి ప్రజలు మరింత గట్టిగా బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తుమ్మల కరుణాకర్, చంద్రశేఖర్, మహేష్, తిరుపతిరావు, నెల్లూరు సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

# రొయ్య చేపల మేతల రేట్లు పెరుగుదలకు అవకాశం

## మండిపడుతున్న రైతు సంఘాలు - గత ఆరు నెలలుగా కల్చర్ శూన్యం

## ఏ విధంగా పెంచగలుగుతున్నారని ప్రశ్న

నరసాపురం ప్రభాతవార్త : గోదావరి జిల్లాలో వరి తర్వాత ప్రధానమైన సాగు ఆక్వా. అయితే రొయ్య చాప సాగు చేసే రైతులు ఇప్పుడు ఆందోళనలో పడ్డారు .ఏమాత్రం గిట్టుబాటు లేకుండా జరుగుతున్న సాగుకు నెత్తిన రాయి పడినట్లు అయింది. చేపల మేత రేట్లు రొయ్య మేత రేట్లు పెంచుతున్నట్లు డీలర్లు తెలిపారు దీంతో రైతులు రైతు సంఘాలు తీవ్ర ఆందోళన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి .గతంలో తగ్గిస్తామని చెప్పి కేవలం కంటి తుడుపుగా కిలో కు నాలుగు రూపాయలు తగ్గించి చేతులు దులుపుకున్నారని విమర్శిస్తున్నారు .ఇప్పుడు మాత్రం రొయ్యల మేతకు బస్తాకు 200 చేపల మేతకు బస్తాకు 150 నుండి 250 వరకు పెంచబోతున్నట్లు సమాచారం. వచ్చిందని అదే జరిగితే గోదావరి జిల్లాల్లో ఆక్వా రైతులు తీవ్ర ఆందోళనకు దిగాల్సి వస్తుందని రైతు సంఘాల నాయకుడు గొట్టుముక్కల భగవాన్ రాజు హెచ్చరించారు. పాలకొల్లులో జరిగిన సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరును రొయ్య మేతల తయారీ సంస్థల తీరును తీవ్రంగా ఎండగట్టారు. ఈ పరిస్థితిపై వెంటనే సంబంధిత మంత్రి అచ్చయ్య నాయుడు నిమ్మల రామానాయుడు జోక్యం చేసుకొని రైతులను నష్టపోకుండా చూడాలని కోరుతున్నారు .మార్కెట్లో మిగతా వస్తువులు ఆహార పదార్థాలు పెరుగుతున్న చాప రొయ్య మాత్రం ధర పెరగకుండా రైతులను నష్టపెడుతున్న విషయం కూడా తెలిసి మేతల రేట్లు పెంచడం దారుణం అంటున్నారు. ఇప్పటికే లీజులు డీజిల్ వల కూలీలు రైతులను పీల్చి పిప్పి చేస్తుంటే మేత రేట్లు కూడా పెంచితే ఇక ఆక్వా సాగు చేసేది ఎవరని అడుగుతున్నారు.



# వైసీపీ నేత అంబటి దిష్టిబొమ్మ దగ్ధం,

జీలుగుమిల్లి, ఫిబ్రవరి-01, ప్రభాతవార్త: మండల కేంద్రం జీలుగుమిల్లిలో వైసిపి నేత అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఎన్డీఏ ఆధ్వర్యంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అబటి దిష్టిబొమ్మను ఆదివారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ఉద్దేశంతోనే వైసీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఏమీ చేయలేని వైసీపీ నాయకులు, అధికారంలో లేని నిరాశతో అబద్ధాలే ఆయుధంగా మారుస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర పునర్నిర్మాణం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో నిబద్ధతతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి నాయకుడిపై వ్యక్తిగత దూషణలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, రాజకీయ హద్దులు దాటిన వ్యాఖ్యలను కూటమి శ్రేణులు ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రెసిడెంట్ పసుపులేటి రాము, తెలుగుదేశం పార్టీ మండల ప్రెసిడెంట్ సంకవల్లి సాయి కృష్ణ, బీజేపీ మండల ప్రెసిడెంట్ గుడ్ల రాంబాబు, తాటియకులగూడెం సర్పంచ్ వనమా రాంబాబు, గ్రామ జనసేన ప్రెసిడెంట్ రాయి సుబ్బారావు, ఎంపీటీసీ నాలి శ్రీనివాస్, గూడెల్లి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# పోడూరులో యు.టి.ఎఫ్ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష -- విద్యార్థుల్లో దాగిన ప్రతిభకు వెలుగు

పోడూరు,ఫిబ్రవరి 01,ప్రభాత వార్త: విద్యార్థుల్లో దాగి ఉన్న మేధస్సు, సృజనాత్మకతను వెలికితీయాలనే లక్ష్యంతో యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యు.టి.ఎఫ్) ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్షను విజయవంతంగా నిర్వహించారు. పోడూరు మండల పరిధిలోని 25వ ప్రతిభాపాటవ ఉన్నత పాఠశాల నందు ఈ ప్రతిభా పరీక్ష జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యు.టి.ఎఫ్ ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి క్రాంతికుమార్ మాట్లాడుతూ, ఇలాంటి పరీక్షల ద్వారా విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని పోటీ ప్రపంచానికి సిద్ధం చేయవచ్చని తెలిపారు. ప్రతిభా పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రతిభా పరీక్షలో పదో తరగతికి చెందిన 76 మంది, ఐదో తరగతికి చెందిన 140 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు త్వరలో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రస్టల్ జిల్లా కార్యదర్శి అంగర రామభద్రం, జిల్లా కార్యదర్శి ఎం.వి. రాజశేఖర్, మండలశాఖ అధ్యక్షులు కేతానాగరాజు, ప్రధాన కార్యదర్శి కేతలి పెద్దిరాజు, గౌరవాధ్యక్షులు గంధం కుమార స్వామిరాజా, సహాయ అధ్యక్షులు డి. క్షేమమూర్తి, సహాయ అధ్యక్షురాలు కండవల్లి మంజుల, కోశాధికారి సిహెచ్ త్రినాథ్, మహిళా కార్యదర్శి ఎం. సత్యవాణి, సీనియర్ నాయకులు తాళబత్తుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# అంబటి నోరు అదుపులో పెట్టుకో

భీమవరం ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు అత్యంత నీచంగా ఉన్నాయని, అంబటి నోరు అదుపులో పెట్టుకో అంటూ భీమవరం టీడీపీ నాయకులు విమర్శించారు. సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఆదేశాల మేరకు పట్టణ టిడిపి ఆధ్వర్యంలో అంబటి దిష్టిబొమ్మతో భీమవరం వన్ టౌన్ పోలీసు స్టేషన్ వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. పిర్యాదు చేసి రోడ్డు బయట రాంబాబు చిత్రపటాన్ని ఉరి తీశారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ మాజీ మంత్రి అంబటి రాంబాబు నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ అధికారం కోల్పోయాక వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబుకు మతిభ్రమించిందన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబును అసభ్య పదజాలంతో మాట్లాడడం బాధాకరమన్నారు. ఇలాంటి నాయకులను జగన్ రెడ్డి పార్టీలో పెట్టుకోవడం దుర్మార్గమన్నారు. అంబటి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అనంతరం అంబటి రాంబాబు దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టుకుంటూ ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో మెరగని నారాయణమ్మ, మెంటే గోపి, ఎద్దు ఏసుపాదం, చెల్లబోయిన సుబ్బారావు, ఎండి నౌషాద్, పాల శ్రీరామ్ దాసు, గోలగాని రమేష్, నీలాద్రి రమేష్, యలమంచిలి శ్రీను, ఎండి ఫిరోజ్, చెరుకుపల్లి సంతోష్, చెరుకు తిరుపతిరావు, మదాసు కనకదుర్గ, ఎండి షబీన, గంధం రాధ, కొండ్రు శ్రీనివాస్, విజ్జురోతి రాఘవులు, పాపోలు ఏడుకొండలు, గూడూరి సుబ్బారావు, అమర్ బాబు, జోగేశ్వరి, శ్రీలక్ష్మి, ఎండి నసీమా బేగం, గొలగాని రాము, గండి భూషణం, మద్దుల మూర్తి, శివాని, దొంగ వెంకటేశ్వరరావు , గొంతిన శ్రీనివాస్, చింతపల్లి బాలాజీ తదితరులు పాల్గొన్నారు,



# ఆరోగ్య వర్షిని సేవలు ఎంతో ఆదర్శం

నరసాపురం ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : సమాజంలో ఆరోగ్య వర్షిణి స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శనీయంగా నిలుస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు యం.ఏ షరీఫ్, తెదేపా ఇంచార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, నాయకులు కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, జక్కం శ్రీమన్నారాయణ, మొగల్తూరు ఎంపీడీవో త్రిశూల పణీ అన్నారు మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామం జెడ్పీ స్కూల్లో ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరాలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలు పేదల పాలిట వరంగా నిలుస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో ఉండాలన్నారు. రక్తదానం వల్ల ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చునని అన్నారు. ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు గత కొన్నేళ్లుగా అందిస్తున్న నిస్వార్థ సేవలను కొనియాడారు. 77 వ సారి రక్తదానం చేసిన ఆదరణ ట్రస్ట్ చైర్మన్ కృష్ణ భగవాన్ ను కొప్పునాతి రాధాకృష్ణ కొత్త ఆట తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కొల్లాటి దుర్గాప్రసాద్ తదితరులను అభినందించారు. వైద్యులు బర్రె నాయకర్, పీ చంద్రశేఖర్ వర్మ, కొమ్మూరి రామకృష్ణ, దీప్తి మాధురి, పీవీ మహాలక్ష్మి, భరత్ , యం రామకృష్ణ, బి విక్రమ్, పీ రాణిచంద్ర, టి నరసింహరాజు కు గుండె, ఊపిరితిత్తులు, వేరికోస్ వేయిన్స్, చెవి, ముక్కు, గొంతు, స్త్రీ సమస్యలు తదితర రోగాలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన రోగులకు ఈసీజీ, 2 డి ఏకో , బీపీ, షుగర్ పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నరసాపురం వరలక్ష్మి హాస్పటల్, టిఎన్నార్ ఫిజియోథెరపీ, భీమవరంలోని తేజ హాస్పటల్, విష్ణు దంత వైద్యశాల, మీనాక్షి కంటి ఆసుపత్రి, ఏఎస్ఎన్ బ్లడ్ బ్యాంకు సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుబ్బల నాగరాజు మొగల్తూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సత్తినేని బాబ్జి మొగల్తూరు మండలం ప్రధాన కార్యదర్శి తిరుమణి హేమంత్ టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుమణి భాస్కర్ రావు ముత్యాలపల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, దొంగ మురళి నర్సాపూర్ మండలం తెలుగు యువత అధ్యక్షులు, దొంగ శ్రీను నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు, మామిడి శెట్టి సత్యనారాయణ తిరుమన స్వామి ఎంపీటీసీ సభ్యులు, కొల్లాటి బాలకృష్ణ పెంటయ్య, మూలస్వామి, వాతాడి ఉమామహేశ్వర రావు సత్తినేని త్రిమూర్తులు, కొప్పాడి వర్మ, మామిడి శెట్టి సత్యనారాయణ, జట్ల నాగేశ్వరావు, పడవల సత్యనారాయణ, పీఎం ఏ రాజు, పి 4 నాగేశ్వరావు, బంధన విజయకుమార్, కొప్పాడి వెంకట దుర్గా నాగరాజు తదితరులు పాల్గొన్నారు,




# వైభవంగా సాయిబాబా దశమ వార్షికోత్సవ మహోత్సవములు

కాళ్ళ ఫిబ్రవరి 1( ప్రభాతవార్త) :మండలంలోని దొడ్డనపూడి లో షిరిడి సాయిబాబా దశమ వార్షికోత్సవ మహోత్సవములు వైభవంగా జరిగాయి. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం యువ బ్రహ్మ వాడపల్లి మాధవాచార్యులు మరి కొంతమంది రుత్వికులచే మూడు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు వెలివెల సత్యనారాయణమూర్తి- సావిత్రి దంపతుల కుమారులు ఈ కార్యక్రమాలు జరిపారు. తెల్లవారుజాము నుండి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకం, పండ్ల రసాలు, నదీ జలాలతో బాబా వారిని అభిషేకించారు. సహస్రనామార్చన, ప్రధాన హోమం, పూర్ణాహుతి నిర్వహించి లోక కళ్యాణార్థం వేద ఆశీర్వచన జరిపారు. కుంభాన్న దర్శనం గావించారు. ఆలయ ట్రస్టీలు వెలివెల వీర వెంకటేశ్వరరావు- భాగ్యలక్ష్మి, శ్రీహరి బాబు- జయలక్ష్మి దంపతులు అమెరికా నుండి వచ్చి ఈ వార్షికోత్సవాల్లో పాల్గొన్నారని ట్రష్టి వెలివెల సుబ్రహ్మణ్య శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా కాళ్ల మండల మాజీ జడ్పిటిసి అడ్డాల పద్మావతి- వెంకట నాగరాజు దంపతులు ఆలయ ట్రస్టీలు శ్రీనివాసు, వెంకటేశ్వరరావు, భాగ్యలక్ష్మి శ్రీ హరి బాబు- జయలక్ష్మి, సావిత్రి లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలోచాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు, టిడిపి మాజీ మండల అధ్యక్షుడు గుండాబత్తుల వెంకట నాగేశ్వరరావు, ఇర్రింగి వీర రాఘవులు, మాజీ ఎంపీటీసీ సాయి సేవకుడు కందుల వీర రాఘవులు, ఆయా గ్రామాల భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.



## బెస్ట్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రాంబాబు



భీమవరం ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : లయన్స్ జిల్లా 316 జి - రీజియన్ 2 "రీజియన్ మీట్" ఆదివారం ఆకివీడు లోజరిగింది. భీమవరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎం జె ఎఫ్ లయన్ బొండా రామకృష్ణ రావు (రాంబాబు) కు "బెస్ట్ ప్రెసిడెంట్ " అవార్డు, క్లబ్ కి "బెస్ట్ ఎల్ సి ఐ ఎఫ్ కాంట్రిబ్యూషన్ అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా భీమవరం క్లబ్కార్యదర్శిఅల్లు తులసి ప్రసాద్ భీమవరం లయన్స్ సభ్యులు రాంబాబుకు అభినందనలు తెలిపారు.

# మెగా మెడికల్ క్యాంపు కార్యక్రమం

మొగల్తూరు ఫిబ్రవరి 1( ప్రభాతవార్త)సమాజంలో ఆరోగ్య వర్షిణి స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శనీయంగా నిలుస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు యం.ఏ షరీఫ్, తెదేపా ఇంచార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, నాయకులు కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, జక్కం శ్రీమన్నారాయణలు అన్నారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామం శ్రీ బండి ముత్యాలమ్మజెడ్పీ స్కూల్లో ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించారు ఈ సందర్భంగా. ఉచిత వైద్య శిబిరాలు పేదల పాలిట వరంగా నిలుస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో ఉండాలన్నారు. రక్తదానం వల్ల ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చునని అన్నారు. ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు గత కొన్నేళ్లుగా అందిస్తున్న నిస్వార్థ సేవలను కొనియాడారు. 77 వ సారి రక్తదానం చేసిన ఆదరణ ట్రస్ట్ చైర్మన్ కృష్ణ భగవాన్ ను అభినందించారు. వైద్యులు బర్రె నాయకర్, పీ చంద్రశేఖర్ వర్మ, కొమ్మూరి రామకృష్ణ, దీప్తి మాధురి, పీవీ మహాలక్ష్మి, భరత్ , యం రామకృష్ణ, బి విక్రమ్, పీ రాణిచంద్ర, టి నరసింహరాజు కు గుండె, ఊపిరితిత్తులు, వేరికోస్ వేయిన్స్, చెవి, ముక్కు, గొంతు, స్త్రీ సమస్యలు తదితర రోగాలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన రోగులకు ఈసీజీ, 2 డి ఏకో , బీపీ, షుగర్ పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నరసాపురం వరలక్ష్మి హాస్పటల్, టిఎన్నార్ ఫిజియోథెరపీ, భీమవరంలోని తేజ హాస్పటల్, విష్ణు దంత వైద్యశాల, మీనాక్షి కంటి ఆసుపత్రి, ఏఎస్ఎన్ బ్లడ్ బ్యాంకు సంస్థలకు నాగిడి రాంబాబు కృతజ్ఞతలు తెలియజేశారు





# శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి

మొగల్తూరు ఫిబ్రవరి 1 (ప్రభాతవార్త) 216 నేషనల్ హైవే ఆనుకుని ముత్యాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వెలసి ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం పలు జిల్లాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యములు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు, ఈ సందర్భంగా ఆలయ ఈవో మోకా అరుణ్ కుమార్ ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు డైరెక్టర్లు గ్రామస్తులు స్థానికులు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యములు కలగకుండా దగ్గరుండి క్యూలైన్ ఏర్పాటుచేశారు, ఆలయ ఆవరణలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు భజన కార్యక్రమం నిర్వహించారు, మహిళా భక్తులకు పసుపు కుంకుమ గాజులు పంపిణీ చేశారు



# మావుళ్ళమ్మకు బంగారం



భీమవరం ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి స్వర్ణ నిధికి కొండంగి గ్రామానికి చెందిన తిరుమలశెట్టి సుబ్రమణ్యం జ్యోతి దంపతులు లక్షా ఏభై వేలు రూపాయలు విలువైన 11 గ్రాముల బంగారం విరాళంగాఇచ్చారు. వీరికి ఆలయ అర్చకులు పూజలు ఆశీర్వచనాలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం ప్రసాదం ఫోటో అందచేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మల్లువలస లక్ష్మి నిర్మల, గొంతెన రమణ పాల్గొన్నారు.

## టీ నర్సాపురం సహకార సంఘ సీఈవోగా సోలా సత్యనారాయణ



టీ నర్సాపురం ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :టీ నర్సాపురం సహకార సంఘ సీఈవోగా గండిగూడెం గ్రామానికి చెందిన సోలా సత్యనారాయణను నియమించారు. సత్యనారాయణ గతంలో సహకార సంఘంలో పలు బాధ్యతలను నిర్వహించారు. సీఈఓ గా సత్యనారాయణ తనబాధ్యతలను బాగా నిర్వహించాలని సంఘ సభ్యులకు అన్ని విధాల సహకారంగా ఉండాలని సహకార సంఘ అధ్యక్షులు జోనుబోయిన సోంబాబు కోరారు. ఈ సందర్భంగా సత్యనారాయణను సోంబాబు అభినందించారు అదేవిధంగా గ్రామస్తులు సిబ్బంది కూడా అభినందించారు.

## 31వ వార్డులో అనధికారిక గృహాల తొలగింపు



భీమవరం టౌన్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : భీమవరం 31వ వార్డు లోసరి కెనాల్ రోడ్ లో అనధికారికంగా ఉన్న ఇళ్లను అధికా రులు తొలగించారు. అనధికారికంగా నిర్మించిన ఇండ్లను తొలగించే ప్రక్రియలో ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు రావడంతో మున్సిపల్ కమిషనర్ పర్యవే క్షణలో ఆదివారం జెసిబిలతో తొలగించారు. ఇళ్ళు తొలగించబడిన వారికీ ప్రస్తుతం టిడ్కోనందు తాత్కాలికం గా నివాసం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కె. రామచంద్రా రెడ్డి, సిబ్బంది , టౌన్ ప్లానింగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

## నిద్రమామిడి చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి
### గండిగూడెం గ్రామస్తులు



టీ నర్సాపురం ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: టీ నర్సాపురం గ్రామపంచాయతీ గండి చెరువులోని నిద్రమామిడి చెట్లను నరికిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గండిగూడెం ప్రజలు కోరుతున్నారు. గండిగూడెం ప్రజలు ఉపాధి పని చేసుకుని జీవన అభివృద్ధి సాగించుకుని సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో గల గండిచెరువులో గత మూడు రోజుల క్రితం టీ నర్సాపురం కు చెందిన అద్దంకి రవి మరియు బంధం చర్లకు చెందిన గంట రాఘవయ్య అనే ఇద్దరు రైతులు సుమారు 50000 రూపాయలు విలువ చేసేగండి నిద్ర మామిడి చెట్లు మూడు చెట్లు నరికి ధ్వసం చేయడం జరిగిందని గండిగూడెం గ్రామస్తులు కొరివి శేషారావు పింగుల మధు పాకనాటిశ్రీరాములు పెను బోయిన వెంకటేశ్వరరావు మంగరాజు గంగరాజు తదితరులు తమఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం వారు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గండిగూడెం పెద్ద గొల్ల కొరివి శేషారావు మాట్లాడుతూ సంబంధిత అధికారులు స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఆరవల్లిలో జాతర మహోత్సవాలు.




అత్తిలి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో గల కనకదుర్గమ్మ, మావుళ్ళమ్మ, మహంకాళ్ళమ్మ, మారెమ్మ, చెవుళ్ళమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు మాజీ మంత్రి కారుమూరిని సత్కరించారు.

## వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా బడ్జెట్
### బిజెపి ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్



భీమవరం టౌన్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశ భవిష్యత్ నిర్ణయించే దిశగా వరుసగా తొమ్మిది సార్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ వెల్లడించారు. కేంద్ర బడ్జెట్ విడుదల సందర్భంగా పార్టీ పిలుపు మేరకు జిల్లా కేంద్రాల్లో బడ్జెట్ విశ్లేషణల కార్యక్రమాలు చే పట్టారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలోని నర్సాపురం పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన బడ్జెట్ విశ్లేషణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వరుసగా 9సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత కూడా నిర్మలా సీతారామన్ దేనన్నారు. దేశ ఆర్థిక అభివృద్ధి, ప్రజల జీవన విధానం మెరుగుపరిచే దిశలో దేశం మరింత ముందుగా అడుగులు వేస్తుంది అన్నారు. ఈ బడ్జెట్ దేశవ్యాప్తంగా పండుగ జరుపుకునేలా ఉందన్నారు. పార్టీ అధ్యక్షులు నితిన్ నబిన్, రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, బడ్జెట్ ప్రవేశ పెట్టిన టీంలో మన ప్రాంతం నుండి మంత్రి శ్రీనివాస వర్మ, పార్లమెంట్ సభ్యులు పాకా సత్యనారా యణ పార్లమెంట్లో సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య బడ్జెట్ ప్రవేశపెట్టడం మన ప్రాంత వాసులకు గర్వకారణం అన్నారు దేశం ఒడి ఒడిగా అభివృద్ధి చెందుతుందని, మునుముందు మరిన్ని బడ్జెట్లు ప్రవేశపె ట్టాలని అన్నారు. బిజెపి పాలనలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో విశ్వగురు వికసిత్ భారత్ గా మారే ప్రక్రియలో బిజెపి మరిన్ని ముందడుగులు వేయాలని రానున్న పది రోజుల్లో ప్రతి వర్గానికి బడ్జెట్ చేరవేసే ప్రయత్నంలో బిజెపి , ఏపిలో ఎన్డీఏ బలమైన కార్యాచరణతో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న నిర్ణయమని, ప్రజలు సహకరించాలని, బిజెపి శ్రేణులు విరివిగా పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి మాట్లాడుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అద్భుతమైన బడ్జెట్ను ప్రవేశపెట్టారని అన్నారు. అన్ని జిల్లాల్లో పార్టీ పిలుపు మేరకు బడ్జెట్ విశ్లేషణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. అన్ని వర్గాలకు అనుకూలమైన బడ్జెట్ అని, వికసిత్ భారత్ లక్ష్యసాధనగా దీనిని అన్ని వర్గాలకు చేరవేసేందుకు కార్యాచరణతో ముందుకు పోతున్నామని, పార్టీ శ్రేణులు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు కాగిత సురేంద్ర, అరసవల్లి సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## కాళ్లకూరులో పెన్షన్ పంపిణీ



కాళ్ల ఫిబ్రవరి 1 ( ప్రభాతవార్త) : ఒకటో తారీకు కన్నా ముందుగా పెన్షన్ అందడం అభినందనీయమని, ఆనందదాయకమని పలువురు పెన్షన్ దారులు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం నుండి వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, పెన్షన్ దారులు ఇండ్లకు వెళ్లి పెన్షన్లు అందజేశారు. పెన్షన్ తీసుకునేవారు అందరూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## అంబటి వ్యాఖ్యలపై కూటమి నాయకుల నిరసన




పెనుమంట్ర, ఫిబ్రవరి-01, ప్రభాతవార్త: మండలంలోని మార్టేరు జంక్షన్లో అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై అసభ్య పదజాలంతో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో ఆచంట నియోజవర్గంలోని 4 మండలాల కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు అంబటి రాంబాబు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా, రాష్ట్ర ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలకు అంబటి రాంబాబు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన నిరంకుశ వైఖరి నశించాలని నినాదాలు చేస్తూ సుమారు అరగంట పాటు ర్యాలీ నిర్వహించారు. సెంటర్లో మానవహారం ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమం శాంతియుతంగా కొనసాగగా, స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## సిపిఎం నేత అమరజీవి చింతపల్లి శ్రీరాములు భార్య నాగమ్మ ఇక లేరు



పెనుమంట్ర, ఫిబ్రవరి-01, ప్రభాతవార్త: పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువు అమరజీవి చింతపల్లి శ్రీరాములు భార్య చింతపల్లి నాగమ్మ (105) ఆదివారం రాత్రి మృతిచెందారు. శ్రీరాములు నాగమ్మ దంపతులకు ఆరుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, చింతపల్లి శ్రీరాములు కామ్రేడ్ ఎస్ ఆర్ దాట్ల సహస్రత్వంలో కల్లు గీత కార్మిక సంఘం క్రియాశీలక కార్యకర్తగా పని చేశారు. భార్యాభర్తలిద్దరు కూడా సిపిఎం పార్టీ అంటే అమితమైన విశ్వాసం పని చేశారు. శ్రీరాములు నాగమ్మ కుమారుడ అప్పారావు. చాలా కాలం శాఖ (కార్యదర్శి )కోడలు మనవరాలు లక్ష్మి కుమారి. పార్టీ మండల కమిటీ సభ్యురాలిగా పనిచేస్తున్నారు. మొత్తం కుటుంబం అంతా పార్టీ అభిమానులుగా ఉన్నారు. నాగమ్మ మృతిపై పార్టీ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని వ్యక్తం చేసింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి బలరాం, జిల్లా కార్యదర్శి జె ఎన్ వి గోపాలన్, కల్లు గీతా కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జుత్తుగ నరసింహమూర్తి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్, కామన మునుస్వామి, మండల కార్యదర్శి ప్రసాద్, మండల కమిటీ సభ్యులు సుబ్బరాజు, నేతలు చిత్తరంజన్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.




నరసాపురం పట్టణం నుంచి అంతర్వేది తిరునాళ్లకు ఆదివారం వెళ్లిన భక్తులకు చాగంటి నరేంద్ర ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పులిహార పంపిణీ చేశారు నరసాపురం రూరల్ ప్రభాతవార్త



మాఘ పౌర్ణమి కావడం వల్ల అంతర్వేది తిరునాళ్లకు ఆదివారం సెలవు కావడం పరిసర ప్రాంతాల నుండి ఇతర జిల్లాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పంటిరేవు మీదుగా అంతర్వేది తిరునాళ్లకు వెళ్లారు. నరసాపురం ప్రభాతవార్త



నాగారమ్మ తల్లి జాతర ముగియడంతో నరసాపురం చిన్న మామిడిపల్లిలో పెద్ద ఎత్తున అన్నప్రసాద కార్యక్రమం జరిగింది భక్తులు ముఖ్యంగా మహిళలు వందలాదిగా తరలివచ్చారు అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. నరసాపురం ప్రభాతవార్త



ఉండి మండలంలోని కోట్ల ఫంక్షన్ హాల్లో పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్గా నియమితులైన జుత్తుగ నాగరాజు ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగరాజు దంపతులను సత్కరించారు. నరసాపురం రూరల్ ప్రభాత వార్త

## అంబటి దిష్టిబొమ్మ దగ్ధం



నరసాపురం ప్రభాతవార్త : గుంటూరులో అంబటి అరెస్టు తేదేభానేతల ఆందోళన నేపథ్యంలో స్థానిక కూటమి నాయకులు ఆదివారం మార్కెట్లో పెద్ద ఎత్తున ర్యాలీ ఆందోళన నిర్వహించారు .సెంటర్లో అంబటి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అంబటికి సంస్కారం లేదని వాక్ స్వాతంత్రం అంటే బూతులు తిట్టడం అనుకుంటున్నారని ఆయన చదువుకున్న అజ్ఞాన విమర్శించారు. వైకాపాకు 11 స్థానాలు రావడానికి వారి బూతు పురాణం కారణం కాదా అని ప్రశ్నించారు. మహిళల పట్ల గౌరవంగా మాట్లాడడం నాయకులను అత్యంత హీనం చేసి విమర్శించడం అసభ్య పదజాలం వాడటం ఏమాత్రం సరి కాదన్నారు .రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మత్స్యకార చైర్మన్ పెద్దిరాజు తూరు రామరాజు జక్కం శ్రీమన్నారాయణ వాతాడ ఉ మామహేశ్వరరావు కొలచన పద్మ నాగరాజు కౌన్సిలర్ పాలూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## దేవులపల్లి లో అంబటి రాంబాబు పై టిడిపి శ్రేణులు ఆగ్రహం

జంగారెడ్డిగూడెం రూరల్ ఫిబ్రవరి 1 ( ప్రభాతవార్త): మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు, దిష్టిబొమ్మతో శవ యాత్ర నిర్వహించి అంబటి రాంబాబు దిష్టిబొమ్మను టిడిపి దగ్ధం చేశారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి లో టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. మండల ?టీడీపీ అధ్యక్షులు కుక్కల మాధవరావు, ఆధ్వర్యంలో దేవులపల్లి ప్రధాన రహదారిపై భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు ఫోటోలను చెప్పులతో కొట్టి ఖబడ్దార్ అంబటి రాంబాబు అంటూ భారీ ఎత్తున నిరసన తెలియజేశారు ?ఈ సందర్భంగా ఏలూరు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు రావూరి కృష్ణ జిల్లా అధికార ప్రతినిధి బొబ్బర్ బాలరాజు టిడిపి నాయకులు దాకారపు కృష్ణ టిడిపి సీనియర్ నాయకులు గోలి అనిల్ మాట్లాడుతూ, 45 ఏళ్ల రాజకీయ



అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు వంటి నాయకుడిపై అంబటి రాంబాబు అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. టిడిపి సీనియర్ నాయకులు గోలి అనిల్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు తమ నోటిని అదుపులో పెట్టుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గత ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితమైన వైసీపీ, భవిష్యత్తులో డిపాజిట్లు కూడా దక్కించుకోలేదని ధ్వజమెత్తారు అనంతరం లక్కవరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పోలీస్ స్టేషన్లో అంబటి రాంబాబు పై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో దేవులపల్లి టిడిపి అధ్యక్షులు రవి అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులతో పాటు, టిడిపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అనుచిత వ్యాఖ్యలను ఖండించిన టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్




జంగారెడ్డిగూడెం ఫిబ్రవరి 1( ప్రభాతవార్త ): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ని వైసీపీ నేత మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ ఖండించారు.లి లిఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఇలాంటి దిగజారుడు మాటలు మాట్లాడే ఇటువంటి వ్యక్తులను ప్రజలు బహిష్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఏపి సిఎం చంద్రబాబు నాయుడుపై వైసిపి నేత అంబటి రాంబాబు చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలతో రాష్ట్రంలో తీవ్రస్థాయిలో అలజడులు రేగాయి. అన్నిప్రాంతాల్లోనూ అంబటిపై తెలుగు తమ్ముళ్ళు గరంగరంగా ఉన్నారు. పెద్ద ఎత్తున ఆందోళనలతో తమ నిరసన వ్యక్తం చేస్తూ వస్తున్నారు. రాష్ట్రం మొత్తం టిడిపి శ్రేణులు ఆవేదన వ్యక్తం చేసి నిరసన కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఇలా దిగజారుడు మాటలు మాట్లాడితే గత ఎన్నికల్లో 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేసి ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు బుద్ధిచెప్పారని అన్నారు. ఎవరయినా ముఖ్యమంత్రిని గాని,ఉప ముఖ్యమంత్రిని గాని,లోకేష్ గాని ఒళ్ళు మరచి మాట్లాడితే మీ అంతు చూస్తామని కిషోర్ హెచ్చరించారు. తనదైన శైలిలో వైసిపి నేత అంబటి రాంబాబు పై విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఉపయోగించాల్సిన పదజాలం ఇదేనా అంటూ నిలదీశారు. జలవనరుల శాఖామంత్రిగా పనిచేసిన అంబటికి డయాఫ్రం వాల్ అంటే ఏంటో తెలియదంటూ ఏపి పరువును దిగజార్చారని ధ్వజమెత్తారు. అటువంటి వైసిపి నేతలందర్నీ గద్దెదించిన ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పారని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని, కానీ ఈ స్థాయిలో దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించే విష సంస్కృతికి ఏపిలో బీజం వేసింది మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డేనంటూ ఘాటుగా విమర్శించారు. అప్పటి వైసిపి ప్రజాప్రతినిధులు ఏపి పరువు దిగజార్చితే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఏకంగా రాష్ట్రం పరువును తాకట్టు పెట్టేశారంటూ ఆరోపించారు. అయినప్పటికీ మార్పు చెందకుండా ఇదేవిధంగా వ్యవహరిస్తే ప్రజలతో పాటూ టిడిపి కార్యకర్తలు కూడా చూస్తూ ఊరుకోరని మండిపడి, భవిష్యత్తులో అందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందంటూ హెచ్చరించారు.

## రాష్ట్రానికి మొండిచేయి -కార్పొరేట్లకు వరాలు ఈ బడ్జెట్
### జె.ఎన్.వి.గోపాలన్




భీమవరం టౌన్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : పార్లమెంటులో కేంద్ర ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ లోరాష్ట్రానికి నిధులు కేటాయించకుండా మొండి చేయి చూపిందని సిపిఎం జిల్లా కార్యదర్శి జే ఎన్ వి గోపాలన్ విమర్శించారు కేంద్రం బడ్జెట్లో విశాఖ ఉక్కు, రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయిం చకపోవడం అమరా వతికి గ్రాంటు ఇవ్వడానికి బదులుగా అప్పులు ఇప్పించడం రాష్ట్రానికి, ప్రజలకు భారం తప్ప కేంద్రం చేసిందేముందన్నారు. మన రాష్ట్రానికి కేంద్రం సహాయం చేస్తున్న దని కూటమి నేతలు రోజూ గొప్పలు చెప్పుకోవటం సిగ్గుచేటని వారం వారం ఢిల్లీ ప్రదక్షిణలు చేస్తున్నా కేంద్రం నిధులు విదిల్చలేదన్నారు ఈ బడ్జెట్లో రాష్ట్రాలకు విడుదల చేయాల్సిన నిధుల్లో 2లక్షల కోట్లు కోతపెట్టారని కేంద్రంలో బిజెపిని బలపరు స్తున్న తెలుగుదేశం, వైసిపి పార్టీలు దీనిపై స్పందించాలన్నారు. రాష్ట్రానికి, దేశ ప్రజలకు అన్యాయం చేసి కేంద్ర నిధులను కార్పొరేట్లకు పరం చేసే కేంద్ర బడ్జెట్ను వ్యతిరేకించాలని, రాష్ట్రాభివద్ధికి నిధులు సాధించడానికి ఉద్యమించాలని జె.ఎన్.వి గోపాలన్ అన్నారు.

## పేదల వ్యతిరేక బడ్జెట్ : సీపీఐ
### జిల్లా కార్యదర్శి భీమారావు



భీమవరం టౌన్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తో పేద,మధ్యతరగతి ప్రజానీకానికి ఒనగూరే ప్రయోజనం శూన్యమని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో వ్యవసాయ కార్మిక,అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం ఊసే లేదన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలుకు నిధులు,పోలవరం ప్రాజెక్టు,రాజధాని అమరావతి నిర్మాణానికి తగినవిధంగా నిధులు కేటాయింపులు లేవన్నారు. ధరల నియంత్రణ, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు లేవని పేర్కొంటూ ఇది పేదల వ్యతిరేక బడ్జెట్ గా భీమారావు అభివర్ణించారు.

## కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణి



చాట్రాయి,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త : చాట్రాయి మండలం బూరుగుగూడెం గ్రామంలో కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డులను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ మేరకు నూజివీడు ఎక్సైజ్ మరియు ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మస్తానయ్య వారికి గుర్తింపు కార్డులను ఇవ్వగా నూతనంగా చేరిన కల్లుగీత కార్మికులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం నాయకులు కందుల కృష్ణ, మండల గౌడ సంఘం నాయకులు పానుగళ్ళ కోటేశ్వరరావు, బూరుగుగూడెం కల్లుగీత కార్మికుల సంఘ అధ్యక్షులు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పానుగళ్ళ కోటేశ్వరరావు తదితరుల చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఇజ్జిగాని మాట్లాడుతూ కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి అని కల్లుగీసే ప్రతి ఒక్కరు గుర్తింపు కార్డులు పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వెల్లంకి శ్రీమన్నారాయణ, పానుగళ్ళ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ అన్న సమారాధన,



పెనుమంట్ర, ఫిబ్రవరి-01, ప్రభాతవార్త: మండలంలోని నెగ్గిపూడి శివారు వనంపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భారీ అన్న సమారాధన జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

**నాపై దుష్ప్రచారం తగదు (తోలేటి) :-**

ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి రాంబాబు మాట్లాడుతూ ఆలయంపై వనంపల్లి గ్రామానికి చెందిన ఒకరు నాపై దుష్ప్రచారం చేస్తున్నాడని, పాంప్లెట్స్ వేసి, సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నాడని తెలిపారు. "నేను ఒకటే చెబుతున్నాను" ఈ గుడి మా తాతల కాలం నుండి వచ్చిందని, ఈ గుడిని ఎప్పుడు అభివృద్ధి చేస్తానే తప్ప, రాజకీయాలు నాకు అవసరం లేదన్నారు. నేను ఎవరికైనా సమాధానం చెప్పవలసి వస్తే భక్తులకు సమాధానం చెప్తానని అన్నారు. ఈ సందర్భంగా భక్తులతో మాట్లాడుతూ త్వరలో గుడి ఎదుట కళ్యాణ మండపం నిర్మిస్తామని తెలిపారు. దాతలు ఎవరైనా ఉంటే సహకరించగలరని కోరారు.

## అత్యంత వైభవంగా బాల రావమ్మ తిరునాళ్ల మహోత్సవాలు.



ఆగిరిపల్లి ఫిబ్రవరి 1 ప్రభాతవార్త. ఆగిరిపల్లి మండలంలో తోటపల్లి ఆగిరిపల్లి కనసహనపల్లి గ్రామాలలోని శ్రీ దుగ్గిరాల బాల రావమ్మ ఆలయాల వద్ద మాఘ పౌర్ణమి పురస్కరించుకుని తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి మహిళా భక్తులు పాల్గొని పాలు పొంగళ్ళు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆగిరిపల్లి బాల రావమ్మ తల్లి ఆలయం వద్ద ఉదయం అమ్మవారికి అభిషేకం విశేష అలంకరణ అనంతరము మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తోటపల్లి దుగ్గిరాల బాల రావమ్మ ఆలయం వద్ద ప్రభ మహోత్సవాలు అమ్మవారికి విశేష అలంకరణ నిర్వహించడం జరిగింది. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సాయంత్రం 6 గంటలకు ఉయ్యాల మండపం నందు పోలంగి సేవ వైభవంగా నిర్వహించారు.